ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

RNI NO.TELTEL / 2013 /50370

www.janamsakshi.org

బుధవారం 01.07.2026 | సంపుటి :12 సంచిక : 342 | పేజీలు :12 వెల : రూ. 4/-



సామాన్యుని స్వరం






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





## ఈ20 ఇంకా ప్రయోగాత్మకమే..

**వచ్చే ఏడాది ఫలితాలు: కేంద్రం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం ఇంకా ప్రయగాత్మక దశలోనే ఉందని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. దాని ఫలితాలు వచ్చే ఏడాదికల్లా వెల్లడి అవుతాయని తెలిపింది. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాల పనితీరు దెబ్బతింటోందని, మైలేజీ తగ్గుతోందన్న ఆందోళనలు నెలకొన్న వేళ ప్రభుత్వం నుంచి ఈ సమాధానం వెలువడడం గమనార్హం. ఈ20 వల్ల ఇంధన భద్రత, పర్యావరణానికి ప్రయోజనకరం అని మిగతా 2లో..



## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఊరట

**హైకోర్టులో విచారణ జూలై 6కు వాయిదా**

**హైదరాబాద్,జూన్ 30(జనంసాక్షి):** ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే జులై 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం మిగతా 2లో..

**ఇది బెంగాల్ కాదు**

# తెలంగాణలో భాజపా పప్పులుడకవ్

**భాజపాపై మండిపడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**కాళేశ్వరం కూలినా.. వరి సాగులో తెలంగాణ నంబర్ వన్**

రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరమైంది.బోరు కింద పంట పండితే కూడా కాళేశ్వరం మహిమ అని మోసం చేశారు.కూలిన కాళేశ్వరం నుంచి మూడేళ్లుగా చుక్క నీరు కూడా తీసుకోలేదు. కాళేశ్వరం కూలినా ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారు? ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా? దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా? పేదలకు డబుల్ బెడ్?రూం ఇళ్లు ఇచ్చారా?
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- కేసీఆర్ ఒక్కసారైనా రైతు రుణమాఫీ పూర్తిచేశారా?
- ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి తక్కువ వర్షాలు పడతాయి
- రైతుల వరిసాగు తగ్గించి మెట్ట పంటలు వేసుకోవాలి
- వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగలా చేస్తున్నాం
- అప్పుల ఊబిలో మునిగిన రాష్ట్రాన్ని నాకు అప్పగించారు
- రైతుభరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,జూన్ 30(జనంసాక్షి):** రూ.వేల కోట్ల కమిషన్ల కోసం బీఆర్ఎస్ హయాంలో హడావుడిగా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలినా.. ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. బోరు కింద పంటలు పండినా కాళేశ్వరం మహిమ అంటూ ప్రజలను మోసం చేశారని చెప్పారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో నిర్వహించిన సభలో రైతు భరోసా నిధుల పంపిణీని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా? ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారు?పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇంటికో ఉద్యోగం ఇచ్చారా? ఊరూరికి మిగతా 2లో..

## ఆలయ భూ కేటాయింపుల్లో పారదర్శకత

- యాజమాన్య హక్కులు ఆలయాలకే ఉండాలి
- తిరుమల తరహా విధానం అధ్యయనం చేయండి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ దిశానిర్దేశం

2లో..

## మహిళా సంఘాలకు విరివిగా రుణాలివ్వాలి

**హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధులతో సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి**

**దేశ నిర్మాణంలో యువతదే**

## కీలక భూమిక



**మనం అభివృద్ధి చెందడమే కాదు..వెనక ఉన్నవారిని ముందుకు తీసుకెళ్లాలి**

**గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

**విశాఖపట్నం(జనంసాక్షి):** దేశ నిర్మాణంలో విద్యావంతులైన యువతదే అత్యంత కీలక భూమిక అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. 'నేను కూడా ఒక మారుమూల గ్రామం నుంచి వచ్చిన మొదటి గ్రాడ్యుయేట్‌ను. ఈరోజు ఇంత మంది యువతీయువకులకు పట్టాలు అందించడం నాకు ఎంతో సంతోషాన్నిస్తోం దని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించే క్రమంలో సమాజంలో ఇంకా వెనుకబడి ఉన్న అట్టడుగు వర్గాలను మరవకూడదని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. 'మీరు జీవితంలో ముందుకు వెళ్లడమే కాదు.. ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్న ఎందరో పేదలు, అట్టడుగు వర్గాల వారు కనిపిస్తారు. వారిని ప్రోత్సహించడంలో మీ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా యువత మిగతా 2లో..

## సీఎస్‌గా భాధ్యతలు స్వీకరించిన సంజయ్‌జాజు

- పదవీ విరమణ చేసిన మాజీ సీఎస్‌రామకృష్ణారావు
- ముఖ్యమంత్రి సలహాదారుడిగా బాధ్యతల స్వీకరణ



**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వ కొత్త ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు బాధ్యతలు స్వీకరించారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టే ముందు సంజయ్ జాజు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అక్కడి నుంచి రామకృష్ణారావుతో కలిసి నేరుగా సచివాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. కొత్త సీఎస్‌కు పలువురు ఐఏఎస్, ఐపీఎస్, వివిధ శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.మధ్యప్రదేశ్‌కు చెందిన తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు, మిగతా 2లో..

# సభల పేరుతో కాంగ్రెస్ నాటకాలు

- అంతే తప్ప సర్కారు రైతులకు చేసిందేమీ లేదు: కేటీఆర్
- 30 నెలల్లో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధుల ఎగవేత
- ఆ పార్టీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించుకుంటున్నారు
- యూరియాపై అన్నదాతల దృష్టి మళ్లించే చర్యలని మండిపాటు



**హైదరాబాద్,జూన్ 30(జనంసాక్షి):** 30 నెలల పాలనలో రూ.30 వేల కోట్ల రైతుభరోసా నిధులను ఎగ్గొటారని, పైగా సభల పేరుతో నాటకాలు ఆడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. ఏకంగా నాలుగుసార్లు రైతు భరోసా నిధులను ఎగ్గొట్టారని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా మాజీ మంత్రి, బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శలు గుప్పించారు. మంగళవారం హైద రాబాద్ శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఎక్స్ వేదికగా మాజీ మంత్రి విరుచుకుపడ్డారు. మీ 30 నెలల ముదనష్టపు పాలనలో దాదాపు రూ.30 వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టడమే కాకుండా మళ్లీ సభల పేరిట నాటకాలు ఆడటానికి ఏమాత్రం సిగ్గనిపిస్తలేదా? గత రెండున్నరేళ్లలో ఎగ్గొట్టిందే ఎక్కువ అని 70 లక్షల మంది రైతులు శాపనార్థాలు పెడుతుంటే.. ఆశీర్వాద సభల పేరిట డ్రామాలా? కేవలం ఒక్క బటన్ నొక్కి వేయాల్సిన రైతుభరోసాకు మిగతా 2లో..

**బోనస్ హామీలు**

## బోగస్‌గా మారాయి

- అడుగడుగునా రైతులకు కాంగ్రెస్ మోసం
- పాలమూరు పరువు తీసేలా సీఎం తీరు
- జడ్చర్ల సభలో మాజీమంత్రి హరీశ్



**మహబూబ్‌నగర్,జూన్ 30(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అడుగడుగునా రైతులను మోసం చేస్తూనే ఉందని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ముఖ్యమంత్రి ప్రవర్తన, ఆయన మాట్లాడే తీరు పాలమూరు జిల్లా పరువు తీసేలా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ నిర్వహిస్తున్నది ఆశీర్వాద సభ కాదని, అది ముమ్మాటికీ రైతు వంచన సభేనని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జడ్చర్లలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ సమయాల్లో రేవంత్ రెడ్డి మిగతా 2లో..

## తెలంగాణను కాంగ్రెస్ అధిష్టానానికి ఏటీఎంగా మార్చేశారు

**బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శ**



**హైదరాబాద్,జూన్ 30(జనంసాక్షి):** కాంగ్రెస్ ఢిల్లీ దర్బార్‌కు తెలంగాణను ఏటీఎంగా మార్చారని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అధ్యక్షతన మల్కాజిగిరిలోని ఔషాపూర్ రాక్ ఎంక్లేవ్‌లో జరిగిన భాజపా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్ మాట్లాడారు. మోదీ నేతృత్వంలో భాజపా వెంట నడిచేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు. భాజపాను గెలిపించిన రాష్ట్రాల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. దేశంలో 12 ఏళ్లలో చాలా పరివర్తన వచ్చింది. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మిగతా 2లో..

## రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో విధ్వంసం చేసిన బీఆర్ఎస్

- రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్,జూన్ 30(జనంసాక్షి):** గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో విధ్వంసం చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. హైదరాబాద్‌లో జరిగిన రైతు భరోసా సభలో మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షలలోపు రైతు రుణాలను మాఫీ చేశామని మంత్రి తెలిపారు. అధికారంలోకి మిగతా 9లో..

**కట్టుకథలు చెబుతున్న వారి**

## మాటలు నమ్మకండి

- రైతుల సమస్యలు మాకు తెలుసు
- అందుకే మీకు అండగా నిలుస్తున్నాం
- రైతులకు డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క పిలుపు

**హైదరాబాద్,జూన్ 30(జనంసాక్షి):** తమ ప్రభుత్వానికి రైతుల కష్టాలు, వారి పంట కొనుగోలు సమస్యలు పూర్తిగా తెలుసని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అందుకే రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేశామని, అన్నదాతలకు పూర్తి భరోసా కల్పించేందుకే ఈ నిధులను విడుదల చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు భరోసా ఇచ్చి తీరుతామని, తాము అబద్దాలు చెప్పి పొద్దు గడుపుకునే రకం కాదని మిగతా 2లో..

# బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ సబబే..

**ట్రంప్‌కు అమెరికా సుప్రీంకోర్టులో చుక్కెదురు**



**న్యూయార్క్,జూన్ 30(జనంసాక్షి):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అమెరికా సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌ను అమెరికా సుప్రీంకోర్టు సమర్థించింది. అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలిక ప్రాతిపదికన నివసిస్తున్న తల్లిదండ్రులకు పుట్టే పిల్లలకు పౌరసత్వాన్ని నిరాకరిస్తూ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అమెరికా గడ్డపై జన్మించిన దాదాపు ప్రతి ఒక్కరికీ అమెరికన్ పౌరసత్వ హక్కును కొనసాగించేలా 6-3 మెజారిటీతో తీర్పు వెలువరించింది. అంతకుముందు, పౌరసత్వంపై ట్రంప్ విధించిన ఈ పరిమితులను అమెరికాలోని పలు కిందిస్థాయి కోర్టులు కొట్టేశాయి. ట్రంప్ ఉత్తర్వుల అమలును నిలిపివేశాయి. వీటిని సవాలు చేస్తూ అధ్యక్షుడు ట్రంప్ సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. గత కొన్ని నెలల నుంచి సుప్రీంకోర్టులో ఈ పిటిషన్‌పై విచారణ జరుగుతోంది. మంగళవారం జరిగిన విచారణలో కింది మిగతా 9లో..

## అయోధ్య దొంగలను కాపాడుతోంది ప్రధాని మోదీయే

**కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం ఆరోపణల వ్యవహారంపై కాంగ్రెస్ మంగళవారం తీవ్ర విమర్శలు గుప్పించింది. నిందితులను ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, మిగతా 2లో..






**అమెరికా-భారత్ ట్రేడ్ డీల్**

## తుది దశకు

**అమెరికా రాయబారి సెర్గియో గోర్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఇక, రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం గురించి అమెరికా రాయబారి ప్రస్తావిస్తూ.. "ట్రేడ్ డీల్‌పై తుది దశకు చేరుకున్నాం. చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. కేవలం ఒకటి లేదా 2 శాతం ఉత్పత్తులపై అంగీకారానికి రావాల్సి ఉంది. అతి త్వరలోనే ఈ ఒప్పందంపై ప్రకటన వస్తుంది" అని వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రంప్ భారత పర్యటన గురించి సెర్గియో గోర్ మాట్లాడారు. భారత్‌లో పర్యటించేందుకు అమెరికా అధ్యక్షుడు ఎదురుచూస్తున్నారని, మిగతా 2లో..

**అరుణాచల్‌లో చైనా చొరబాట్లు ..**

## అవాస్తవం



**మీడియా కథనాలను తోసిపుచ్చిన భారత ఆర్మీ**

**న్యూఢిల్లీ,జూన్30 (జనంసాక్షి):** చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని కొన్ని కథనాలు ప్రచారం కావడంతో, వాటిని భారత సైన్యం తోసిపుచ్చింది. ఆ కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేసింది. అదంతా ఎలాంటి ఆధారం లేకుండా జరుగుతోన్న అసత్య ప్రచారమని వెల్లడించింది. మీడియా కథనాల ప్రకారం.. అరుణాచల్ ప్రదేశ్ లోని తక్సింగ్ ప్రాంతంలోని నాహ్ ట్రైబల్ గ్రూప్‌నకు చెందిన నాహ్ వెల్ఫేర్ సొసైటీ .. ప్రభుత్వ అధికారులకు గతంలో ఒక వినతి ప్రతాన్ని సమర్పించింది. భారత్-చైనా సరిహద్దు సమీపంలో పీఎల్ఏ శిబిరాలను ఏర్పాటు చేసిందని అందులో ఆరోపించింది. గత 10- 15 సంవత్సరాలుగా చైనా సైనికులు తక్సింగ్ మిగతా 9లో..



**భారత నూతన ఆర్మీ చీఫ్‌గా**

## ధీరజ్ సేథ్

**పదవీ బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్**

**న్యూఢిల్లీ,జూన్30 (జనంసాక్షి):** భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ విభాగం మిగతా 9లో..

## బాధ్యతలు స్వీకరించిన సీఎస్ సంజయ్‌జాజు

2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో ఉండనున్నారు. సంజయ్ జాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, కేంద్ర సర్వీసుల్లో కీలక బాధ్యతల్లో పని చేశారు. క్షేత్రస్థాయి పోస్టులు మరోవైపు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాలనాపరమైన ఉన్నత హోదాల్లో చేసిన అనుభవం ఉంది. ముఖ్యంగా ఈ గవర్నెన్స్, పరిపాలనలో డిజిటల్ వినియోగంపై సంజయ్ జాజుకు పట్టు ఉంది.మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్, ఎంబీఏ ఫైనాన్స్ చదివిన సంజయ్ జాజు ఏపీలోని విజయవాడ సబ్ కలెక్టర్, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, హైదరాబాద్, విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ, పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, ఈ గవర్నెన్స్ కార్యదర్శిగా ఉన్నప్పుడు మీ సేవ ప్రాజెక్టు ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడంలో సంజయ్ జాజు కీలక పాత్ర పోషించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజు, 2014 నుంచి 2018 వరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ సమయంలోనే ఎన్‌హెచ్‌ఐడీసీఎల్ పూర్తి డిజిటల్ వ్యవస్థగా మారి జాతీయ ఈ గవర్నెన్స్ గోల్డ్ అవార్డు అందుకుంది. ఆ తర్వాత ఐదేళ్లు రక్షణ శాఖలో జాయింట్ సెక్రటరీ, అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. యూనియన్ సెక్రటరీగా పదోన్నతి పొందిన తర్వాత రెండేళ్ల పాటు సమాచార, ప్రసార శాఖకు నేతృత్వం వహించారు.అదనపు బాధ్యతలు : రెండు సంవత్సరాల నుంచి ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న సంజయ్ జాజు, ఇటీవలే తెలంగాణకు కేడర్‌కు తిరిగి వచ్చారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక సీఎస్‌గా కూడా సంజయ్ జాజు అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు. కీలకమైన ప్రాజెక్టులను పర్యవేక్షించేందుకు సీఎంవోలో ఏర్పాటు చేసిన స్పీడ్ విభాగం సీఈవోగా అదనపు బాధ్యతలూ నిర్వహిస్తారు. సీఎంవోలోని ఇండస్ట్రీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సెల్ ప్రత్యేక సీఎస్‌గా కూడా సంజయ్ జాజు వ్యవహరిస్తారు.

## బోనస్ హామీలు బోగస్‌గా మారాయి

మాట్లాడిన వీడియో క్లిప్పింగులను సభలో ప్రదర్శించిన హరీష్ రావు.. సీఎం అనుచిత వ్యాఖ్యల వల్ల ముఖ్యమంత్రి కుర్చీ విలువ కూడా పూర్తిగా తగ్గిపోయిందని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ ఎలాంటి హామీలు ఇవ్వకపోయినా, ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి పనులు చేసేవారని హరీష్ రావు గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతాంగానికి ఇచ్చిన బోనస్ హామీ అంతా ఒక బోగస్ వ్యవహారంగా మారిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయని, మార్కెట్లలో తరుగు పేరుతో నిరుపేద రైతులను దారుణంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. చివరకు రైతులకు సకాలంలో యూరియా ఇవ్వడంలో కూడా ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. షాపుల్లో అసలు యూరియా స్టాక్ ఉంచడం లేదు కాబట్టే.. ఆ నిజాన్ని కప్పిపుచ్చుకోవడానికి యాప్ లంటూ కొత్త కథలు మొదలుపెట్టారని దుయ్యబట్టారు. ఇదే క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు తీరుపై కూడా హరీష్ రావు చమత్కరించారు. జిల్లా మంత్రిగా ఉన్న జూపల్లి అసలు ఏం మాట్లాడుతాడో, ఎందుకు మాట్లాడుతాడో ఆయనకే అర్థం కాదంటూ ఎద్దేవా చేశారు. రైతుల సమస్యలను పట్టించుకోవడంలో జిల్లా మంత్రులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారని, కాంగ్రెస్ మార్క్ మోసపూరిత పాలనపై రైతాంగం తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హరీష్ రావు హెచ్చరించారు.జడ్చర్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఇవాళ హైదరాబాద్‌లో రైతుల ఆశీర్వాద సభ మీటింగ్ పెట్టిండు. నా దృష్టిలో రైతులను అడుగడుగున వంచించినవ్ కదా.. అది రైతు ఆశీర్వాద సభ కాదు.. రైతు వంచన సభ అని పెట్టుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. ఎన్నికల ముందు ఎకరానికి రూ.15 వేలు రైతు బంధు ఇస్తామని హామీనిచ్చిర్రు.. కానీ ఇచ్చిందెంత రూ.12 వేలు.. అవి కూడా ఒక పంట మొత్తానికే 9వేలు ఎగ్గొట్టిండు. ఒక పంట 3 ఎకరాలే ఇచ్చాడు. ఇంకో పంట 2 ఎకరాల వరకే ఇచ్చాడు.. వాళ్లిచ్చిన ప్రకారం లెక్క తీస్తే ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధుపై రూ.29300 కోట్లు రైతు బంధు పేరిట రైతులకు బాకీ పడిందన్నారు హరీశ్ రావు .జడ్చర్ల సభ నుంచి అడుగుతున్నా రేవంత్ రెడ్డి నువ్వు పెట్టుకున్న ఈ రైతు వంచన సభలో రూ.29300 కోట్లు ఎప్పటిలోపు ఇస్తావో తెలంగాణ రైతాంగానికి చెప్పాలని డిమాండ్ చేస్తున్నానన్నారు హరీశ్ రావు. ఈ బాకీ బడ్డ రైతు బంధు డబ్బులు ఎన్ని రోజుల్లోగా తిరిగిస్తావో చెప్పలని తెలంగాణ రైతుల పక్షాన, బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన నేను రేవంత్ రెడ్డిని అడుగుతున్నానన్నారు.

## సభల పేరుతో కాంగ్రెస్ నాటకాలు

కూడా బహిరంగ సభ పెట్టే.. నీ పీఆర్ స్టంట్లు చూసి రైతులు అసహ్యించు కుంటున్నారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా నాలుగుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిన మీ ద్రోహాన్ని రైతులు మరిచిపోతారని అనుకోవడం మీ అవివేకమే. ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని గ్యారెంటీల గారడీ చేసి, చివరికి ఉన్నది ఊడగొట్టే దుస్థితి తెచ్చినందుకు ముందు ముక్కునేలకు రాయాలి. అరకొరగా ఒకటి, రెండు ఎకరాలకు వేసినట్టు చేసి చేతులు దులుపుకుంటున్న మీ పాపం మిమ్మల్ని నిరంతరం శాపంలా వెంటాడటం ఖాయం. ఇప్పటికే రూ.50 వేల కోట్లతో చేయాల్సిన రెండులక్షల రుణమాఫీని, చారాణా కూడా చేయకుండా అధికారంలోకి రాగానే అన్నదాత గొంతుకోశావు. 72 సార్లు నీ ఢిల్లీ టూర్లకు, పనికిరాని ఈ పబ్లిక్ మీటింగ్‌లకు పెడుతున్న కోట్ల రూపాయల ఖర్చును ఆదాచేసి ఉంటే రైతులకు పెట్టుబడి సాయం దక్కేది. రాష్ట్రవ్యాప్తంగా యూరియా దొరకక అల్లాడుతున్న అన్నదాతల కష్టాల నుంచి అటెన్షన్ డైవర్షన్ చేసే ఈ దిక్కుమాలిన చర్యలు ఏమాత్రం పనిచేయవని గుర్తుపెట్టుకో. కేంద్రం ఎంత కొంటే అంతే కొంటామని పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్న మీ చేతకానితనాన్ని చూసి అన్నదాతలు పట్టలేని కోపంతో రగిలిపోతున్నారు. కేసీఆర్ టంచన్‌గా 11 సార్లు, రూ.73 వేల కోట్లను నేరుగా రైతుల ఖాతాలో వేసి రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి నాంది పలికారు. పదేళ్లు పండగలా సాగిన వ్యవసాయాన్ని దండగలా మార్చి, రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న మీ దుర్మార్గాన్ని అన్నదాతలు ఎన్నటికీ క్షమించే ప్రసక్తే లేదు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిచి ఉంటే.. మీరు ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలి ఉంటారని గుర్తుపెట్టుకోండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై విద్యార్థులకు ఊరట

చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్-9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది. హైకోర్టు జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులు జులై 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో సంబంధిత విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనిశ్చితికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన వివిధ అంశాలపై పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జులై 6వ తేదీ జరగనున్న తదుపరి విచారణలో ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలను పరిశీలించనుంది. అనంతరం హైకోర్టు మరిన్ని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది. ఈ కేసు తీర్పు రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు, విద్యాసంస్థలపై ప్రభావం చూపే అవకాశముండటంతో ఆసక్తి నెలకొంది.



### ఇది బెంగాల్ కాదు..

## తెలంగాణలో భాజపా పప్పలుడకవ్..

బెల్ట్ షాప్ తెచ్చి తాగుడు కల్చర్ నేర్పించారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే చేసేదేమీ ఉండదు. వరి వేస్తే ఉరే అని బెదిరించి రైతుల పంటను కొనలేదు. ఫామ్‌హౌస్‌లో కూర్చుని భార్యాభర్తలు మాట్లాడుకునే ఫోన్లు విన్నారు. దొంగచాటుగా తన ఫోన్లు విన్నారని స్వయంగా కేసీఆర్ కుమార్తె చెప్పారు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ అన్నారు.. వేశారా?ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఆయన చెప్పారు.. ఇచ్చారా?పశ్చిమ బెంగాల్‌లో ఉడికిన పప్పులు తెలంగాణలో ఉడకవు. అక్కడ గెలిచేందుకు భాజపాకు 15 ఏళ్లు పట్టింది. తెలంగాణలోనూ ఆ పార్టీ గెలవాలంటే మరో 15 ఏళ్లు పడుతుంది. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చాం. మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తున్నామని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. మహిళలతో ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేయించి యజమానులుగా చేశాం. రెండేళ్లలోనే 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి తక్కువ వర్షాలు పడ్డాయి. రైతుల వరిసాగు తగ్గించి మెట్ట పంటలు వేసుకోవాలి. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అనుకునేలా చేస్తున్నాం. 9 రోజుల్లో రైతుల ఖాతాల్లో రూ.9వేల కోట్లు వేస్తాం. ఒక్కో సమస్యను చక్కబెట్టుకుంటూ సంక్షేమం కొనసాగిస్తున్నాం. సాగు పనులు మొదలయ్యే నాటికే రైతుభరోసా అందిస్తున్నాం.

ఉమ్మడి రాష్ట్రాన్ని 19 మంది ముఖ్యమంత్రులు పాలించారు. వారు చేసిన అప్పు రూ.60వేల కోట్లు మాత్రమే. తెలంగాణ వచ్చాక కేసీఆర్ చేసిన అప్పు రూ.8.11లక్షల కోట్లు. అప్పుల ఊబిలో మునిగిన రాష్ట్రాన్ని నాకు అప్పగించారు. 2023లో సీఎస్ వంటి ఐఏఎస్ అధికారులకే 1న జీతాలు ఇవ్వలేని పరిస్థితి. కొన్నేళ్లుగా వాయిదాల పద్ధతిలో వస్తున్నాయని అధికారులు చెప్పారు. బడి పిల్లల తిండి బిల్లులు కూడా రూ.వేల కోట్ల బకాయిలు పెట్టారు. సర్పంచ్‌ల బిల్లులు రూ.వేలకోట్లు పెండింగ్ పెడితే.. వారు ఇప్పుడు ధర్నాలు చేశారు. బిల్లులు పెండింగ్ పెట్టింది కేసీఆర్.. ఆ బద్నాం మోసింది నేను. కేసీఆర్ చేసిన అప్పులతో దిల్లీలో కూడా పరువు పోయే పరిస్థితి వచ్చింది" అని రేవంత్ అన్నారు. రైతుల పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. 30 నెలల ప్రజాపాలనలో రైతు తలెత్తుకునేలా పాలన అందిస్తున్నామని అన్నారు. వ్యవసాయం దండగ కాదని, పండుగగా భావించే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా, 2023 నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందని అన్నారు. గత పదేళ్లలో దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన అప్పులు, తప్పుల భారం ఇప్పుడు తమ ప్రభుత్వం భరిస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. 'బకాయిలు పెట్టింది బకాసురుడు... కట్టే పాపం మాకా?' అంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో జీతాలు చెల్లించే పరిస్థితి నెలకొందని, ధనిక రాష్ట్రమంటూ గొప్పలు చెప్పి, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకెళ్లారని విమర్శించారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలంగాణ పరువు తీశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రజాపాలనలో ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద రూ.36 వేల కోట్లు రైతులకు అందించినట్లు సీఎం వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ నిలిపివేస్తారనే దుష్ప్రచారం చేశారని, కానీ 2004లో రైతులకు ఉచిత విద్యుత్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. రైతుల కోసం ప్రతి నెల సుమారు రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు, రైతు బీమా కోసం రూ.4 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం రూ.80 వేల కోట్లు వ్యయం చేసినట్లు సీఎం రేవంత్ వివరించారు.

## దేశ నిర్మాణంలోయువతదే కీలక భూమిక

పాత్ర ఎంతో కీలకమని, దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహా నుభావుల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ద్రౌపది ముర్ము ఆకాం క్షించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని ఆకాంక్షించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ కల సాకారం అవుతుందన్నారు. స్వయంకృషితో రాష్ట్రపతిగా ఎదిగిన వ్యక్తి ద్రౌపది ముర్ము అని కొనియాడారు. విద్యార్థులను భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దుతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా13 మందికి రాష్ట్రపతి బంగారు పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మంత్రి సంధ్యారాణి, ట్రైబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, వీసీ పాల్గొన్నారు.

## ఆలయ భూ కేటాయింపుల్లో పారదర్శకత

హైదరాబాద్(జనంసాక్షి): స్థలాలు ఎవరికి కేటాయించినప్పటికీ, ఆయా భూములపై పూర్తి యాజమాన్య హక్కులు మాత్రం ఆలయాలకే ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భూ కేటాయింపులపై ఉన్నతాధికారు లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ భూముల పరిరక్షణ, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన నిర్మాణాలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు భూమి కేటాయింపు విషయమై స్పందిస్తూ, సదరు ల్యాండ్‌ను ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే కేటాయించాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే, ఆలయ పరిధిలో వివిధ మఠాలకు స్థలాలు ఇచ్చే అంశంపై స్పష్టమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కుల సంఘాలకు స్థలాల కేటాయింపులపై కూడా నిర్దిష్ట నిబంధనలతో కూడిన ఒక పాలసీని సిద్ధం చేయాలని చెప్పారు. ఈ భూ కేటాయింపుల ప్రక్రియలో దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనుసరిస్తున్న నిబంధనలు, విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశర చేశారు. యాదగిరిగుట్టపై భక్తుల వసతి కోసం నిర్మించతలపెట్టిన అతిథిగృహాల నిర్మాణంలోనూ తిరుమల మోడల్‌నే అనుసరించాలని పేర్కొన్నారు. కొండపై కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి చూపే దాతలు, సంస్థల వివరాలతో కూడిన జాబితాను తక్షణమే రూపొందించాలని, వీరికి విడతలవారీగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణ పనులు, నాణ్యతపై గతంలో నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, దానిపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను తనకు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు గడువు విధించారు

## మహిళా సంఘాలకు విరివిగా రుణాలివ్వాలి

హైదరాబాద్(జనంసాక్షి):హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సీఎం రేవంత్ ప్రారంభించారు. రెండు అంబులెన్స్‌లతో పాటు భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సమకూర్చిన ఎంఆర్‌ఐ స్కానర్‌ను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రతినిధులతో సీఎం మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల నుంచి రుణాల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని.. విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు.

## ఈ20 ప్రయోగాత్మకమే..

కేంద్రం పేర్కొంటోంది. ఈ క్రమంలో ఓ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టులో తన వాదనను వినిపించింది.తమ వద్ద నుంచి ఇథనాల్ కొనుగోళ్లను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తగ్గించడాన్ని సవాల్ చేస్తూ..కర్ణాటక హైకోర్టును డిస్టిలరీ కంపెనీలు ఆశ్రయించాయి. దీంతో సరఫరాదారులకు అనుకూలంగా హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ప్రభుత్వరంగ చమురు కంపెనీ అయిన బీపీసీఎల్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి బీపీసీఎల్ తరఫున వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఈ20 పెట్రోల్ ప్రక్రియ ప్రయోగాత్మకంగా జరుగుతోందని, దీని ప్రభావం వచ్చే ఏడాది కనిపిస్తుందని తెలిపారు.అయితే, కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్‌కు ఎందుకు వెళ్లలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించగా.. అటార్నీ జనరల్ స్పందించారు. 2025 అక్టోబర్‌లోనే సప్లయ్ కాంట్రాక్టులు ఖరారయ్యాయని తెలిపారు. ఇదే తరహా కేసులు పలు హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఒకవేళ డివిజన్ బెంచ్‌కు వెళితే, ఇతర హైకోర్టుల నుంచి ఇదే తరహా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అటార్నీ జనరల్ సుప్రీంకోర్టుకు తెలిపారు. దీనివల్ల ఈ20 పాలసీకి విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. అక్టోబర్‌లోపు సప్లయ్ కాంట్రాక్టులు రెన్యువల్‌కు వస్తాయని, ఆలోపు దీనిపై నిర్ణయం వెలువడాల్సి ఉన్నందున సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఇథనాల్‌కు డిమాండ్‌ను బట్టి కంపెనీలకు సరఫరా ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

## తెలంగాణను కాంగ్రెస్ అధిష్టానానికి ఏటీఎంగా మార్చేశారు

పశ్చిమబెంగాల్‌లో ఎలా గెలిచారని చాలా మంది నన్ను అడుగుతున్నారు. భాజపా కార్యకర్తల కష్టాలతో పశ్చిమబెంగాల్‌లో గెలిచామని చెప్పాను. అక్కడ పార్టీ కార్యకర్తలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. అయినా, లెక్కచేయకుండా భాజపాని గెలిపించాలనే ఆలోచనతో వారు పనిచేశారు. సర్‌పై ప్రజలకు భాజపా కార్యకర్తలు అవగాహన కల్పించాలి. తెలంగాణలో సర్‌పై ప్రజలు సంతోషంగా ఉన్నారు. తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారు. ఇక్కడి నుంచి దిల్లీకి డబ్బులు వెళున్నాయి. దిల్లీ దర్బార్‌కు తెలంగాణ ఏటీఎంగా మార్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చింది.. కానీ, ఒక్కటికూడా పూర్తి చేయలేదు. కాంగ్రెస్.. అవినీతి, నేరాల తరహా పాలన చేస్తున్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ కలిసే ఉన్నాయి. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు ఇంకా అన్యాయం జరుగుతూనే ఉందని నితిన్ నబీన్ ఆరోపించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

## అయోధ్య దొంగలను కాపాడుతోంది ప్రధాని మోదీయే

బీజేపీ-ఆర్ఎస్ఎస యంత్రాంగం కాపాడుతోందని ఆరోపించింది. ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికను తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేసింది.రామమందిరం విరాళాల నిధులను దోపిడీ చేయడం 100 కోట్ల హిందువుల విశ్వాసంపై జరిగిన దాడిగా కాంగ్రెస్ అభివర్ణించింది. ఆలయ నిర్మాణ క్రెడిట్‌ను ఎలాగైతే ప్రధాని మోదీ తన ఖాతాలో వేసుకున్నారో, అదే విధంగా ఈ నిధుల దొంగతనానికి కూడా ఆయనే బాధ్యత వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. శ్రీరాముడి నిధులను దుర్వినియోగం చేసిన వారికి, ఆ పాపానికి ఒడిగట్టిన వారికి ఆ భగవంతుడే శిక్ష వేస్తాడని పేర్కొంది. అలాగే దేశ ప్రజలు బీజేపీని జవాబుదారీ చేస్తారని వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్? ఎక్స్ వేదికగా ఓ పోస్టు పెడుతూ, రాముడి పేరు జపించడం, ఇతరుల సంపదను తమ సొంతం చేసుకోవడమే మోదీ, ఆయన సహచరుల ఏకైక నినాదమని ఆరోపించారు.

మహాపాపం

కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్ కూడా ఈ వ్యవహారంపై తీవ్ర విమర్శలు చేశారు. అయోధ్య రామమందిర పవిత్ర విరాళాల దొంగతనాన్ని మహాపాపంగా అభివర్ణించారు. చరిత్రలో ఎన్నడూ హిందువుల విశ్వాసంపై ఇంతటి దాడి జరగలేదని అన్నారు. "ఇది కేవలం ఏదో విరాళాల దొంగతనమో లేదా కుంభకోణమో కాదు. ఇది ఒక మహాపాపం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల నమ్మకంపై జరిగిన దాడి" అని ఆమె మండిపడ్డారు. ఈ విషయంలో ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ఆమె ప్రశ్నించారు. అయోధ్య రామమందిరం శంకుస్థాపన నుంచి ప్రాణ ప్రతిష్ఠ వరకు ప్రతీదానికి క్రెడిట్ తీసుకున్న ప్రధాని, ఈ దొంగతనానికి కూడా బాధ్యత వహించాలని ఆమె అన్నారు. ఈ కేసు దర్యాప్తును సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. యూపీ ప్రభుత్వంపై తమకు నమ్మకం లేదని, ఎందుకంటే నిందితుడు, ప్రాసిక్యూటర్?, జడ్జి ముగ్గురూ ఒక్కరే కాలేరని ఆమె అన్నారు.

చంపత్ రాయ్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసిన పోలీసులు

మరోవైపు అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు. ఈ వివాదానికి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడిన కొన్ని రోజులకే ఈ పరిణామం జరిగింది. రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు మంగళవారం పోలీస్ అధికారులు తెలిపారు. అయితే ఈ విచారణ ఎప్పుడు, ఎక్కడ, ఎంత సేపు జరిగిందనే వివరాలను వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. అయితే విరాళాల దొంగతనం వ్యవహారం పెద్ద రాజకీయ వివాదంగా మారడానికి ముందే చంపత్ రాయ్‌కు దీని గురించి సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సదరు నిధుల దొంగతనానికి సంబంధించిన పూర్తి వివరాలను, పత్రాలను సమర్పించాలని పోలీసులు ఆయనను కోరినట్లు సమాచారం. కాగా, ఈ దొంగతనం గురించి తెలిసిన వెంటనే పోలీసులకు తెలిపి, ఎఫ్?ఐఆర్ నమోదు చేయించకపోవడం తన తప్పేనని చంపత్?రాయ్? అంగీకరించినట్లు వార్తలు వచ్చాయి. ఇదే ప్రశ్నను అడగగా, ఓ పోలీసు అధికారి స్పందిస్తూ, 'ఇలాంటి విషయాలపై మేమేమీ చెప్పలేం. విచారణలో ఏం తేలిందనేది అత్యంత రహస్యం. దానిని మేము బయటపెట్టలేం' అని స్పష్టం చేశారు.

జులై 6న అత్యవసర భేటీ

ఈ వివాదం వల్ల ఇప్పటికే ఇద్దరు సీనియర్ సభ్యులు రాజీనామా చేసిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు జులై 6న అయోధ్యలో సమావేశం కానుంది. వాస్తవానికి ఈ సమావేశం జులై 7న జరుగుతుందని విశ్వహిందూ పరిషత్ అధినేత ఆలోక్‌కుమార్ చెప్పినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం ఈ భేటీని ఒక రోజు ముందుకు జరిపినట్లు అంతర్గత వర్గాలు వెల్లడించాయి. ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్?, సభ్యుడు అనిల్ మిశ్రా ఇప్పటికే తమ పదవులకు రాజీనామా చేశారు. జులై 6న జరగనున్న సమావేశంలో వీరి రాజీనామాలపై ప్రధానంగా చర్చించనున్నారని, వాటిని ఆమోదించే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

## కట్టుకథలు చెబుతున్న వారి మాటలు నమ్మకండి

హితవు పలికారు. శిల్పకళావేదికలో అట్టహాసంగా నిర్వహించిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ అబద్దాలు చెబుతూ పబ్బం గడుపుకునే నేతల మాటలు నమ్మవద్దన్నారు. కేటీఆర్, హరీష్ రావుల తీరుపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంపై పడి వీరిద్దరూ కట్టుకథలు అల్లుతూ తిరుగుతున్నారని మండిపడ్డారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీష్ రావు, ఇప్పుడు కాంగ్రెస్ పెట్టేది ఆశీర్వాద సభ కాదు క్షమాపణ సభ అనడం చూస్తుంటే.. అసలు ఆయన పదేళ్లు మంత్రిగా ఎలా పనిచేశాడో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రాన్ని దారుణంగా దోపిడీ చేసి, ఇప్పుడు ఏమీ తెలియనట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల అప్పులు చేసి రైతులకు ఏం చేసిందో తాము లెక్కలు తీశామని, వారు పదేళ్ల పాలనలో కేవలం 2 లక్షల 88 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి దాన్ని పెద్ద గొప్పగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిన్నర కాలంలోనే ఏకంగా 1 లక్ష 56 వేల కోట్లు ఖర్చు చేశామని, అయితే తాము చేసిన పనులను సరిగ్గా చెప్పుకోలేకపోతున్నామని భట్టి విక్రమార్క అన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ పేలుడు

**పేలుడు ధాటికి గోడలు, కిటికీలు ధ్వంసం.. పేలుడు మిస్టరీపై పోలీసులు ఆరా**

హైదరాబాద్,జూన్30(జనంసాక్షి): హైదరాబాద్ నగరంలోని సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ పేలుడు తీవ్ర కలకలం రేపింది. రోడ్ నంబర్-4లోని ఓ రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఇంటి గోడలు, తలుపులు, కిటికీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే ఈ పేలుడు ఎలా జరిగిందనేది మిస్టరీగా మారింది. ఇంట్లోని మూడు గ్యాస్ సిలిండర్లు, ఫ్రిజ్, గీజర్ పేలలేదని తేలింది. అలాగే అగ్నిప్రమాద ఆనవాళ్లు కూడా కనిపించలేదు. ఘటన సమయంలో కుటుంబసభ్యులు ఇంట్లోనే ఉన్నారు. వీరంతా ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి దేవేందర్ తన భార్య, కుమారుడితో కలిసి గత 24 సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నారు. మంగళవారం ఇంట్లోని వంటింట్లో ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. పేలుడు ధాటికి ఇల్లు తీవ్రంగా దెబ్బతిన్నది. పేలుడు మిస్టరిగా మారింది. ఇంట్లో అగ్ని ప్రమాదం ఆనవాళు కూడా కనిపించలేదు. భారీ శబ్దానికి, ఇంటి ధ్వంసానికి కారణమేంటనేది ప్రశ్నార్థకంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సరూర్‌నగర్ పరిధిలోని బాపూనగర్ రోడ్ నెంబర్-4లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్ అతని భార్య, కుమారుడితో కలిసి 24ఏళ్లుగా నివాసముంటున్నారు. అతని ఇంట్లోని కిచెన్‌లో ఈ ఘటన జరిగింది. నిపుణుల సాయంతో ఇల్లు ధ్వంసానికి గల కారణాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

## అమెరికా-భారత్ ట్రేడ్ డీల్.. తుది దశకు

మధ్యంతర ఎన్నికలకు ముందే ఈ పర్యటన ఉండొచ్చని తెలిపారు.భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ఇరు దేశాధినేతల స్నేహం మూలస్తంభం అని యూఎస్ రాయబారి సెర్గియో గోర్ అన్నారు. వాషింగ్టన్ వేదికగా ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న ఆయన.. మోదీ-ట్రంప్ బంధాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఓ సంఘటనను గుర్తుచేసుకున్న ఆయన.. ప్రధాని మోదీకి ఓసారి ట్రంప్ ఉదయం ఆరు గంటలకే ఫోన్ చేయాలనుకున్నట్లు తెలిపారు."రెండు నెలల కిందట మియామిలో యూఎఫ్‌సీ ఈవెంట్ జరిగింది. ఆ సమయంలో నేను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉన్నాను. వేదిక పక్కన మేం మాట్లాడుకుంటూ ఉండగా.. 'మోదీకి కాల్ చేద్దాం' అని ట్రంప్ అన్నారు. 'ఇప్పుడు భారత్‌లో సమయం ఉదయం 6 గంటలు' అని నేను చెప్పా. దానికి అధ్యక్షుడు బదులిస్తూ.. 'ఏం ఫర్వాలేదు. ఆయన (మోదీ) నిద్రలేచే ఉంటారు. ఎక్కువ సేపు పడుకోరు. ఆయనకు నేనంటే ఇష్టం' అని అన్నారు. ఆ తర్వాత ట్రంప్ వేరే బాధ్యతల్లో ఉండటంతో మోదీతో కాల్‌ను మరుసటి రోజుకు షెడ్యూల్ చేశారు. అయితే, ఈ సంఘటన వారిద్దరి మధ్య మైత్రిని చాటిచెబుతుంది. ఎవరితోనైనా స్నేహం చేస్తే.. ప్రతిదాన్నీ షెడ్యూల్ చేసుకోవాల్సిన అవసరం లేదని ట్రంప్‌ను చూశాక నాకనిపించింది. మోదీ ఆయనకు గొప్ప స్నేహితుడు" అని సెర్గియో గోర్ వెల్లడించారు.

లెటర్‌హెడ్‌లో పేరు మారితే పట్టించుకోవద్దు..కాగా.. ఈ సదస్సులో అమెరికా రాయబారి పలు అంశాల గురించి మాట్లాడారు. ఇటీవల అగ్రరాజ్యానికి చెందిన 'ఇండో-పసిఫిక్ కమాండ్' పేరులో 'ఇండో' పదాన్ని తొలగించిన సంగతి తెలిసిందే. దీనిపై సెర్గియో గోర్ స్పందిస్తూ.. "లెటర్‌హెడ్‌పై ఏం పేరు ఉందన్న విషయాన్ని పట్టించుకోవద్దు. అమెరికా వాస్తవంగా ఏం చేస్తుందో.. ఆ చర్యలనే గమనించాలన్నారు.



## మంచి సమాజ నిర్మాణానికి తరగతి గదే పునాది

- బహుజన ఉద్యమ కవి, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తరగతి గదిలో బోధన సమర్థవంతంగా ఉంటేనే పటిష్టమైన సమాజ నిర్మాణం జరుగుతోందని బహుజన ఉద్యమ కవి, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ అన్నారు. దేశంలో రూపురేఖలు తీర్చిదిద్దబడే తరగతిగదిలో బోధన సమర్థవంతంగా లేకపోతే సమాజం అనేక దుష్ఫలితాలను చవిచూడవలసి వస్తుందన్నారు. సాధకులను తయారు చేసే బోధకులు దేశభక్తియుతమైన భావితరాన్ని తరగతి గది నుంచే తయారు చేయాలన్నారు. గద్వాల సమీపంలోని జమ్మిచెడు సివిజ్జి ఫంక్షన్ హాల్ లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కే. కృష్ణయ్య పదవీ విరమణ సభలో జూలూరు అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నిత్యం జరిగే సంఘర్షణల నుంచి సమాజాన్ని సంరక్షించే బాధ్యత కూడా తరగతిగదే తీసుకోవాలని తెలిపారు. సమాజాన్ని సరైన దారిలో నడిపించేందుకు భావితరాన్ని తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులే తమ భుజస్కందాలపై వేసుకోవాలని కోరారు. రాజ్యాంగం సాక్షిగా అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక రాజకీయ సామాజిక న్యాయం దక్కాలని జూలూరు తెలిపారు. రామానంద తీర్థ గ్రామీణ విద్యా సంస్థ చైర్మన్ నారా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణయ్య ఉపాధ్యాయ వృత్తికి నైతిక విలువలకు కట్టుబడి పనిచేసిన ఉపాధ్యాయుడుగా నిలబడ్డారని చెప్పారు. గద్వాలలో జరిగిన సామాజిక ఉద్యమాలలో కృష్ణయ్య తన వంతు పాత్రను పోషించారని చెప్పారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ వై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలోని అంతరాలు సమసి పోయే విధంగా చేసి సర్వజన హితము కోరే బాధ్యత కూడా ఉపాధ్యాయులదేనని తెలిపారు. ఎన్ ఎస్ ఆర్ బిఈడి కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ వెంకన్న మాట్లాడుతూ కృష్ణయ్య విద్యార్థి దశనించే ప్రగతిశీలభావాలతో ఎదిగారని తెలిపారు. ఈ సభలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సెక్రటరీ కే వామన్ కుమార్, జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ శాస్త్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీశైలం యాదవ్, న్యాయవాది ఎం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్‌లో ఎకరమూ ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి

- డీఈలు, ఏఈలు, జేఈలు గ్రౌండ్ లెవెల్‌లో పర్యవేక్షణ పెంచాలి
- ఇరిగేషన్ అధికారులతో సమీక్ష ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హనుమకొండ ప్రతినిధి జూన్ 30 (జనం సాక్షి) :** హనుమకొండలోని చింతగట్టు నీటిపారుదల శాఖ కార్యాలయంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, దేవాదుల ఎత్తిపోతల పథకం, గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీటి సరఫరా, రిజర్వాయర్ల నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమీక్ష సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, జూన్--జులై నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో మెట్టపంట సాగు చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా దేవాదుల ఎత్తిపోతల పథకం మరియు గోదావరి లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రతి ఆయకట్టుకు సాగునీరు అందించడం అత్యవసరమని సూచించారు. రైతుల సంక్షేమమే మన ధ్యేయం. ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గ పరిధిలోని ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదు. ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోకుండా అధికారులు బాధ్యతగా పనిచేయాలి" అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని రిజర్వాయర్లు, ముఖ్యంగా అశ్వరావుపల్లి రిజర్వాయర్ పరిధిలోని చెరువులకు నీరు చేరేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటలు నిండితే భూగర్భ జలాలు పెరిగి రైతులకు దీర్ఘకాలికంగా ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాదుల నీటితో ప్రతి రైతుకు సాగునీరు అందేలా చూడాలని, వర్షాభావ పరిస్థితుల వల్ల ఎవరూ నష్టపోకుండా పక్కా ప్రణాళికతో పనిచేయాలని అన్నారు. డీఈలు, ఏఈలు, జేఈలు గ్రౌండ్ లెవెల్‌లో నిరంతరం ఫీల్డ్ పర్యటనలు చేస్తూ పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు.

## బావుపేట్ రహదారిపై నాలుగేళ్లుగా నరకయాతన

### టీఆర్పీ ఆధ్వర్యంలో రహదారి పై ధర్నా



**కరీంనగర్ (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట్ గ్రామ ప్రధాన రహదారి గత నాలుగు సంవత్సరాలుగా పూర్తిగా అధ్వాన్నంగా మారి ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మండిపడ్డా రు. గ్రామ ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేస్తూ కొత్తపల్లి మండల అధ్యక్షులు ఓర్సు రాజు ఆధ్వర్యంలో బావుపేట్ గ్రామంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ, నాలుగేళ్లుగా ప్రజలు రోడ్డు కోసం ఎదురుచూస్తున్నా పాలకులు, అధికారులు కనీస బాధ్యత కూడా తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. వర్షాకాలంలో రహదారి బురదమయంగా మారి విద్యార్థులు, రైతులు, మహిళలు, అత్యవసర సేవలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, కొత్తపల్లి మండల అధ్యక్షులు ఓర్సు రాజు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా నాయకులు మహబూబ్ అలీ, కొత్తపల్లి మండల అధ్యక్షులు ఓర్సు రాజు, మండల మహిళా అధ్యక్షురాలు ఓర్సు విమల, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ దారంగుల గణేష్, నరేష్ మోహన్, మురళి, కార్తీక్, శేఖర్, రాజు, మహేందర్, సంపత్, విజయలక్ష్మి, సిద్ధు, వేణు, గణేష్, శ్రీను పాల్గొన్నారు.

## బ్యాంక్ ఆఫ్ బరోడా మరో మైలురాయి

### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు 2,811 కోట్ల డివిడెండ్ అందజేత



**ముంబై (జనంసాక్షి):** భారతదేశపు అంతర్జాతీయ బ్యాంకు అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా, 31 మార్చి 2026తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికిగాను, కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్‌కు 2,811 కోట్ల డివిడెండ్ చెక్కును అందజేసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ డాక్టర్ దేబదత్త చంద్, ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) కార్యదర్శి సంజయ్ లోహియా, ఐఏఎస్, బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు లలిత్ త్యాగి, సంజయ్ ముదలియార్, లాల్ సింగ్, బీనా వాహిద్ సమక్షంలో ఆర్థిక మంత్రికి డివిడెండ్ చెక్కును అందజేశారు. ఈ డివిడెండ్ చెల్లింపు, బ్యాంక్ ఆఫ్ బరోడా బలమైన ఆర్థిక పనితీరును, వాటాదారులందరికీ దీర్ఘకాలిక విలువను సృష్టించడంలో దాని నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. 20,021 కోట్ల స్టాండ్‌అలోన్ నికర లాభాన్ని నివేదించింది. మార్చి 31, 2026 నాటికి బ్యాంక్ గ్లోబల్ బిజినెస్ కూడా 30 లక్షల కోట్లను అధిగమించింది.

# మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూత

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 30 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూత ఇస్తుందని రాష్ట్ర కార్మిక మంత్రి గడ్డం వివేక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలో గ్రామైక్య సంఘ భవనం, ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసిల్దార్ వనజ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూత అందించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. గ్రామంలో 15 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి 2022-23 నిధులతో గ్రామైక్య సంఘ భవనం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మహిళల సంక్షేమంలో భాగంగా వివిధ వ్యాపార రంగాలలో మహిళా భాగస్వామ్యాన్ని స్వాగతిస్తూ అవసరమైన రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహిస్తుందని, మహిళా సంక్షేమంలో భాగంగా అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళను కుటుంబ పెద్దగా గుర్తిస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, రాష్ట్రంలో 21 వేల కోట్ల రూపాయలు స్వయం సహాయక సంఘాలకు అందించడం జరిగిందని తెలిపారు. రుణ సదుపాయం పొందిన స్వయం సహాయక సంఘాలు సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే మరింత రుణం పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసించే విద్యార్థులకు ఏకరూప దుస్తుల తయారీలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. పెట్రోల్ బంకుల ఏర్పాటు, నిర్వహణకు మహిళా సంఘాలకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయబడి వచ్చే నెలాఖరుకు దాదాపు 1 వేయి ఇండ్లు పూర్తి కానున్నాయని, మిగతావి పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రేషన్ కార్డుదారులకు చౌక ధరలు దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అధికారుల సమన్వయంతో జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, వివిధ వ్యాపారాలలో మహిళల భాగస్వామ్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, గుడిసెలలో ఉండేవారు, అర్హులైన నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవన్ ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలోని పలు ప్రాంతాలలో మహిళ భవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మహిళా సంఘాల సమావేశాలు, ఇతర పనులకు వినియోగించుకోవచ్చని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. అనంతరం విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.

## ఖమ్మంలో ఏం జరుగుతోంది?

- పంట కాలువలోకి గ్రావెల్..
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం




**ఖమ్మం, (జనంసాక్షి):** ఖమ్మం నగరం నడిబొడ్డున.. నిత్యం రద్దీగా ఉండే వైరా రోడ్డు పక్కన.. జిల్లా కోర్టు ఎదురుగా, సీఆర్‌జీ టవర్స్ పక్కన పట్టపగలే జరుగుతున్న ఓ పని స్థానికుల్లో అనుమానాలకు తావిస్తోంది. అక్కడ అసలు ఏం జరుగుతుందో ఎవరికీ స్పష్టంగా తెలియడం లేదని వారు అంటున్నారు. సాగర్ కాలువ నుంచి చిన్న కాలువ ద్వారా లకారం చెరువుకు నీరు చేరే పంట కాలువ క్రమంగా కుచించుకుపోతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో గ్రావెల్ తోలకం జరుగుతుండగా, ఆ గ్రావెల్ కాలువలోకి జారిపడి నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తోంది. దీంతో కాలువ మరింత మూసుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్ఎస్‌పీ అధికారులు స్పందించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. జిల్లా కలెక్టర్ వెంటనే దృష్టి సారించి చర్యలు తీసుకోకపోతే పంట కాలువ పూర్తిగా ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## హెల్త్ స్కీం మినహాయింపులలో సవరణలు చేయాలి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా మన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య పథకాన్ని అమలు చేయడంలో భాగంగా ప్రభుత్వం జిఓ 79 తేది 29.06.2026 ద్వారా ఉద్యోగులు, పెన్షనర్ల నుండి కాంట్రిబ్యూషన్ మినహాయింపులు ఎలా చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. అందుకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి ధన్యవాదములు తెలియజేసింది. అదే సందర్భంలో ఒక కుటుంబంలోని భార్య భర్తలు ఇరువురు పెన్షనర్లు అయిన సందర్భంలో మరియు ఒక ఉద్యోగి కుటుంబ తాను చేస్తున్న ఉద్యోగానికి వేతనంతో బాటు కుటుంబ పెన్షన్ తీసుకుంటున్న సందర్భంలో మినహాయింపులు రెండు జరిగే ప్రమాదం ఉందనీ, ఈ రెండు సందర్భాలలో ఒకే మినహాయింపు జరిగేలా నిన్న ప్రభుత్వ ఇచ్చిన ఉత్తర్వులకు సవరణ చేయాలని ప్రాతినిధ్యం చేయడం జరిగిందని టాప్ర రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి నారాయణ రెడ్డి మరియు పి క్రిష్ణ మూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## మామను నిర్బంధించిన కోడలు..

- ప్రముఖ డాక్టర్ నిర్వాకం..



**నర్సంపేట, జూన్ 30 (జనం సాక్షి) :** మానవ సంబంధాలు మనీ సంబంధాలుగా మారుతుండగా తల్లిదండ్రులను చూసుకున్నట్లు మామ పట్ల మానవత్వాన్ని మరిచి గృహంలో నిర్బంధించి ఇంటి తలుపులకు తాళాలు వేయడంతో బాధిత మోతెరంగారెడ్డి గృహ నిర్బంధంలో ఉండడంలో నర్సంపేటలో వార్త దావనంలో వ్యాప్తి చెందడంతో సంఘటనపై బాధితులు రంగారెడ్డి స్థానిక పోలీసులను ఆశ్రయించారు. నర్సంపేట పట్టణంలో బాధిత రంగారెడ్డి రెండున్నర గంటల పాటు గదిలో ఊపిరాడక కిటికీ రెక్కలు పగల కొట్టి ఇరుగుపొరుగు వారికి సమాచారం తెలపడంతో నిర్బంధించిన విషయం ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. సమీప బంధువులు గమనించి 100 డయల్ చేయడంతోసంఘటన స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు..చేరుకొని బంధువుల సమక్షంలో గది తాళాలు పగలు కొట్టి బంధ విముక్తడిని చేశారు. తన కోడలు డాక్టర్ నవత, మరికొందరి ప్రోద్బలంతో తాళాలు వేసి నిర్బంధించిందని మామా రంగారెడ్డి వెల్లడించారు. గతకొన్నాళ్లగా కుటుంబ కలహాలు ఉన్నాయని, తన కుమారుడు ఇంటినుంచి బయటకు వెళ్లాడని తెలిపాడు.. కోడలు, అతని అనుయులతో తనకు ప్రాణాపాయం ఉందని రంగారెడ్డి వాపోయారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితుడు రంగారెడ్డి ఫిర్యాదు చేయడంతో ఒక్కసారిగా నిర్బంధ పై నర్సంపేట పట్టణంలో తీవ్ర చర్చకు దారి తీసింది. కుటుంబంలో ఇంటి ఆస్తి సంబంధించి వివాదం కొనసాగుతుండగా తన కొడుకును బెదిరించి బెదిరించాలని కోడలు ఆస్తి విషయములో వివాదం చేస్తుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు నేను బాత్రూంలో స్నానం చేయుచుండగా నన్ను నా రూంలో నిర్బందించి నా రూంకు తాళం వేసి నా సెల్ఫోన్ తీసుకొని పోయిందని వివరించారు. నేను బాత్రూం కిటికి అద్దం పగుల గొట్టి ఇంటిపక్క రత్నంకి అరుస్తు చెప్పగా గుత్త రత్తయ్య నా బావ మొట్ల రాజిరెడ్డి కి పోన్ చేయగా నా బావ రాజిరెడ్డి, నా తమ్ముడు మోతె నరేందర్ రెడ్డి వచ్చి నా తమ్ముడు పోలీస్ వారికి పోను చేయగా పోలీసు వారు వచ్చి చూడగా వారి ముందు అట్టి తాళం పగుల గొట్టి నన్ను ఇంట్లోంచి బయటికి తీసినారని రంగారెడ్డి వెల్లడించారు. నా కోడలు మోతె నవత నన్ను రూంలో నిర్బందించి నన్ను భయభ్రాంతులకు గురి చేసినందున తనపై చట్ట రీత్య చర్య తీసుకొని నాకు న్యాయం చేయగలని రంగారెడ్డి పోలీసులను కోరారు.

## బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం

- ప్రమాదంతో తల్లి మృతి.. కొడుకు గాయాలు

**హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి) :** నగరంలోని దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం నెలకొంది. కన్న కొడుకు కళ్ల ముందే తల్లి దుర్మరణం చెందింది. మంగళవారం ఉదయం బహదూర్ పల్లి గ్రామం మెయిన్ రోడ్‌పై మద్యం మత్తులో బొలెరో డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. బైక్‌పై వెళ్తున్న తల్లీకొడుకును బొలెరో వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లి ఉదయ్ లతారెడ్డి(49) అక్కడికక్కడే మృతిచెందగా.. కొడుకు వేదాంత్ రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన వేదాంత్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే లతారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు అయ్యింది.

## 6, 7 తేదీల్లో ఏఐఎస్‌జీపీఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌జీపీఎఫ్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు వచ్చేనెల అంటే జులై 6 మరియు 7వ తేదీల్లో హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్నాయి. ఈ సమావేశాలకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సమావేశాలకు దేశంలోని 15 రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ సమావేశాల నిర్వహణకు గాను, అతిథులను ఆహ్వానించడానికి సమావేశాలు నిర్వహణ ఏర్పాట్లు చేయుటకు టాప్ర ఒక ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఆహ్వాన సంఘానికి అధ్యక్షులుగా డా ఎల్ అరుణ, డా బి స్వరాజ్ కుమార్ కన్వీనర్ గా మరియు ఎస్ వఐ కొండల రావు ఆర్థిక కార్యదర్శిగా టాప్ర రాష్ట్ర కమిటీ సభ్యులు మరియు తెలంగాణ లోని అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులను సభ్యులుగా ఎన్నుకున్నారు. గత ఫిబ్రవరి నెలలో హర్యానాలోని కురుక్షేత్రలో జరిగిన ద్వితీయ మహాసభలలో తీసుకున్న భవిష్యత్ కర్తవ్యాలను సమీక్షించుకుని వచ్చే రెండు సంవత్సరాలకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలపై కార్యాచరణ ఈ జాతీయ కౌన్సిల్ సమావేశాలలో నిర్ణయించుకోనున్నారు. ముఖ్యంగా సిపిఎస్ పెన్షన్ విధానం స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించడానికి, కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని 15 సంవత్సరములనుడి 11 సంవత్సరములకు తగ్గించడానికి మరియు ఉద్యోగ విరమణ అనంతరం పెన్షనర్లు గౌరవప్రదమైన జీవనము గడపడానికి కావలసిన పరిస్థితులను కల్పించుకోవడానికి తీసుకోవలసిన చర్యల గురించి చర్చించ నున్నారు. మంగళవారం రాష్ట్ర కార్యాల యంలో టాప్ర రాష్ట్ర అధ్యక్షులు పి నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

## ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదల వాయిదా

**అమరావతి, జూన్30 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-2026 ఫలితాల విడుదలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. సీబీఎస్సీ 12వ తరగతి ఫలితాలు పూర్తి స్థాయిలో రానందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## 'నషా ముక్త్ భారత్ అభియాన్'కు బ్యాంక్ ఆఫ్ బరోడా మద్దతు




**ముంబై, జూన్ 26 (జనంసాక్షి) :** భారతదేశంలోని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా, భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో "నషా ముక్త్ భారత్ అభియాన్ – – విక్సిత్ భారత్ కీ పెహచాన్" అనే ఇతివృత్తంతో జూన్ 17 నుండి జూన్ 26, 2026 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ సప్తాహ్' ప్రచారంలో చురుకుగా పాల్గొంది. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రచారాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించడం, మాదకద్రవ్య రహిత భారతదేశం కోసం సామూహిక చర్యలను ప్రోత్సహించడం దీని లక్ష్యం. ఈ చొరవలో భాగంగా, బ్యాంక్ ఆఫ్ బరోడా తన వెబ్‌సైట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, బ్రాంచ్ నెట్‌వర్క్‌తో సహా తన డిజిటల్, భౌతిక మాధ్యమాల ద్వారా ప్రచార సందేశాన్ని విస్తృతంగా వ్యాప్తి చేసింది. విస్తృత ప్రచారం కోసం, ఈ ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, శాఖలంతటా ప్రచార సామగ్రిని, అవగాహన బ్యానర్లను ప్రదర్శించారు. ఆరోగ్యకరమైన, వ్యసన రహిత జీవితాన్ని గడపడం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి, ప్రగతిశీల, బాధ్యతాయుతమైన సమాజం అనే ఆశయానికి మద్దతు ఇవ్వడానికి బ్యాంక్ తన విస్తృతమైన కస్టమర్, భాగస్వాముల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా, బ్యాంక్ ఆఫ్ బరోడా సామాజిక బాధ్యతకు, సమాజాల శ్రేయస్సుకు దోహదపడే దేశ నిర్మాణ కార్యక్రమాలకు తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.



సంపాదకీయం

## జంజీ, గంజాయి మత్తు వదలాలి

# యువత మేల్కోవాలి

తెలంగాణ నేల పోరాటాల నేల. ఈ నేలమీద పుట్టిన ప్రతి ఉద్యమం వెనుక ఒక నినాదం ఉంది, ఒక త్యాగం ఉంది, ఒక కల ఉంది. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా నాటి విద్యార్థి లోకం పిడికిలి బిగించింది. జగిత్యాల జైత్రయాత్ర, ఇంద్రవెల్లి పోరాట స్ఫూర్తి, నక్సల్బరి ఉద్యమ ప్రభావంతో కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఎర్రజెండాలతో మార్మోగాయి. దొరల గడీలను, భూస్వాముల ఆధిపత్యాన్ని ప్రశ్నించిన ఆ తరం, రైతు కూలీలకు అండగా నిలిచి గ్రామాలకు తరలి వెళ్లింది. ఆ తర్వాత వచ్చిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ విద్యార్థి యువత కాగడలై వెలిగింది, చివరకు స్వరాష్ట్రాన్ని సాధించింది.

కానీ స్వరాష్ట్రం సాధించాక ఏం జరిగింది? పోరాట పటిమతో, ప్రశ్నించే తత్వంతో ఎదిగిన ఆ యువతరానికి కొనసాగాల్సిన గమ్యం ఏదీ కనిపించలేదు. ఉద్యమం తర్వాత ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత గాలికి వదిలేయబడింది. లక్ష్యం లేని, దిశ లేని ఈ శూన్యతలోకి నేటి యువతరం క్రమంగా జారిపోతోంది – మత్తు పదార్థాల ఊబిలోకి.

గంజాయి, డ్రగ్స్ వినియోగం యువతలో ఎంతగా పాకుతోందో తెలిస్తే గుండె బద్దలవుతుంది. కాలేజీలు, వీధులు, పబ్బులు – ఎక్కడ చూసినా మత్తు పదార్థాలు చేతులు మారుతున్నాయి. ఒకప్పుడు భూమి కోసం పిడికిలి బిగించిన చేతులు ఈ రోజు సిగరెట్ల మధ్య, గంజాయి పొగల మధ్య వణుకుతున్నాయి. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు, ఇది ఒక తరం సమస్య. ఇది తెలంగాణ సమాజం తీవ్రంగా ఆలోచించాల్సిన ప్రమాద ఘంటిక.

ఈ మహమ్మారి నుంచి బయటపడాలంటే యువతకు మళ్ళీ సామాజిక స్పృహ కావాలి. ఖాళీ మనసులను మత్తు ఆక్రమించదు, ఆ ఖాళీని ఆశయాలు, ఆలోచనలు, ఉద్యమ చైతన్యం నింపాలి. సామాజిక సమస్యలపై చర్చలు జరగాలి, ప్రశ్నించే అలవాటు పెరగాలి, సమాజహితం కోసం పనిచేసే వేదికల్లో యువత భాగస్వాములు కావాలి. ఎందుకంటే ప్రశ్నించడం, పోరాడడం అనేవి బతికి ఉన్నంత కాలం మనిషి మత్తుకు బానిస కాలేడు. లక్ష్యం ఉన్న మెదడు మత్తును దరిచేరనివ్వదు.

తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వం – అందరూ ఈ విషయంలో బాధ్యత తీసుకోవాలి. డ్రగ్స్ సరఫరా వ్యవస్థపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, యువతలో సానుకూల శక్తిని నింపే కార్యక్రమాలు అవసరం. ఇది ఒక్క పోలీసు చర్యతో పరిష్కారమయ్యే సమస్య కాదు, ఇది సమాజం మొత్తం కలిసి ఎదుర్కోవాల్సిన సవాలు.తెలంగాణ చరిత్ర అంటే లొంగని పోరాట చరిత్ర. ఆ చరిత్రను సృష్టించిన నేలమీద, ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న యువత మత్తుకు బానిసలై కునారిల్లడం సహించరానిది. మళ్ళీ ఆ పిడికిలి బిగియాలి – ఈసారి మత్తుపై, నిర్లక్ష్యంపై, నిరాశపై పోరాటం చేయడానికి.

# కొత్త ఉపాధి పథకం పేరుతో పేద ప్రజల ఊపిరిలు తీస్తున్న మోడీ ప్రభుత్వం




దేశవ్యాప్తంగా గ్రామీణ పేదలకు ఎంతో కొంత ఉపశమనంగా ఉన్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజి నరేగా) వికసిత్ భారత్ గ్యారంటీ ఆఫ్ రోజ్గార్ అండ్ అజీవికా మిషన్ – గ్రామీణ్ (విబి – జిరామ్‌జి)గా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మార్చివేసి ఆ కొద్దిపాటి ఉపశమనాన్ని కూడా హరించి పేద ప్రజల ఊపిరులను తీయడానికి సిద్ధమైంది. జులై ఒకటవ తేదీ నుంచి అమలులోకి రానున్న కొత్తగా తెచ్చిన ఈ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలోని రైతు కూలీ సంఘాలు ఆందోళనలు సాగిస్తున్నాయి. ఈ ఆందోళనలను పెడచెవిన పెడుతున్న మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై జూన్ 17వ తేదీన న్యూఢిల్లీలో వ్యవసాయ, గ్రామీణ ప్రాంత వర్కర్స్ యూనియన్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న "నరేగా సంఘర్ష మోర్చా" కొత్తగా తెచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని, జులై ఒకటో తేదీ నుంచి నిరవధిక ఆందోళనకు పిలుపునిచ్చింది. ఈ పాశవిక చట్టాన్ని రద్దు చేసేంతవరకు ఆందోళన కొనసాగుతుందని కమిటీ ప్రకటించింది. దీనిని బట్టి కొత్త చట్టం యొక్క ప్రమాద తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

నరేగా చట్టాన్ని మరింతగా నీరుగార్చే కొన్ని సవరణలతో మోడీ ప్రభుత్వం డిసెంబర్ 16న పార్లమెంటు ఉభయ సభలలోను నూతన చట్టంతో బిల్లును ప్రవేశపెట్టింది. పార్లమెంటులో చర్చకు అవకాశం ఇవ్వకుండా, విపక్ష పార్టీల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండానే డిసెంబర్ 18వ తేదీ నాటికే చట్టం చేసింది. ఆ విధంగా నూతన చట్టాన్ని ప్రజలపై రుద్దేందుకు మోడీ ప్రభుత్వం సిద్ధమయింది. నరేగా చట్టాన్ని గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1990ల తర్వాత సరళీకరణ ప్రైవేటీకరణ ప్రపంచీకరణ విధానాలను చేపట్టిన దాన్లో భాగంగా ప్రవేశపెట్టింది. వ్యవసాయరంగ సంక్షోభానికి, గ్రామీణ పేదల నిరుద్యోగానికి మూల కారణమైన భూమి సమస్య పైకి ప్రజల దృష్టి మళ్ల కుండా గ్రామీణ పేదలకు ఉపాధిని గ్యారెంటీ చేస్తామని భ్రమలు కల్పిస్తూ ఈ ఉపాధి పథకాన్ని ముందుకు తెచ్చారు. 1980 ల నుండి 'పనికి ఆహారం' పేరుతో సాగిన ఈ పథకాన్ని 2006లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకంగా అమలుచేసి 2009 నాటికి మహాత్మా గాంధీ పేరును పథకానికి ముందు చేర్చింది.

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాలలోని అర్హులైన పేదలకు కుటుంబంలో ఒకరికి మాత్రమే జాబ్ కార్డులు అందించి, సంవత్సరములో 100 రోజుల పని కల్పించాలి. 15 రోజుల్లో పని కల్పించుకుంటే ప్రభుత్వం నిరుద్యోగ భృతి కల్పించాలి. పని ప్రదేశాలలో మహిళలకు అన్ని రకాల వసతులు కల్పించాలి. పని ప్రదేశం ఐదు కిలోమీటర్ల పరిధి దాటితే కూలీలకు ప్రయాణ చార్జీలు చెల్లించాలి. గ్రామ ప్రజల అవసరాలైన చెరువులు పంట కాలువలు మురుగు కాలువల నిర్మాణము అభివృద్ధి పనులు, రహదారుల నిర్మాణం మొదలగు నైపుణ్య రహిత పనులు ఈ పథకం క్రిందకు వస్తాయి. వేతనాల చెల్లింపుకు ఆధార్ బ్యాంకు ఖాతాల అనుసంధానం వంటి నిబంధనల కారణంగా సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం, ఆ విధంగా దేశవ్యాప్తంగా ఉపాధి కూలీలకు వేల కోట్ల రూపాయల బకాయిలు పెరిగిపోయాయి. ఈ పథకం అమలులో నిధుల దుర్వినియోగం, నకిలీ జాబ్ కార్డులు, నిధుల దారి మళ్లింపు విధానాల వలన వేల కోట్ల రూపాయల అవినీతి పెరిగిందని కాగ్ నివేదిక వెల్లడి చేసింది. అంతేకాకుండా ఈ పథకం ఆయా ప్రాంతాలలోని భూస్వామ్య పెత్తందారీ వర్గాల చేతిలో పనిముట్టుగా తయారయింది. ఆ విధంగా ఉపాధి హామీ పథకం పెత్తందార్ల ఫలహార పథకంగా మారిపోయింది. ఆచరణలో ఈ చట్టాన్ని అరకొరగా అమలు చేసిన ఫలితంగా గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలకు ఉపాధి హామీ లభించక కరువు ప్రాంతాల నుంచి వలసలు పెరుగుతూనే ఉన్నాయి.

2014లో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఈ పథకాన్ని మరింతగా నీరుగార్చేందుకు బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధిస్తూ, ఈ పథకం కొన్ని ప్రాంతాలకే అమలు చేయాలని నిర్ణయిస్తూ, ఈ పథకంలో పూర్తిగా మానవ శ్రమనే ఉపయోగించటానికి బదులు అనధికారికంగా యంత్రాల వాడకాన్ని పెంచటం చేస్తూ ఆచరణలో ఈ పథకానికి తూట్లు పొడుస్తున్నారు. ఇప్పటివరకు ఈ పథకం కింద 90 శాతం కేంద్రం, 10 శాతం ఆయా రాష్ట్రాలు భరిస్తూ ఉండగా ప్రస్తుత నూతన చట్టం ప్రకారం 60 శాతం ఖర్చులను మాత్రమే కేంద్రం భరిస్తుందని, మిగతా 40 శాతం రాష్ట్రాలు భరించాలని నూతన చట్టంలో పేర్కొంది. ఆ విధంగా రాష్ట్రాలపై భారాన్ని పెంచి ఆచరణలో ఈ పథకాన్ని మరింతగా నీరుగార్చింది. అంతేకాకుండా వ్యవసాయ సీజన్లో రెండు నెలల పాటు ఉపాధి హామీ పనులను నిలిపివేయాలని చట్టంలో పేర్కొనటం ద్వారా ఉపాధి కూలీల కడుపులను మాడ్చే నిరంకుశ చర్యకు పూనుకుంది. గతంలో ఉన్న 100 రోజుల పని దినాన్ని 125 రోజులకు ఈ కొత్త చట్టంలో పెంచుతున్నట్టు చేసిన ప్రకటన ఆచరణలో మరిన్ని పని దినాలు కోతకు గురవుతాయి. దీనికి నిదర్శనమే ఈ పథకానికి బడ్జెట్లో కేటాయింపులకు కోతలు పెట్టటమే సాక్ష్యాలుగా నిలుస్తాయి.

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ కాలములోనే ఈ పథకాన్ని నీరుగార్చే చర్యలకు పాల్పడుతూ ఉండగా ఇప్పుడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కొత్త చట్టం పేరుతో పేద ప్రజల ఉపాధి దొరక్కుండా ఉరిత్రాడులను తయారు చేస్తున్నది. ఈ కొత్త చట్టం పేరుతో రాష్ట్రాలపై భారాలు పెంచటంపై బిజెపి పాలిత రాష్ట్రాలైన బీహార్ మధ్యప్రదేశ్, జార్ఖండ్ లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమిళనాడు కర్ణాటక, తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాలు ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. డబుల్ ఇంజన్ సర్కారులు ఉన్న రాష్ట్రాలే ఈ కొత్త పథకాన్ని వ్యతిరేకిస్తుంటే ఆంధ్రప్రదేశ్లో ఉన్న కూటమి ప్రభుత్వం కనీసం నిరసన తెలియజేయకపోవటం అన్యాయం. ఉపాధి పొందటాన్ని రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుగా డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలన్న ముఖ్యమైన డిమాండ్ తో, మోడీ ప్రభుత్వం చేసిన కొత్త చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని రైతు కూలీ సంఘాలు పోరాట బాట చేపట్టాలి. అఖిల భారత స్థాయిలో నరేగా సంఘర్ష మోర్చా కొత్త ఉపాధి చట్టం అమలును నిలిపివేయాలని ఇచ్చిన నిరవధిక ఆందోళనను విజయవంతం చేయడానికి పూనుకోవాలి. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులను ప్రారంభించడానికి మూల కారణమైన భూమి సమస్యను పరిష్కరించడానికి సమగ్ర భూ సంస్కరణలను సాధించేందుకు పీడిత ప్రజలు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలి.

ముప్పాళ్ళ భార్గవ శ్రీ,
సిపిఐ ఎంఎల్ నాయకులు,
సెల్ నెం. 98481 20105.

## అమృత సిందువు

అందరం సముద్రాన్ని చూస్తాం..కానీ
మనల్ని ఎత్తుకుని ఆడించి
ప్రపంచాన్ని చూపిన సముద్రమొకటి
నిత్యం మనతో ఉంటుంది
మనకు ఆహ్లాదాన్నివడానికి ఆ సముద్రం
ఎన్నో ఆటుపోట్లను చవిచూస్తుంది
మనకు విశాల జీవిత తీరాన్నివ్వడానికి
తనను తానెంతో కోల్పోతుంది
బాల్యంలో ప్రశాంతమైన అలలను ఇచ్చి
జీవిత పాఠాలు నేర్పే ఉప్పెన అవుతుంది
తుఫాను సుడిగుండాలను గుండెలో
మోస్తూ
చల్లని గాలులను మనకందిస్తుంది
ఆ సముద్రం నాన్న.. బాపు.. తండ్రి
సముద్రం లోతు లాగే నాన్న మనసు
సముద్ర వైశాల్యమంతా బాపు హృదయం
సముద్ర సంఘర్షణనే తండ్రి తపన
ప్రేమ రుచి చూపే తీపినీటి సముద్రం
అంతర్గతంగా హాలాహలాన్ని భరిస్తూనే
అమృతం లాంటి జీవితాన్ని ఇస్తాడు బాపు
ఎన్ని సంఘర్షణలు ఉన్నా తన వరకే
ఏది దాచుకోకుండా ఇచ్చే అమృతసిందువే
ఆయన ఏమిచ్చాడు అనే అవివేకం కాదు
ఎలా ఇచ్చాడనే ఆలోచన కావాలి.

కొత్త అనిల్ కుమార్



## విద్యార్థుల కలలను చిదిమేస్తున్న పాలకులు

ఒక దేశ అభివృద్ధి ఆ దేశ విద్యా వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. విద్య అనేది కేవలం ఉద్యోగం సంపాదించే సాధనం మాత్రమే కాదు; శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత కలిగిన పౌరులను తీర్చిదిద్దేది విద్య . అందుకే ప్రతి దేశం విద్యను అత్యంత ప్రాధాన్య రంగంగా పరిగణిస్తుంది. కానీ నేడు మన దేశంలో విద్యారంగంలో జరుగుతున్న పరిణామాలు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

ఈ ఆందోళనకు ప్రధాన కారణం జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణలో వరుసగా వెలుగుచూస్తున్న లోపాలే. నీట్ వంటి పరీక్షల్లో పేపర్ లీకేజీహావిద్యా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. సుమారు 22 లక్షల మంది విద్యార్థులు ఏళ్ల తరబడి కష్టపడి చదివి, కుటుంబాలు లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నవారు ఉన్నారు అయితే ఒక పేపర్ లీకేజీతో వారి శ్రమ, వారి కలలు, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది

ఈ పరిస్థితుల ప్రభావం కేవలం పరీక్షల వరకే పరిమితం కావడం లేదు. విద్యార్థుల్లో తీవ్రమైన మానసిక ఒత్తిడి, నిరాశ పెరుగుతున్నాయి. పేపర్ లీకేజీల నేపథ్యంలో ఇప్పటివరకు 11 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత విషాదకరం. దీనికి కేంద్ర ప్రభుత్వమే NTA (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వైఫల్యమే ప్రధాన కారణం

నేడు దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు విద్యార్థులు కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆందోళనలు నిర్వహిస్తున్నారు, ఇప్పటికీ విద్యార్థుల్లో నమ్మకం కలిగించే స్థాయిలో ప్రభుత్వం స్పందించలేదు, ప్రభుత్వంలో జవాబుదారుతనం లోపించింది

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కావని భరోసా కల్పించలేని నిస్సాయ స్థితిలో ప్రభుత్వ పాలకులు ఉన్నట్లు స్పష్టంగా అర్థం అవుతుంది

మరోవైపు, డిజిటల్ ఇండియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అత్యాధునిక సాంకేతికత గురించి గొప్పలు చెప్పే ప్రభుత్వం, ఒక జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించలేకపోవడం పాలకుల డొల్లతనం కనబడుతుంది జాతీయ పరీక్షల సంస్థ (NTA)పై వరుసగా వస్తున్న ఆరోపణలు పరీక్షల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. గతంలో కూడా నీట్, నెట్ వంటి పరీక్షల లీకేజీలు జరిగిన పరీక్షల నిర్వాహన వ్యవస్థలో సమూల సంస్కరణలు తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది

ఇలాంటి పరిస్థితుల్లో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలి. పరీక్షల నిర్వాహణలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం, సాంకేతిక భద్రతను నిర్ధారించాలి. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తిరిగి నమ్మకం కల్పించాల్సిన బాధ్యత పాలకులపైనే ఉంది. అదే సమయంలో విద్యారంగానికి సంబంధించిన విధానాలపైనా తీవ్రమైన చర్చ అవసరం. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అధికారాలను క్రమంగా తన నియంత్రణ లోకి తీసుకుంది. నూతన జాతీయ విద్యా విధానం శాస్త్రీయ దృక్పథాన్ని, హేతుబద్ధ ఆలోచనను పెంపొందించకుండా, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉద్యోగుల తయారీకి మాత్రమే పరిమితమవుతోందనే ఆందోళన విద్యావేత్తల్లో వ్యక్తమవుతోంది. విద్య అనేది కేవలం కంపెనీలకు ఉద్యోగులను తయారు చేసే ప్రక్రియ కాదు; , ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే చైతన్యవంతమైన పౌరులను తయారు చేసే వ్యవస్థ. భారత విద్యా చరిత్ర కూడా ఇదే విషయాన్ని చెబుతోంది. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయులు విద్యను సమానత్వానికి, సామాజిక న్యాయానికి, విముక్తికి సాధనంగా భావించారు. వారి దృష్టిలో విద్య అంటే కేవలం డిగ్రీ కాదు; శాస్త్రీయ ఆలోచన, హేతుబద్ధ దృక్పథం, ప్రజాస్వామ్య చైతన్యాన్ని పెంపొందించే ప్రక్రియ. అందువల్ల జాతీయ పరీక్షల వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టాలి. పేపర్ లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన, పారదర్శకమైన, నమ్మకమైన విద్యను అందించాలి. ఒక దేశాన్ని నిర్మించేది అద్దాల భవనాలు, రంగుల గోడలు కాదు; భావితరాల విద్యార్థులదే ఆ భావితరాలను తీర్చిదిద్దేది విద్య. అలాంటి విద్యనే నిర్లక్ష్యం, అవినీతి, పేపర్ లీకేజీలతో బలహీనపరిస్తే నష్టపోయేది ఒక్కు విద్యార్థి కాదు–దేశ భవిష్యత్తే.



డా ఆర్ ఎల్ మూర్తి
నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్,
DYFI రాష్ట్ర ఉపాధ్యక్షులు
8247672658

# "ఉన్నది ఉన్నట్టు" అరి గోస




నగరంలోని ఆ బహుళ అంతస్తుల సాఫ్ట్‌వేర్ కంపెనీ క్యాంటీన్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. కాఫీ మిషన్ల చప్పుడు, కీబోర్డ్ క్లిక్కుల గురించిన ముచ్చట్లు, ప్రాజెక్ట్ డెడ్‌లైన్ల గురించిన టెన్షన్లు అక్కడ కామన్. కానీ, ఐదో నంబర్ టేబుల్ దగ్గర కూర్చున్న ఆ ముగ్గురి మధ్య మాత్రం జీవితానికి సంబంధించిన ఒక పెద్ద చర్చ జరుగుతోంది.

ఆకాశ్ తన బ్రాండెడ్ రే-బాన్ గ్లాసెస్ టేబుల్ మీద పెట్టి, ఐఫోన్ తిప్పుతూ చేతి గడియారం వైపు చూశాడు.

"రేపు మా మేనేజర్ యు.ఎస్ ఆన్-సైట్ ప్రాజెక్ట్ గురించి మాట్లాడతా అన్నాడు. ఒకసారి నేను అమెరికా ల్యాండ్ అయ్యానా... నా రేంజ్ మారిపోతుంది. డాలర్లలో సంపాదన, అక్కడ లగ్జరీ హౌస్, లైఫ్ స్టైలే వేరుగా ఉంటుంది. ఈ చిన్న చిన్న పొజిషన్లు నాకు సరిపోవు."

చరణ్ చిన్నగా నవ్వి వేడి వేడి టీ కప్పు అందుకున్నాడు.

"సరే ఆకాశ్,! నీ అమెరికా కలలు బాగానే ఉన్నాయి.. మొన్న గోదావరి ఖని సంబంధం వచ్చింది. సాఫ్ట్‌వేర్. బెంగుళూరులో చేస్తుందన్నావు. మరి ఎందుకు వద్దన్నావు? వయసు ముప్పై దాటుతోంది. పెళ్లి చేసుకొని ఇద్దరు కలిసి హాయిగా అమెరికాలో ఎంజాయ్ చేయొచ్చు కద! "

ఆకాశ్ వెటకారంగా నవ్వాడు. "చరణ్! నీ ఆలోచనలు ఎప్పుడూ ఇంతే. చాలా చిన్నగా, సాదాసీదాగా ఉంటాయి. గా సింగరేణి సంబంధం చేసుకోవాల్నా? ఆ అమ్మాయి నెలకి యాభై వేలో, లక్షో సంపాదిస్తుందేమో. రేపు నేను యు.ఎస్ వెళ్తే నా స్థాయి ఏంటి? ఈ సంబంధం చేసుకుని నా భవిష్యత్తును పాడుచేసుకోవాల్నా? రేపు నా రేంజ్‌కి తగ్గది వస్తుంది."

చరణ్ తల పంకించి, పక్కనే శూన్యంలోకి చూస్తూ కూర్చున్న మాధవ్ వైపు తిరిగాడు. మాధవ్ కళ్లు టీ కప్పులో. . ఆలోచనలు ఎక్కడో ! అతని ముఖంలో ఏదో విషాద ఛాయ.

"మరి నీ సంగతి ఏంటి మాధవ్?" చరణ్ సూటిగా అడిగాడు.

"నళిని ని మరిచి పోలేక పోతున్నాను. నేను తప్పు చేసాను. శిక్ష అనుభవించాల్సిందే! "విషాదం మొహం నిండా పరుచుకుంది.

" నీకోసం నళిని ఎంత ఎదురుచూసింది? ఆమె పెళ్లి మాట ఎత్తే సరికి ఎందుకు భయ పడ్డావు. అప్పర్ క్యాస్టు అయితే ఏమిటి? నళిని నాన్న డిస్ట్రిక్టు జడ్జి అయితే నువ్వెందుకు ఎందుకు భయ పడాలి? మీరు మేజర్లు . రిజిస్ట్రేషన్ మ్యారేజీ చేసుకో ! అంటే వినక పోతివి."

" అదే నా జీవితంలో చేసిన పెద్ద తప్పు. కాలేజీ డేస్ నుంచి నళిని స్నేహం పలకరింపులు , హాలిడేస్ లో టూర్లు ! జీవితం అంటే అదే! ఆ జీవితం చేతులారా వదులుకున్నాను. "ఏవేవో దృశ్యాలు గుర్తుకు వచ్చి మాధవ్ కళ్లు మూసుకున్నాడు. ఆ దశ్యాలు కళ్లలో కదలాడుతున్నాయి.

కాలేజీ లైబ్రరీ లో పుస్తకాలు చదువుతూ ఎన్ని గుస గుసలు. నళిని స్పర్శ ఎంత హాయి. ఆ కళ్ల లో ఎంత సాహసం. కాలేజీ బస్సులో తన పక్కనే వచ్చి కూర్చోవడం. ఎవరెన్ని జోకులేసినా తన పక్కన ఉన్న వాల్లను లేపి తనతో రాసుకొని కూర్చోవడం. తన పుస్తకాలు అడిగి తీసుకోవడం. తిరిగి ఇచ్చేటపుడు పూల బొమ్మల కవర్‌లో అందమైన ప్రేమ లేఖ. మాధవ్ మనస్సు లో కన్నీరు.

"మాధవ్! ఇప్పుడు బాధ పడితే ఏమొస్తది. గతం తిరిగి రాదు. మ్యారేజీ బ్యూరోలో రిజిస్టర్ చేసుకో. ! నిన్ననే ఆ అమ్మాయి పెళ్లి ఫోటోలు ఫేస్‌బుక్‌లో చూసిన. అమెరికాలో భర్తతో కలిసి ఎంత హాయిగా, సంతోషంగా నవ్వుతూ ఉందో తెలుసా? ఆమె గతాన్ని మర్చిపోయి హాయిగా బతుకుతోంది. " చరణ్ నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు.

మాధవ్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. గుండెల్లోంచి ఒక పెద్ద నిట్టూర్పు వదిలాడు. "ఛా... ఎంత తప్పు చేశాను చరణ్. నళిని నన్ను అంతగా ప్రేమించి, 'సరే' అని ఒక మాట చెప్పమన్నప్పుడు నేను భయపడ్డాను. నాడు నేను ఒప్పుకుని ఉంటే ఈపాటికి నా జీవితం ఎంత అద్భుతంగా ఉండేది? ఇప్పుడు నళిని లేని జీవితం నాకు శూన్యంలా అనిపిస్తోంది. ఆ బాధలో ఉంటూ ఇప్పుడు ఏ అమ్మాయిని పెళ్లి చేసుకుని నేనేం సుఖపడతాను? ఆమె నేం సుఖ పెడుతాను? నా జీవితం నాడే ఆమెతోనే ముగిసిపోయింది. ఏ కొత్త సంబంధం వచ్చినా నాకు ఆ ఆనందం రాదు" అంటూ టేబుల్ మీద చేతులు వేసి తల వాల్చేశాడు మాధవ్.

చరణ్ ఇద్దరి వైపు చూశాడు. " ఆకాశ్ రాని భవిష్యత్తు కోసం ఇపుడు అంది వచ్చింది వదులుతున్నాడు. మాధవ్ వెనక్కి రాని గతం కోసం తనను తాను బలి చేసుకుంటున్నాడు." అనబోయాడు.

"మరి నీ సంగతి ఏంటి చరణ్? నీకు ముప్పై ఏళ్లు వచ్చినా ఇంకా పెళ్లి కాలేదు." ఆకాశ్ వెటకారంగా అడిగాడు. ఆకాశ్ ఎప్పుడూ ఇంతే. ఆ వెటకారంలో ఏం ఆనందమో, ఏమో!

మనసు గాయ పడి ఉన్నది ఉన్నట్టు చెప్పాడు చరణ్.

" మాకు ఆస్తులు లేవు. పెండ్లి కెదిగిన చెల్లె ఉంది. ఇంటి బరువుబాధ్యతలన్ని నావే అని తెలిసి నన్ను ఎవరూ ఇష్ట పడుత లేరు. ఎవరో ఒకరు బాధ్యత తెలిసిన వారు మెచ్చే దాకా ఎదురు చూస్తూ ఉండాల్సిందే కద! నాకు నీలాగ ఆకాశమంత కోరికలు లేవు ! అమెరికా అవకాశం వచ్చినా పోను. నేను అమ్మా నాన్నలను చూసుకోవాలి."

ఆకాశ్ అదేదో జోక్ అన్నట్టు నవ్వితే చరణ్ కు చిర్రెత్తు కొచ్చింది. నీకెవరు ఇస్తారు. నినెవరు ఇష్ట పడుతారు అని హేళన ఆ నవ్వులో. చరణ్ కోపాన్ని అదుపు చేసుకుంటూ అన్నాడు

" ఆకాశ్! నా జీతం తక్కువేమీ కాదు. నన్ను మెచ్చే అమ్మాయి ఎక్కడో ఒకచోట పుట్టే వుంటుంది. పెరిగే వుంటుంది. నా కోసం ఎదురు చూస్తూనే ఉంటుంది. " చరణ్ ఎంతో నమ్మకంగా సమాధానమిచ్చాడు.

ఆకాశ్ పగలబడి నవ్వాడు. చరణ్ ముఖం చిన్న బోయింది

"ఇందులో నవ్వడానికేముంది?" చరణ్ అన్న దాంట్లో తప్పేముంది? ఎవరో ఒకరు ముందుకు వస్తారు. నీలాగ వంకలు పెట్టి వద్దనే రకం కాదు" అంటూ చరణ్ వైపు చూశాడు మాధవ్.

అంతే అన్నట్టు నవ్వు పులుముతున్నాడు చరణ్.

ఎవరో ముగ్గురు టేబుల్ ఎపుడు ఖాళీ చేస్తారు అన్నట్టు నిలబడి చూస్తున్నారు. పద అంటూ లేచాడు ఆకాశ్.

చరణ్ కు రాక రాక ఒక సంబంధం వచ్చింది. అమ్మాయికి తండ్రి లేడు. పెళ్లికి ముందట బడి పెళ్లి చేసే వారు లేరు. అందువల్లే ముప్పయి ఏళ్లకు చేరువవుతోంది. సుమతి సంసార పక్షంగా బాగుంది. ఇరు పక్షాలు సరే ననుకోవడంతో సింపుల్ గా పెళ్లి జరిగింది.

సుమతి ఒక ప్రైవేట్ కాలేజీలో మ్యాథ్స్ లెక్చరర్‌గా పని చేస్తోంది. తండ్రి లేని సుమతి మంచి తనం చూసి కాలేజీ వాళ్లే పెళ్లి ఏర్పాట్లు చూసుకున్నారు.

సుమతి చాలా చురుకైనది. సాహసాలను ఛాలెంజింగా తీసుకొని ఎదిగే తత్వం. అందుకే ఈ సంబంధం తనకు సరైన సంబంధం అని ఒప్పుకుంది. పెళ్లి చూపుల్లో చరణ్ నిజాయితీగా అన్ని విషయాలు చెప్పడం సుమతికి బాగా నచ్చింది. చరణ్ సంపాదన ,తన లెక్చరర్ జీతాన్ని కూడా కలిపి ఇల్లును ఎంతో పద్ధతిగా, తృప్తిగా బతకవచ్చు అనుకుంది.

అలా అవగాహనతో పెళ్లి పద్దతి ప్రకారం జరిగింది. ఆకాశ్ అమెరికా పోలేదు. పెళ్లి సంబంధాలు రిజెక్టు చేస్తేనే ఉన్నాడు. మాధవ్ తల్లి దండ్రుల బాధ పడ లేక సంబంధాలు చూస్తూ డిస్కార్డు చేస్తున్నాడు.

ఒకరోజు సుమతి కాలేజీ నుంచి రాగానే చరణ్‌తో అంది, "ఏమండీ! , మీ పాత క్లాస్‌మేట్స్ కలిశారు కదా. నగర శివార్లలో ఒక రైతు అత్యవసరంగా 'మూడు ఎకరాల' భూమి అమ్ముతున్నాడట. చాలా తక్కువ ధరకు వస్తోంది. మనం ఎలాగైనా ఆ భూమిని కొనాలి."

"సుమతీ! మన దగ్గర అంత డబ్బు ఎక్కడుంది? బ్యాంకులో ఉన్న పొదుపు డబ్బులు చాలా తక్కువ. మన ఆర్థిక ఇబ్బందులు నీకు తెలుసు కదా" చరణ్ ఆందోళనగా అన్నాడు.

"మీరు భయపడకండి. మీ ఫ్రెండ్స్ ను ఒక గ్రూప్‌గా కలపండి. నా ఫ్రెండ్‌కి కూడా చెప్తాను. అందరం సమానంగా డబ్బులు వేసుకుందాం. సగం డబ్బు నగదు రూపంలో డౌన్ పేమెంట్ కింద ఇద్దాం. మిగిలిన సగం డబ్బు కోసం నేను బ్యాంకులో మాట్లాడి లోన్ ఇప్పిస్తాను. ఆ మూడు ఎకరాలను మనం డిపిఏ (Development Plan Approval) కింద మార్పించి, ప్లాట్లు చేసి అమ్మితే మనకు మంచి లాభాలు వస్తాయి. అప్పులన్నీ పోగా తక్కువ ధరతో మనకు ఒక ప్లాట్ ఉచితంగా మిగులుతుంది" అని సుమతి లెక్కలతో సహా ధైర్యం చెప్పింది.

సుమతి అన్నట్టుగానే ప్లాన్ వర్కవుట్ అయింది.

తహసిల్ ఆఫీసులో భూమి రికార్డులు వెలికి తీసింది. ఇన్కంబరెన్సు సర్టిఫికెట్ కోసం రిజిస్ట్రేషన్ ఆఫీసులో అప్లయి చేసింది. ఆ డాక్యుమెంటుతో ఆ భూమి ఆ రైతుదే అని పక్కాగా తేల్చుతుంది.

ఆర్డీవో ఆఫీసులో ఆర్డీవో ఫైల్ పక్కన పెట్టి, మేడం, ఇది అప్రూవ్ కావాలంటే... "అంటూ సాగ దీశాడు సుమతి కళ్లల్లోకా సూటిగా చూస్తూ!

"సార్! నేను లెక్చరర్ ని. లంచం ఇవ్వను. తీసుకోను. నా స్టూడెంట్సు కి ఏం నేర్పించాలో మీరే చెప్పండి. ఫైల్ క్లియర్ చేయండి. లేదా నేను కలెక్టర్ దగ్గరికివెళ్తాను." అంది సుమతి. ఆ మాటతో ఆర్డీవో ఉలిక్కి పడ్డాడు. వెంటనే ఫైల్ పై సంతకం పెట్టేసాడు.

అలా కలెక్టర్ ఆఫీసు చుట్టూ తిరిగి వ్యవసాయ భూమిని రెసిడెన్షియల్ భూమిగా కన్వర్షన్ సర్టిఫికేట్ సాధించింది. సుమతి మాట తీరుకు భయ పడి అధికారులు మామూళ్లు నామ మాత్రంగా తీసుకొని సర్టిఫికెట్లను ఇచ్చేసారు. ఆఫీసుల్లో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా, సుమతి లెక్చరర్ కావడం వల్ల చకచకా ఆఫీసర్లతో మాట్లాడి, పేపర్ వర్క్ అంతా పక్కాగా పూర్తి చేసింది. బ్యాంకు లోన్ కూడా మంజూరై ఆ మూడు ఎకరాల భూమి వారి సొంతమైంది.

ఒకరోజు ఆఫీసులో చరణ్ ఆకాశ్, మాధవ్‌ల దగ్గరకు వెళ్లాడు. చివరిసారిగాఅడిగాడు.

" మేము ఫ్రెండ్స్ అందరం కలిసి సిటీ అవతల మూడు ఎకరాల ల్యాండ్ కొని ప్లాట్లు చేద్దామని సుమతి ప్రపోజల్. తక్కువ పెట్టుబడితోనే ప్లాట్లు వస్తున్నాయి. బ్యాంకు లోన్ సదుపాయం కూడా ఉంది. మీ ఇద్దరికీ చెరో ప్లాట్ ఇప్పిస్తాను, రేపటి రోజున పనికొస్తుంది" అని బతిమిలాడాడు.

ఆకాశ్ తన బ్రాండెడ్ ఆడి కారు కీస్ వేలికి తిప్పుతూ వెటకారంగా నవ్వాడు. "చరణ్! ఎక్కడో అడవుల్లో, పొలాల్లో ప్లాట్లా? నేను గచ్చిబౌలిలోనో, జూబ్లీహిల్స్ లోనో పెద్ద విల్లా కొనాలనుకుంటున్నా! ఇలాంటి చిన్న చిన్న ప్లాట్లు నా రేంజ్‌కి తగవు. నా ఫ్యూచర్ ప్లాన్స్ చాలా పెద్దవి, మీలాంటి వాళ్లకు అర్థం కావు" అని నిర్లక్ష్యం చేశాడు.

మాధవ్ తల పట్టుకున్నాడు. "పదేళ్ల క్రితమే నేను ఇలాంటి భూమి మా ఊర్లో కొనుంటే ఈరోజు వీళ్లకన్నా ఎంతో పెద్ద ధనవంతుడిని అయ్యేవాడిని. అప్పుడు కొనలేదు, ఇప్పుడు కొని ఏం లాభం? నాకా అదృష్టం లేదు. నా జీవితం నళిని తోనే ముగిసిపోయింది" అని గతాన్ని తలుచుకుంటూ ఆ అవకాశాన్ని వదిలేశాడు.

రెండేళ్లలోనే ప్రభుత్వం ఆ మూడు ఎకరాల ప్లాట్ల మీదుగా ఒక పెద్ద లింక్ రోడ్డు విస్తరణను ప్రకటించింది. దాంతో ఆ ప్రాంతంలో భూముల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. చరణ్, సుమతి ఫ్రెండ్స్ వేసిన ప్లాట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. వచ్చిన లాభాలతో బ్యాంకు లోన్ మొత్తం పూర్తిగా తీరిపోయింది. స్నేహితులందరికీ తలా ఒక ప్లాట్ ఎటువంటి అప్పు లేకుండా, అతి తక్కువ పెట్టుబడితో చేతికి మిగిలింది. చరణ్‌కు కూడా ఒక ప్రైమ్ కార్నర్ ప్లాట్ దక్కింది.

అదే సమయంలో మంచి సంబంధం రావడంతో చరణ్ చెల్లె పెళ్లి కూడా అయి పోయింది. చరణ్ అన్ని బాధ్యతలు తీరాయని చాలా సంతోషంగా ఉన్నాడు. ప్రతి సారి వెక్కిరించే ఆకాశ్ ను, ఎపుడూ ఏడుపు మొహం పెట్టే మాధవ్ ను చరణ్ క్రమ క్రమంగా దూరం పెట్టాడు. వాళ్లతో మాట్లాడినపుడల్లా మనసు లో ప్రశాంతత కరువై పోతున్నది.

ఆకాశ్ వాళ్ల అమ్మ చరణ్ ఫోన్ నంబర్ కొడుకునడిగి తీసుకుని ఫోన్ చేసింది.

" చరణ్! ఆకాశ్ నీకన్నా పెద్దోడు. నీకు రేపో మాపో కొడుకో బిడ్డో పుడ్తది. మీ అమ్మ కు ఎంత సంతోషం? ఆకాశ్ నువు చెప్తే వింటాడు. ఏ వయసుకు ఆ ముచ్చట. మీ కన్నా తక్కువ చదువుకున్నోలు, పెండ్లిల్లు చేసుకుంట లేరా? పిల్లలను కంట లేరా? జర ఒప్పించు బిడ్డా!" అంటూ బతిమాలింది తల్లి. ఆ తల్లి మాటలకు చరణ్ గుండె బరువెక్కింది. ఆకాశ్ ని మార్చే శక్తి తనకు లేదని తెలిసి సరే నంటూ మౌనంగా ఫోన్ పెట్టేసాడు.

. ఆకాశ్ కు చెప్పి చూశాడు చరణ్. ఆకాశ్ అవే మాటలు.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# సిగాచీ పరిశ్రమ దుర్ఘటనకు ఏడాది పూర్తి

- అమలుకు నోచుకోని సీఎం రేవంత్ రెడ్డి కోటి రూపాయల హామీ..
- పరిశ్రమ యాజమాన్యానికి బంటుగా రాష్ట్ర ప్రభుత్వం..
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..
- బిపిఎల్ చౌరస్తాలో సిగాచి మృతులకు ఘన నివాళి..



**పటాన్‌చెరు, జూన్ 30 (జనం సాక్షి) :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సిగాచి దుర్ఘటన జరిగి ఏడాది గడిచిన నేటి వరకు మృతుల కుటుంబాలకు పూర్తి నష్టపరిహారం అందించడంలో పరిశ్రమ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యాయని.. ఇది అత్యంత దుర్మార్గమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా దుర్ఘటన స్థలం సాక్షిగా మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందిస్తున్నామని ప్రకటించిన.. నేటి వరకు అమలు కాకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలతో పాటు బాధితులకు సంపూర్ణ న్యాయం చేయకపోతే బిఆర్ఎస్ తరపున ప్రజా క్షేత్రంలో నిరంత పోరాటాలు చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. సిగాచి దుర్ఘటన జరిగి నేటితో ఏడాది గడిచిన సందర్భంగా.. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం బిపిఎల్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో..మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. గత సంవత్సరం జూన్ 30వ తేదీన సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో ఘటనలో 54 మంది మృతి చెందగా..8 మంది ఆచూకీ తెలియకపోవడంతో పాటు 40 మంది తీవ్రంగా గాయపడి నేటికి నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడుని కోల్పోయిన తల్లిదండ్రులు.. భర్తను కోల్పోయిన భార్య.. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు బాధలు వర్ణనాతీతమని అన్నారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగా జరిగిన ఘటనలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి అత్యంత దారుణంగా తయారైందని దుయ్యబట్టారు. ఘటన జరిగిన ఆరు నెలల అనంతరం ఒకరిని మాత్రమే అరెస్టు చేసి యాజమాన్యానికి బంటుగా ప్రభుత్వం మారిందని విమర్శించారు. ప్రమాద స్థలం సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయలు ఇస్తామని మీడియా ముఖంగా ప్రకటించి నేటికి ఏడాది గడిచిన అమలు కాకపోవడం ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతోందని విమర్శించారు. తమకు న్యాయం చేయాలంటూ బాధితుల కుటుంబాలు ప్రభుత్వ కార్యాలయాలు,. పరిశ్రమ యాజమాన్యాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న కనికరం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి రూ.60 లక్షల పరిహారం అందించామని చెబుతున్నది అసత్యమని, సెబీలో రూ.118 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉందని వెల్లడించారని గుర్తుచేశారు. బిఆర్ఎస్ పార్టీ ఒత్తిడి కారణంగానే ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం ఇచ్చిందని, బాధిత కుటుంబాల పట్ల ప్రభుత్వానికి కనికరం లేదని మండిపడ్డారు. మృతుల కుటుంబాలకు నివాళి అర్పించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకుంటామంటే అనుమతించకపోవడం ప్రభుత్వ దుర్మార్గ వైఖరికి అర్థం పడుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం పూర్తిగా చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, జీవితాంతం పెన్షన్ అందించాలని ఎమ్మెల్యే జిఎంఆర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి



**కృష్ణ, జూన్ 30 (జనం సాక్షి) :** చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అప్పుడే సత్వర న్యాయం దక్కుతుందని తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు.ప్రతి నెల చివరి తేదిన పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తామని తాసిల్దార్ శ్రీనివాస్, తెలిపారు. కృష్ణ గ్రామంలో సందర్శించి ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కొన్ని సంవత్సరముల క్రితం కుల వివక్ష ఉండేది అని ప్రస్తుతం అంతగా లేనప్పటికీ అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరానితనాన్ని,కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దానికి కృషి చేయాలని అన్నారు. కుల నిర్మూలనకు , ఎస్సీ ఎస్టీ కులాల వారిని చైతన్య పరుచుటకు, వారిని అభివృద్ధి వైపు నడిపించుటకు పోలీస్ శాఖ గ్రామాలలో రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితి కార్యదర్శి నరసింహులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, సర్పంచ్ సోల్లపూర్ నాగేంద్ర, ఉప సర్పంచ్ రేష్మ, జిపిఓ తిరుపతి, వార్డ్ మెంబర్ మహేష్, చంద్రశేఖర్ పోలీసులు,, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి, జూన్ 30 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' వానాకాలం – 2026 వాయిదా తొలి విడత నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం హైదరాబాద్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి లోని రైతు వేదిక లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సంగారెడ్డి టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మరియు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ విడతలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 2 ఎకరాల వరకు వ్యవసాయ భూమి కలిగిన 2,42,753 మంది అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు రూ.125.83 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, వానాకాలం సాగు పనులు మొదలవుతున్న తరుణంలో రైతులకు పెట్టుబడి సాయం అందించడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఈ నిధులు జిల్లాలోని రైతులకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు.

### పారదర్శకంగా నిధుల జమ

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అర్హులైన 2.42 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ అవుతున్నాయని తెలిపారు. అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని, రైతులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, జిల్లా స్థాయి అధికారులు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వివక్ష లేని సమసమాజమే లక్ష్యం



**గద్వాల, జూన్ 30 (జనంసాక్షి) :** గద్వాల మండలం జిల్లేడుబండ గ్రామంలో నాయబ్ తహసీల్దార్ అజిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పౌర హక్కుల దినోత్సవం గ్రామీణ ప్రాంతాలలో అంటరానితనం, కుల వివక్ష వంటి సామాజిక జాడ్యాలను పూర్తిగా నిర్మూలించి, ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులను అనుభవించాలని గద్వాల మండల నాయబ్ తహసీల్దార్ అజిత్ కుమార్ పిలుపునిచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం జిల్లేడుబండ గ్రామంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు నాయబ్ తహసీల్దార్ అజిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చట్టాలపై అవగాహన, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక చట్టాలు, రక్షణల గురించి దళిత సోదరులకు వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానులేనని, దళిత వర్గాల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.గ్రామంలోని దళితులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, మరియు భూ సమస్యలపై అందిన దరఖాస్తులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఆర్థిక, సామాజిక సాధికారత సాధించడానికి విద్యాభ్యాసమే ఏకైక మార్గమని, పిల్లలందరినీ ఉన్నత చదువులు చదివించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లేడుబండ గ్రామ రెవెన్యూ అధికారి , పంచాయతీ కార్యదర్శి, స్థానిక వార్డు సభ్యులు, దళిత సంఘాల ప్రతినిధులు, మరియు గ్రామ పెద్దలతో పాటు కాలనీ మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకునేలా చదవాలి

- మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి
- నిబంధనలు పాటించని ఉపాధ్యాయుడికి మెమో జారీ
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల నడిగడ్డ, జూన్ 30 (జనం సాక్షి) :** విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకునేలా చదవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఎస్ సి ప్రతి విద్యార్థికి కీలక దశ అని, ప్రస్తుతం బాగా చదివితేనే తమ భవిష్యత్తును గొప్పగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టుల్లో ప్రత్యేక దృష్టి సారించి సాధన చేసేలా ఉపాధ్యాయులు బోధించాలని ఆదేశించారు. గతేడాది పదవ తరగతి విద్యార్థులు సాధించిన మార్కుల కంటే ప్రస్తుత విద్యార్థులు ఇంకా ఎక్కువగా సాధించాలని ఆకాంక్షించారు. ఇటీవల జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేకంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎవరైనా సెలవు పెడితే ఒకటి, రెండు రోజులు ముందుగానే సంబంధిత ఉన్నతాధికారులకు సెలవు చీటీ ఇవ్వాలని చెప్పినప్పటికీ పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు మంగళవారం ఉదయం వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు మెమో జారీ చేయాలని జిహెచ్ఎం రేణుకా దేవిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ తో పాటు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన రిజిస్టర్ ను పరిశీలించారు. ఫుడ్ కమిటీ సభ్యులుగా ఉన్న విద్యార్థులు క్రమం తప్పకుండా ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని, అందుకు అనుగుణంగా భోజనాన్ని వండించాలని ఆదేశించారు. పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు యూ డైఎస్ లో నమోదు చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థిని నందిని ఫుట్ బాల్ లో ప్రతిభ చాటి గచ్చిబౌలిలోని నేషనల్ స్పోర్ట్స్ అకాడమీకి ఎంపికవడంతో కలెక్టర్ విద్యార్థినిని శాలువాతో సన్మానించి అభినందించారు.

## ప్రభుత్వ ఆరోగ్య సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందాలి



**సంగారెడ్డి బ్యూరో, జూన్ 30 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు, వైద్య సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ నూటికి నూరు శాతం అందేలా సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆరోగ్య సేవల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు, సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరై ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన వాతావరణం, మరుగుదొడ్ల నిర్వహణ, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచి రోగులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, జిల్లా స్థాయి కార్యక్రమాల అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## మహిళలు, బాలికల భద్రతకు మెదక్ షీ టీం నిరంతరం కృషి




**మెదక్ బ్యూరో చీఫ్, జూన్ 30 (జనం సాక్షి) :** మహిళలు, బాలికల భద్రతకు మెదక్ జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, అసభ్య ప్రవర్తన, సైబర్ వేధింపులపై షీ టీం నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తోందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. షీ టీం జూన్ నెలలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీలు, నిఘా చర్యల్లో 71 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందని, నిబంధనలు ఉల్లంఘించిన 12 మందిపై ఈ–పెట్టీ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే మహిళలు, బాలికల్లో చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా వ్యాప్తంగా 42 అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని చెప్పారు. మహిళల భద్రత కోసం ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని, వేధింపుల సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

## సమగ్ర భూ సర్వే ద్వారానే భూ సమస్యలు పరిష్కారం



**శివ్వంపేట, జూన్ 30 (జనంసాక్షి) :** సమగ్ర భూ సర్వే ద్వారానే భూ సమస్యలు పరిష్కరించబడతాయని భూమీ పై హక్కుల కోసమే రీ సర్వేను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం శివంపేట్ మండలం లోని భిక్యాతాండ లో భూ సర్వే డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో భూ భారతి ద్వారా భూమి రిసర్వే గ్రామసభ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ,ఆర్డీవో ఎడి సర్వే ఎంపీడీవో గ్రామ సర్పంచ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశం లో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ శివంపేట మండలంలో 1946 సంవత్సరంలో రిసర్వే అయిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు చాలా భూ సమస్యలు ఉన్నాయన్నారు. భూమి క్రయవిక్రయాల్లో హద్దు మ్యాపులను కూడా అప్డేట్ చేయాలన్నారు. గ్రామాల్లో భూ నక్షల్లో సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. భూ రీసర్వే కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసి ప్రతి భూ కమతానికి ఆన్లైన్ డిజిటలైజేషన్ లో పొంద పరుస్తామన్నారు. ఏలాంటి భూ వివాదాలు లేకుండా చేసి, మనిషి ఆధార్ ఎలాగో భూమికి కూడా భూధార్ ను అందించడం జరుగుతుందన్నారు. భూ సమస్యలు లేకుండా చేయడమే ఈ ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ శాశ్వతంగా భూ సమస్యల పరిష్కారం కోసమే భూముల రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ల్యాండ్ సర్వే అధికారి ఎ . కిషన్, ఎంపిడివో వెంకట లక్ష్మమ్మ, నాయకులు పబ్బా రమేష్, రైతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



**గద్వాల నడిగడ్డ, జూన్ 30 (జనం సాక్షి) :** ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా మొదట చేపడుతున్న ఇంటింటి సర్వేను బిఎల్‌ఓలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. మంగళవారం గద్వాల పట్టణ పరిధిలోని 21వ వార్డు 233, 234 పోలింగ్ స్టేషన్ల పరిధిలో బూత్ లెవెల్ అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిఎల్‌ఓలు ప్రతిరోజూ తమ పరిధిలోని ఇంటింటికి తిరిగేందుకు ప్రణాళిక రూపొందించుకొని, నిర్దేశిత గడువులోగా ప్రక్రియ పూర్తయ్యేలా ముందుకెళ్లాలన్నారు. ప్రతి ఫామ్ ను స్కాన్ చేశాకే ఓటర్లకు ఇవ్వాలని సూచించారు. ఎన్నుమరేషన్ ఫారాలను పూరించడంలో బూత్ లెవెల్ ఏజెంట్లు, స్థానిక యువత ఓటర్లకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు ఇండ్లను సందర్శించి ఓటర్లకు ఎన్నుమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ పర్యటనలో స్థానిక కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, సూపర్వైజర్ వెంకటేశ్వర్ రెడ్డి,బిఎల్ఓ శాంతమ్మ, బిఎల్ఎలు, తదితరులున్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలం

- మాజీ మంత్రి హరీశ్ రావు
- కాంగ్రెస్ పాలనలో తెలంగాణ 20 ఏళ్లు వెనక్కి
- మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, జూన్ 30 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం జడ్చర్లలో మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యకర్తలకు ఓటరు జాబితా పరిశీలన, సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న సభలు రైతు ఆశీర్వాద సభలు కావని, అవి రైతు వంచన సభలని ఎద్దేవా చేశారు. యాసంగి రైతుబంధు నిధులు ఇవ్వకపోగా, ఇప్పటివరకు సుమారు రూ. 29,300 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించలేదని ఆరోపించారు. రుణమాఫీ హామీని దేవుళ్ల సాక్షిగా ప్రమాణం చేసి గాలికి వదిలేశారని, రైతు బీమాను నిలిపివేశారని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదని, సంక్షేమ పథకాలకు నిధులు లేవని చెబుతూనే ప్రభుత్వం అనవసర ఆర్భాటాలకు వందల కోట్లు ఖర్చు చేయడం దారుణమని దుయ్యబట్టారు. మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే తెలంగాణ 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలు గమనిస్తున్నారని, అప్పట్లో గంజి కేంద్రాలు ఉండే పరిస్థితుల నుండి నేడు పంటలు పండే స్థితికి తెలంగాణను కేసీఆర్ తీసుకెళ్లారని గుర్తుచేశారు. పార్టీని నమ్మి పదవులు పొంది, తర్వాత వీడి వెళ్లిన వారిని తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలోనే జిల్లా అభివృద్ధి సాధ్యమైందని, కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి పార్టీని మళ్ళీ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, అంజయ్య యాదవ్, నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వాల్య నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి, రజినీ సాయి చంద్ తదితరులు పాల్గొన్నారు.




జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
01 జూలై 2026

# జొన్నలు కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



**మెదక్, జూన్ 30 (జనం సాక్షి) :** జొన్నలు పండించిన రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని, రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కలెక్టరేట్‌ను వీడబోమని, ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు చేపట్టి రైతుల తరఫున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి హెచ్చరించారు.మెదక్ జిల్లా రామాయంపేట మండలంలోని దంతేపల్లి, కాట్రియల, పర్వతాపూర్, కిషన్ తండా, జామ్లా తండా గ్రామాలకు చెందిన రైతులు జొన్నల కొనుగోలును వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించి మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి రైతులతో కలసి ధర్నా నిర్వహించి సంఘీభావం ప్రకటించారు. జొన్నలను కొనుగోలు చేసిన అనంతరం మట్టి పేల్లలు ఉన్నాయనే కారణంతో మార్క్‌ఫెడ్ అధికారులు తిరిగి వెనక్కి పంపడాన్ని నిరసిస్తూ రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఎంతో కష్టపడి పండించిన జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన జొన్నలను నాణ్యత పేరుతో, మట్టి పేల్లలు ఉన్నాయనే సాకుతో తిరిగి రైతులకే అప్పగించడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలియజేసినట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ అధికారులు జొన్నలను తిరిగి పంపిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. జొన్నల కొనుగోలుపై అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కలెక్టరేట్ కార్యాలయం నుంచి కదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి జొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ప్రభుత్వం స్పందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తూ రైతుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ...ఈ ఏడాది జొన్న పంట సాగు చేసిన రైతులు మార్కెట్‌లో సరైన ధర లేక, ప్రభుత్వ కొనుగోళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు పండించిన ప్రతి పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మట్టి పేల్లలు ఉన్నాయనే కారణంతో జొన్నలను తిరస్కరించడం సమంజసం కాదన్నారు. గతంలో మొలకలు వచ్చిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, అదే విధంగా జొన్నలను కూడా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.జొన్నల కొనుగోలులో జరుగుతున్న జాప్యం వల్ల రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని, ప్రభుత్వం ఇకనైనా స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.అనంతరం మార్క్‌ఫెడ్ డిఎం, బాలకృష్ణ డిఆర్ఓ అంబదాస్ జొన్నలు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నాలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ అరేళ్ళ.మల్లికార్జున్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్.కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు చౌదరి. సుప్రభాత రావు,రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ చౌదరి చరిత, బిఆర్ఎస్, నాయకులు ఎస్కే అహ్మద్. ఉమామహేశ్వర్, శ్యామ్,స్మోకింగ్, నవీన్,దోమకొండ శ్రీను,అస్రుద్దిన్, విజయ భాస్కర్ రెడ్డి సత్యపాల్, కిషన్ బాబు సంతోష్ శ్రవణ్ గౌడ్ మహేష్ శ్రీకాంత్, నర్సింగరావు, మెదక్ పట్టణ నాయకులు లింగారెడ్డి ప్రభు రెడ్డి,మోచి. కిషన్, ఇందాద్,సాయి,కిరణ్,ఎంబీపూర్ మహేష్,స్వామి నాయక్,వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచ్ లు,తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల భూ పోరాటాన్ని విజయవంతం చేయాలి




**నారాయణపేట, జూన్ 30 (జనం సాక్షి) :** జూలై 02న నిర్వహించే ఉద్యమకారుల భూ పోరాటానికి ఉద్యమకారు లు,ప్రజలు,యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని నారాయణపేట జిల్లా టి ఆర్ ఎస్ యూత్ నాయకులు మనోజ్ గౌడ్, ఉద్యమ నాయకుడు శివశంకర్ కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని , ఉద్యమ కారుల సమస్యలను ప్రభు త్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని ఉద్యమకారులకు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. జార్ఖండ్ రాష్ట్రంలో ఉద్యమకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు, పెన్షన్,ఇతర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తరహాలోనే తెలంగాణలో కూడా ఉద్యమకారులను గుర్తించాలని అన్నారు.250 గజాల ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి 20 లక్షల ఆర్థిక సహాయం,గుర్తింపు కార్డులు, నెలవారీ పెన్షన్ తో పాటు ప్రభుత్వ రంగాల్లో తగిన రిజర్వేషన్లు కల్పించా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల కోసం పోరాటం చేస్తున్న కవితక్క కు మద్దతు ఇచ్చి ఉద్యమకారులు భూ పోరాటాన్ని విజయవంతం చేద్దాం అని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ నాయకులు మార్కెట్ రవి కుమార్,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## చేనేత ఉత్పత్తులను నాణ్యత పెంచుకోవాలి

- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 30 (జనం సాక్షి) :** అవసరాలకు అనుగుణంగా చేనేత ఉత్పత్తులను పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు.సెంటర్ ఆఫ్ హ్యాండ్లూమ్ ఎక్సలెన్స్ ద్వారా నిర్వహిస్తున్న అడ్వాన్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ పురోగతిపై మంగళవారం జిల్లా కలెక్టరేట్లో వి.సి.హాల్ లో సమీక్ష నిర్వహించబడింది. చేనేత ఉత్పత్తుల నాణ్యత పెంపు,నూతన డిజైన్ల అభివృద్ధి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తుల తయారీపై చర్చించారు. హ్యాండ్లూమ్ ఉత్పత్తుల మార్కెటింగ్‌ను విస్తరించేందుకు రాష్ట్ర,జాతీయ స్థాయి హ్యాండ్లూమ్ ఎక్స్‌పోలు, ప్రదర్శనలు మరియు ఇతర విక్రయ వేదికల్లో పాల్గొనే అవకాశాలపై వివరించారు.వీవర్లు మరియు మాస్టర్ వీవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు,ముఖ్యంగా ముడి పదార్థాల లభ్యత, మార్కెటింగ్, ఉపాధి, డిజైన్ అభివృద్ధి, నైపుణ్య శిక్షణ మరియు ఆర్థిక సహాయం వంటి అంశాలపై చర్చించారు. జిల్లా కలెక్టర్ వీవర్ల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.అదనపు హ్యాండ్లూమ్ డైరెక్టర్ ద్వారక , డీఓ రాజేష్, డీఆర్‌డీఏ వెంకట్ రాములు, పీడీ ప్రభుత్వ పథకాలు, శిక్షణ కార్యక్రమాలు మరియు మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించారు.

# బాల కార్మిక వ్యవస్థపై ఉక్కుపాదం

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 30 (జనం సాక్షి) :** జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా తనిఖీలు నిర్వహించి బాల కార్మిక వ్యవస్థపై ఉక్కు పాదం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అధికారులను ఆదేశించారు. జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్--12 కార్యక్రమం నేపథ్యంలో మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో వివిధ శాఖల అధికారులు,ఆపరేషన్ ముస్కాన్ బృందంతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.18 సంవత్సరాల లోపు పిల్లలను బాలకార్మికులుగా పనిచేయించడం చట్టవిరుద్ధమని తెలిపారు.బాలకార్మికులుగా పనిచేస్తున్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి,తిరిగి పాఠశాలల్లో చేర్పించడం లేదా అవసరమైతే ప్రభుత్వ సంరక్షణ గృహాలకు తరలించడం జరుగుతుందని చెప్పారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై



చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని,అదే నేరాన్ని పునరావృతం చేసిన వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.తల్లిదండ్రులు తాత్కాలిక ప్రయోజనాల కోసం పిల్లలను పనులకు పంపించి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దని సూచించారు.పిల్లలను చదువు మాన్పించి పనులకు వినియోగిస్తున్న తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు, బలవంతంగా పని చేయిస్తున్న పిల్లలు, భిక్షాటన చేస్తున్న చిన్నారులు,ఆశ్రయం అవసరమైన బాలలు లేదా తప్పిపోయిన వీధి బాలలు కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా డయల్--100కు సమాచారం అందించాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ఈ సమావేశంలో డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, ఆపరేషన్ ముస్కాన్ టీమ్ ఎస్సై బాలరాజు, పోలీసు సిబ్బంది,డాక్టర్ లక్ష్మీకాంత్, డీసీపీఓ కరిష్మా, ఎన్‌జీఓ నరేష్, లేబర్ ఆఫీసర్ భాసిత్, ఎంఈఓ బాలాజీ, చైల్డ్ హెల్ప్‌లైన్ నరసింహ, సోషల్ వర్కర్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన కాంప్లెక్స్ చెరువుల ధరలు తగ్గించాలి

- కలెక్టర్‌కు వినతి




**నారాయణపేట, జూన్ 30 (జనం సాక్షి) :** పంచిన కాంప్లెక్స్ ఎరువుల ధరలను దించాలి, యూరియా యాప్ రద్దు చేయాలని కోరుతూ అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ లో వినతి పత్రం సమర్పించారు.ఈ సంద ర్భంగా అఖిల భారత ఐక్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి యాదగిరి, సహాయ కార్యదర్శి కొండ నరసింహులు మాట్లాడుతూ పెంచిన కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించాలని, అవసరమైన ఎరువులు, నకిలీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టి సకాలంలో అందించాలన్నరు. యూరియా యాప్ ను రద్దుచేసి పాత పద్ధతిలోనే యూరియ అటవీ ప్రాంతానికి తరలించ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిమితులు లేకుండా కొనుగోలు చేయాలని అన్నారు. రైతులకు సంబంధించిన తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనియెడను రాష్ట్రవ్యాప్తంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారుఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ బాలకృష్ణ, జిల్లా నాయకులు తాయప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు, మండల కార్యదర్శి సాయిలు, పి వై ఎల్ జిల్లా నాయకులు డి భాస్కర్, వెంకటప్ప, భగవంతు, లక్ష్మప్ప, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

# రూ.25 కోట్లతో స్టేడియం నిర్మాణం

- అన్ని హంగులు కల్పించాలని అధికారులను ఆదేశించిన మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్, జూన్ 30 (జనంసాక్షి) :** రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మక్తల్ స్టేడియంలో అన్ని అందులో కల్పించాలని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. మంగళవారం మక్తల్ పట్టణంలో స్టేడియం నిర్మాణ పనులను మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. మక్తల్ పట్టణంలో రూ.25 కోట్లతో నూతనంగా నిర్మించబోయే స్టేడియం నిర్మాణానికి సంబంధించి అధికారులతో మంత్రి సమీక్ష చేశారు. ఇండోర్, అవుట్ డోర్ స్టేడియంలకు సంబంధించి పలు మార్పులు చేర్పులను అధికారులకు సూచించారు. ఆధునిక హంగులతో, అన్ని వసతులతో ఈ స్టేడియం నిర్మాణం ఉండాలని మంత్రి తెలిపారు. వివిధ క్రీడల్లో వందల మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు స్థానికంగా ఉన్నారని స్టేడియంలో కనీస వసతులు లేకపోవడం వల్ల వారు రాణించలేకపోతున్నారని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల స్టేడియం ఎందుకు పని రాకుండా పోయిందన్నారు. వసతులు కల్పిస్తే ఇక్కడ పెద్ద సంఖ్యలో క్రీడాకారులు బయటకు వచ్చే అవకాశం ఉందన్నారు. రూ. 25 కోట్లతో నిర్మిస్తున్న ఈ స్టేడియంలో పూర్తి వసతులు కల్పించి వివిధ క్రీడాంశాలలో శిక్షణ ఇప్పించి క్రీడారంగానికి ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులను అందించడమే తమ లక్ష్యమని అన్నారు. శిక్షణ కోసం అవసరమైన కోచులను కూడా ఇక్కడ నియమించేందుకు



అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి పూర్తి సదుపాయాలు కల్పిస్తూ ఆధునిక రంగులతో స్టేడియం నిర్మాణం పూర్తి చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. మంత్రి వెంబడి మక్తల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బోయ రవికుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ బి.గణేష్ కుమార్, స్థానిక కాంగ్రెస్ నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా, వాకిటి హన్మంతు, సరాయి హన్మంతు, వాకిటి అంజి, వాకిటి శ్యామ్, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకటేష్, ఇంజినీర్ ఉపేందర్ తదితరులు ఉన్నారు.

## జూలై 3న డా. రెడ్డీస్ ల్యాబొరేటరీస్ క్యాంపస్ నియామకాలు

- కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 30 (జనం సాక్షి) :** ప్రముఖ ఔషధ సంస్థ డా. రెడ్డీస్ ల్యాబొరేటరీస్ క్యాంపస్ ఆధ్వర్యంలో జూలై 3న సంగారెడ్డి లోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ నియామక ప్రక్రియ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ తెలిపారు. కళాశాల ప్లేస్‌మెంట్ విభాగం, రసాయన శాస్త్ర విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 2026 సంవత్సరంలో బీఎస్సీ రసాయన శాస్త్రం పూర్తి చేసిన విద్యార్థులు ఈ నియామకాలకు అర్హులని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలలో కనీసం 60 శాతం మార్కులు ఉండాలని, తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో మాట్లాడగల సామర్థ్యం అవసరమని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు బొల్లారం కేంద్రంలోని సంస్థ యూనిట్లలో ఫార్మా అప్రెంటిస్‌గా శిక్షణతో పాటు వార్షికంగా రూ.2.10 లక్షల స్టైపెండ్, ఉచిత భోజన సౌకర్యం, ఆరోగ్య బీమా, ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు విద్యా ధ్రువపత్రాలు, మార్కుల జాబితాలు, రెండు ఫోటోలు, ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డులు, చిరునామా మరియు ఆదాయ ధ్రువపత్రాలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అర్హులైన బీఎస్సీ పట్టభద్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# మిడ్జిల్ అభివృద్ధిలో వెంకట్ రెడ్డి పాత్ర మరువలేనిది

- వెంకట్ రెడ్డి విగ్రహావిష్కరణలో బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు

**మిడ్జిల్, జూన్ 30 (జనం సాక్షి) :** మాజీ సర్పంచ్ రాధిక భర్త వెంకట్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యకర్తలు స్వంత ఖర్చులతో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బీఆర్ఎస్ సిఎల్పీ నేత, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి , శ్రీనివాస్ గౌడ్ , మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఛైర్మన్ లు అల్లీపూరం వెంకటేశ్వర్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ , రజినిసాయిచంద్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు పార్టీ నాయకులు మండల కేంద్రంలోని భారీ ర్యాలీ నిర్వహించారు .బాణసంచాలు కాల్చి ర్యాలీ తో ముందుకు సాగారు. ఈసందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. వెంకట్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషబీఆర్ఎస్ కుటుంబంలో ఎ కష్టమొచ్చిన బీఆర్ఎస్ అండగా ఉంటుంది .కేసీఆర్ తెలంగాణ సాధించి బీఆర్ఎస్ కార్యకర్తల గౌరవం పెంచారు .ఉద్యమ పార్టీగా అవతరించి రాజకీయ పార్టీగా బీఆర్ఎస్ ఎదిగింది .ఏ పార్టీ కార్యకర్తకు లేని గౌరవం బీఆర్ఎస్ కార్యకర్తకు ఉందని అన్నారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఏనాడైనా జై తెలంగాణా అన్న



మొఖమా నీది,అమరులకు శ్రద్ధాంజలి ఘటించావా.తెలంగాణ గురించి మాట్లాడే నైతికత నీకున్నాదా రేవంత్ రెడ్డి .తెలంగాణ కోసం అసువులు బాసిన అమరులకు ఎన్నడైన శ్రద్ధంజలి ఘటించావా.. జై తెలంగాణా అన్నోడివి కాదు పోరాడినోడివి కాదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మొదటి రాజీనామా చేసిన ఘనత లక్ష్మారెడ్డి .. ఉద్యోగాన్ని సైతం వదిలి ఉద్యమ బాట పట్టి జైలు జీవితాన్ని గడిపిన ఘనత శ్రీనివాస్ గౌడ్ ది.తెలంగాణ ఉద్యమకారులపైన తుపాకీ పెట్టిన తెలంగాణ ద్రోహి రేవంత్‌రెడ్డి. అయన తెలంగాణ ఉద్యమం గురించి ,బీఆర్ఎస్ నాయకుల గురించి మాట్లాడే అర్హత లేదు. వెన్ను పోటుపొడిచి, నీవ్వు మాయ మాటలు చెప్పి అబద్ధాల మాటలతో రేవంత్ రెడ్డి సీఎం అయ్యాడు. జై తెలంగాణా అనని నీవు తెలంగాణ గూర్చి మాట్లాడే నైతిక హక్కు లేదు. ఆంధ్ర పాలకులకు కొమ్ము కాస్తూ చంద్రబాబు కు కృష్ణ ,గోదావరి జలాలను దోచి పెట్టి పాలామూరు జిల్లా కు ద్రోహం చేస్తున్నావు. రేవంత్ నిర్లక్ష్యం వల్ల తుంగభద్ర నదిపైన 50 టీఎంసీల నీటిని పోలవరం మడికచర్ల ద్వారా తరలిస్తున్నారు. కేఎల్ఐ తో మిడ్జిల్ మండలానికి నీళ్లు తీసుకవచ్చింది మాజీ మంత్రి లక్ష్మారెడ్డి. అన్న..దుందుభి నదిపైన ఆక్విడేట్ నిర్మాణానికి రాత్రి నిద్రలు లేకుండా అక్కడే గడిపి పనులను పూర్తి చేసేందుకు మంత్రులుగా కాకుండా సేవకుల్లా పనిచేశావు.మూడేళ్లుగా పాలమూరు కు నీవు ఎంచేశావ్.. మూడు గజాల కొత్త కాల్వలు తవ్వవా.. కొత్త ప్రాజెక్టులు ఎమైన కట్టారా.. ప్రజలకు వివరించాలి. మాజీ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల స్వంత ఖర్చులతో మిడ్జిల్ మాజీ సర్పంచ్ రాధిక భర్త వెంకట్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడం అయనకున్న అభిమానానికి నిదర్శనమన్నారు . ఈకార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ కుచూరి శ్రీనివాస్ రెడ్డి ,నాయకులు సుధా బాల్ రెడ్డి పాండు ,,సుదర్శన్ ,బాలు, గంజి కృష్ణ ,గిరినాయక్, జంగారెడ్డి ,జైపాల్ రెడ్డి ,శ్రీనివాస్ గుప్తా , మతీన్ ,గోపాల్ రెడ్డి ,నామని శ్రీనివాసులు ,శ్రీనివాస్ గౌడ్ ,చంద్రయ్య గౌడ్ ,దేవేందర్ రెడ్డి భీంరాజ్ ,బంగారు ,జగన్ గౌడ్ ,జగదీష్ లతో పాటు తదితరులు ఉన్నారు.

# కుల వివక్షతకు తావివ్వద్దు

- రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు



**చిన్నశంకరంపేట, జూన్ 30 (జనం సాక్షి) :** కుల వివక్షతకు తావివ్వొద్దని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సివిల్ రైట్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ, అంటరాని తనం, మౌలిక వసతులు, అందరికీ సమానత్వమేనని తెలిపారు. కులాల విభజన ఆధిపత్యం పోరు వంటివి సమాజంలో నేరమని తెలిపారు. ప్రతి ఒక్కరు సమాజంలో సమానులేనని, అందరికీ సమ న్యాయం అందించేందుకు ప్రభుత్వ విచ్చేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్, పోలీస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీటికొలనులో పడి మహిళ మృతి



**బచ్చన్నపేట, జూన్ 30 (జనంసాక్షి) :** నీటి కొలనులో పడి మహిళా మృతి చెందిన సంఘటన మంగళవారం బచ్చన్నపేట మండలంలోని చిన్న రామ చర్ల శివారు మొండికుంట దగ్గర్లో జరిగిందని స్థానిక ఎస్సై ఏ శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బచ్చన్నపేట మండలం మొండికుంట సమీపంలోని గుర్రాల నర్సిరెడ్డి వ్యవసాయ నీటి కొలనులో చిన్నరామంచర్ల గ్రామానికి చెందిన గుండా వాణి (33), భర్త ఉపేందర్, వృత్తి వ్యవసాయం , నీటి కొలనులో పడిన మేకను బయటకు తీసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు నీటి కొలనులో జారి పడిందని ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందిందని సమాచారం అందుకున్న వెంటనే బచ్చన్నపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి జరిగిందని ఆయన తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ప్రజలు నీటి కొలనులు, చెరువులు, కాలువలు ఇతర నీటి వనరుల వద్ద అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ప్రమాదకర పరిస్థితుల్లో ఒంటరిగా నీటిలో దిగరాదని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రిటైర్డ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బేల శ్యామ్ సుందర్

# మృతదేహం వద్ద యోగానంద్ నివాళులు



**వరంగల్ ఈస్ట్, జూన్ 30(జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని రంగసాయిపేటకు చెందిన రిటైర్డ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బేల శ్యామ్ సుందర్ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని రిషినంద్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, బిజెపి జోనల్ సాంస్కృతిక విభాగం కన్వీనర్ కొల్లూరి యోగానంద్ నివాళులర్పించారు. శ్యాంసుందర్ ఆత్మకు శాంతి కలగాలని ఈ సందర్భంగా ప్రార్థించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చారు. యోగానందు తో పాటు మాచర్ల చిన్నారావు, తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా శ్యాంసుందర్ కు ఇద్దరు కుమారులు ఒక కూతురు ఉన్నారు. రంగసాయిపేటలో మొదట వీరాంజనేయ స్కూలు స్థాపించి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుగా అందరికీ సుపరిచితులు. అనంతరం అటవీ శాఖలో ఫారెస్ట్ శాఖలో ఉద్యోగం పొంది బీట్ ఆఫీసర్ రిటైర్ అయ్యారు. అదేవిధంగా స్థానికంగా ఉన్నటువంటి శ్రీ భవాని శంకరు దేవాలయ అభివృద్ధికి కూడా కృషి చేశారు. బేల శ్యామ్ సుందర్ మృతి పట్ల పలువురు తమ సంతాపాన్ని వెలిబచ్చారు.

# బీజేపీ నేతలు అసత్య ప్రచారం మానుకోవాలి

- వరంగల్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం : ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ, ప్రతినిధి జూన్ 30 (జనంసాక్షి) :** హనుమకొండ లో జరిగిన బీజేపీ సభలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు దూరంగా, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.మంగళవారం మీడియాతో మాట్లాడుతూ. ఎమ్మెల్యే నాయిని, బండి సంజయ్, కిషన్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు వింటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్‌తో ప్రత్యక్ష, పరోక్ష రాజకీయ అనుబంధం కొనసాగించిన బీజేపీ తెలంగాణకు ఏం సాధించిందో ముందు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మామునూరు విమానాశ్రయ భూసేకరణ కోసం రూ.300 కోట్ల నిధులు కేటాయించి ప్రక్రియను వేగవంతం చేసింది ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలు ఆ మార్పును ప్రత్యక్షంగా చూస్తున్నారని పేర్కొన్నారు. వరంగల్ అభివృద్ధిపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు రావాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఎమ్మెల్యే నాయిని సవాల్ విసిరారు. “తేదీ, సమయం మీరే నిర్ణయించండి... కాంగ్రెస్ పార్టీ చర్చకు సిద్ధంగా ఉంది. వరంగల్‌కు ఎవరు ఏం చేశారో ప్రజల ముందే చర్చిద్దాం’ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరంగల్ అభివృద్ధి కొత్త వేగాన్ని అందుకుందని, విమర్శలు చేసే ముందు బీజేపీ నేతలు తమ పదేళ్ల పాలనలో తెలంగాణకు సాధించిన ఒక్క ప్రధాన అభివృద్ధి పనినైనా ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# హాట్సాఫ్.. ట్రాఫిక్ హోంగార్డ్ రాజు



**వరంగల్ ఈస్ట్, జోన్ 30 ( జనం సాక్షి) :** విధి నిర్వహణలో ట్రాఫిక్ ను నియంత్రిస్తూ.. వాహనదారులు, పాదచారులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బంది కలగకుండా వారు క్షేమంగా వెళ్లేలా చేయడమే కాకుండా కొంతమంది వృద్ధులు, దివ్యాంగులు, చేతకాని వారు రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతుండడం గమనిస్తూ వారిని క్షేమంగా రోడ్డు దాటేందుకు మట్టేవాడ ట్రాఫిక్ పిఎస్ కు సంబంధించిన హోమ్ గార్డ్ నూనె రాజు చెయ్యి పట్టి తీసుకెళ్లడం కనిపించింది. వరంగల్ నగరంలోని అండర్ రైల్వే గేట్ ఖమ్మం రోడ్డు గవిచర్ల క్రాస్ వద్ద మంగళవారం సాయంత్రం ఈ దృశ్యం కనిపించింది. నరసింహులపేట మండలంకు చెందిన చేతకాని నడవలేని ఓ వృద్ధుడు రోడ్డు దాటే ప్రయత్నంలో చాలాసేపు పడుతున్న ఇబ్బందిని గమనించిన నూనె రాజు అతనిని క్షేమంగా చెయ్యి పట్టి రోడ్డు దాటించాడు. విధి నిర్వహణే కాకుండా మానవత్వాన్ని చాటుకున్న హోంగార్డు రాజును అందరూ అభినందించారు.

# వాతావరణ సూచిక స్క్రీన్ పని చేస్తోంది

- ‘జనంసాక్షి’ కథనానికి స్పందన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ వాతావరణ సూచిక మంగళవారం నుండి పనిచేస్తుంది. కలెక్టర్ కార్యాలయం ప్రధాన భవనం మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ సూచిక ద్వారా ఉష్ణోగ్రత, తేమ, గాలి వేగం వంటి వివరాలను ప్రజలు, అధికారులు తెలుసుకునేవారు. కొద్ది రోజులుగా పనిచేయక పోవడంతో దీనిపై ‘కలెక్టరేట్ లో కనిపించని వాతావరణ సూచిక’ అనే కథనం ‘జనంసాక్షి’ లో మంగళవారం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా అధికారులు మరమ్మతులు చేయించి, వెంటనే వినియోగం లోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం స్క్రీన్ పై వాతావరణ సమాచారం అందుబాటులోకి రావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టరేట్‌లో కనిపించని వాతావరణ సూచిక

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ వాతావరణ సూచిక కొన్ని రోజులుగా పనిచేయడం లేదు. కలెక్టర్ కార్యాలయం ప్రధాన భవనం మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ఈ సూచిక ద్వారా ఉష్ణోగ్రత, తేమ, గాలి వేగం వంటి వివరాలను ప్రజలు, అధికారులు తెలుసుకునేవారు. ప్రస్తుతం స్క్రీన్ నల్లగా ఉండటంతో ఎలాంటి సమాచారం

# 300 కోట్లతో నియోజకవర్గంలోని విద్యాసంస్థల బలోపేతం

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం
- కేజీబీవీలను జూనియర్ కాలేజీలుగా అప్ గ్రేడ్ చేయించా



**స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 30 (జనంసాక్షి) :** 300కోట్లతో నియోజకవర్గంలోని విద్యా సంస్థల బలోపేతం చేసానని,దేశంలో ఎక్కడలేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ తీసుకువచ్చరని, గతం లో 10వ తరగతి వరకే ఉన్న కస్తూరిభా గాంధీ పాఠశాలలను జూనియర్ కాలేజీలుగా ఇంటర్ వరకు విద్యా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నేనే అప్ గ్రేడ్ చేయించానని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలి పారు.చిల్పూర్ మండలం వెంకటేశ్వర్ల పల్లి, తీగల తండా, రాజవరం కస్తూరిభా గాంధీ పాఠశాలలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థా పనల కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అలా గే గ్రామలలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం రాజవరంలోని కస్తూరిభా గాంధీ పాఠ శాలలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపనలుచేసి, ప్రారంభించా రు.ఆ తర్వాత చిల్పూర్ మండలానికి సంబందిం చిన 35 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధి దారులకు 11లక్షల 34వేల రూపాయల విలువగ ల చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన చిల్పూర్, వేలేరు మండలాలలో కస్తూరిభా గాంధీ పాఠశాల లు ఉండాలని చిల్పూర్, వేలేరు మండలాలకు కేజీబీవి పాఠశాలలను మంజూరు చేయించానని తెలిపారు.వెంటనే నిధులు తీసుకువచ్చి పాఠశాల భవనాల నిర్మాణం కుడా పూర్తి చేయించానని అన్నారు. 2023లో మళ్ళీ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కేజీబీవి పాఠశాలలను సందర్శించి సమ స్యలను గుర్తించి నియోజకవర్గం పరిధిలోని కేజీబీవిలు, మాడల్ స్కూల్లలో మౌలిక వసతుల కల్పనకు రెండు విడతలలో 18కోట్ల 98లక్షలు మంజూరు చేసానని వెల్లడించారు. ఎమ్మెల్యే గా ఎన్నికైన ఈ రెండున్నర ఏళ్లలో నియోజకవర్గంలో ని కేజీబీవిలు, మాడల్ స్కూల్స్,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, డిగ్రీ కళాశాల తో పాటు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు దాదాపు 300కోట్ల నిధులను వెచ్చించినట్లు తెలిపారు. దింతో పాటు నెల రోజులలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాబోతుందని ప్రకటించారు. విద్యా లయాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. విద్యా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని విద్యా హబ్ గా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తున్నారని అందులో భాగంగానే దేశంలో నే ఎక్కడా లేని విధంగా 200 కోట్లతో నియోజక వర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసి డెన్షియల్ స్కూల్, నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారని కొనియాడా రు. గతంలో నేను విద్యా శాఖ మంత్రి ఉన్నప్పుడు వరంగల్ జిల్లా 10వ తరగతి ఫలితాలలో ఉమ్మడి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలి పారు. చేసే పని పట్ల నిబద్ధత ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతామని సూచించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని స్పష్టం చేశారు. విద్యార్థుల పట్ల ప్రతేక శ్రద్ద వహిస్తూ స్వంత బిడ్డలుగా చూసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల ను ఉపయోగించుకొని కష్టపడి చదవాలని అన్నా రు. విద్య తోనే ఉన్నత శిఖరాలకు చేరుకోగలమ ని వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ఏకైక లక్ష్యం అని, అందుకు ఉపాధ్యాయులకు ఏవిధమైన సహాయ సహకారా లు అందించేందుకు అయిన ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ఉపాధ్యాయులదని, సమస్యలు పరిష్కరించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ ఆర్డీవో కిరణ్ ప్రకాష్, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, వెంకటేశ్వర పల్లి, తీగల తండా, రాజవరం సర్పంచులు శివరా త్రి రేణుక వీరాస్వామి,తీగల సాంబరాజు, మోటం రాజు, పిఏసిఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు,, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపిడివో కృష్ణ ప్రసాద్, కేజీబీవి స్పెషల్ ఆఫీసర్ స్వప్న, డిసిడిఇ ఓ గౌసియా, నాయకులు గడ్డమీది సురేష్ కుమా ర్, జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, పోలపల్లి రంజిత్ రెడ్డి, నరసింహారెడ్డి, మల్లారెడ్డి, తాళ్ల పెల్లి సమ్మయ్య , రత్నాకర్ రెడ్డి, గట్టయ్య, సంపత్ రాజ్ , కుమార్, నీల రాజు,బానోత్ రూప్లా నాయక్,సంజీవ, రాజు, చేరాలు, వివిధ గ్రామాల సర్పంచులు, మండల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు, నాయకులు కార్యకర్తలు, లబ్ధిదారులుతదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక ఎంఆర్ఐ సేవలు ప్రారంభం

- సోమవారం హైదరాబాద్ నుండి వర్చువల్ విధానంలో ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి
- కలెక్టర్, ఎమ్మెల్యే, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాజమాన్యాన్ని అభినందించిన సీఎం





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజలకు అత్యాధునిక మరియు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎం.ఆర్.ఐ యంత్రాన్ని సోమవారం ఆయన హైదరాబాద్ నుండి వర్చువల్ విధానంలో ఘనంగా ప్రారంభించారు. ఈ వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ ఐతా ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ జిల్లా స్థాయిలోనే ఎం.ఆర్.ఐ సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గతంలో ఇలాంటి ఖరీదైన వైద్య పరీక్షల కోసం పేదలు వరంగల్, హైదరాబాద్ వంటి సుదూర నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని, దీనివల్ల వారికి సమయం, డబ్బు వృధా అయ్యేవని తెలిపారు. ఇప్పుడు స్థానికంగానే ఈ సేవలు అందుబాటులోకి రావడం వల్ల సకాలంలో ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ జరిగి, మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. ప్రజా వైద్య సేవల బలోపేతానికి సీఎస్ఆర్ నిధులతో ఎంఆర్ఐ యంత్రాన్ని ఏర్పాటు చేయుటకు ప్రత్యేక చొరవ చూపిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును, అలాగే ఇందుకు సహకరించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాజమాన్యాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ సీఎస్ఆర్ నిధుల భాగస్వామ్యంతో ఈ అత్యాధునిక యంత్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత మెరుగుపరచేందుకు, మౌలిక వసతుల కల్పనకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ప్రతిష్టాత్మక ప్రారంభ కార్యక్రమంలో జిల్లా ప్రధాన ఆసుపత్రి నుండి పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా వెంకటేశ్వర్లు, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా వెంకట రత్నం, కౌన్సిలర్లు, హెచ్ డి ఎఫ్ సి జోనల్ హెడ్ జోష్ స్టెఫిన్, క్లస్టర్ హెడ్ రాజేష్ వైద్యులు, సిబ్బంది, ఇతర ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.




## నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల

# నిర్వహణపై శిక్షణ

**హనుమకొండ ప్రతినిధి జూన్ 30 (జనంసాక్షి) :** హనుమకొండ కలెక్టరేట్ లోగ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్మాణం, కూల్చివేత వ్యర్థాల నిర్వహణ అంశంపై మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లు, సంబంధిత అధికారులకు ఒకరోజు నాయకత్వ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఆస్కీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బి. జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధ్యక్షత వహించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో రాష్ట్రంలోని 15 మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, పారిశుద్ధ్య విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాసర ఐఐటీలో సీటు సాధించిన గిరిజన కుసుమం



**శాయంపేట, జూన్ 30 ( జనం సాక్షి) :** శాయంపేట మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన వాంకుడోత్ రవి సుజాత కూతురు వైష్ణవి పదవ తరగతిలో 563 మార్కులు సాధించింది. పెద్దాపూర్ ఎం జె పి లో పదవ తరగతి వరకు చదివింది తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ కూతురుని చదివించారు. బాసరలో సీటు రావడం చాలా సంతోషంగా ఉందని గర్వంగా ఉందని తల్లిదండ్రులు చెప్పారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భావి తరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, ఆర్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేరం చేస్తే శిక్ష పడుతుందన్న భయం కలగాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- పలువురికి ప్రశంసా పత్రాలు అందజేత



**వరంగల్ బ్యూరో, జూన్ 30 (జనం సాక్షి) :** నేరం చేస్తే కోర్టులో శిక్ష పడుతుందని భయాన్ని నిందితులను కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో నిందితులు పాల్పడిన నేరాలను కోర్టు నిరూపించి నేరస్థులకు శిక్ష పడటంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో పాటు దర్యాప్తు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందిస్తూ మంగళవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన ప్రశంస పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గత ఏడాది జూలై నుండి నేటి వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 41 కేసుల్లో నిందితులు పాల్పడిన నేరాలకు కోర్టులో శిక్షలు విధించడం జరిగింది. ఇందులో ప్రధానం చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన జంట హత్యల కేసులో నిందితుడికి కోర్టు ఉరిశిక్ష విధించడం జరిగింది. వీటితో పాటు యావజ్జీవ కారాగార శిక్షలతో పాటు 20 ఏళ్ల కఠిన శిక్షలు కూడా విధించడం జరిగిందని, ఇన్ని కేసుల్లో నిందితులకు శిక్షలు పడటంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల కృషి అభినందనీయమని, దీనితో నేరాలు నిరూపించపబడి నిందితులకు శిక్షలు పడటంలో వృద్ధి శాతం ఏడు శాతానికి పెరిగిందని, ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లోను అధికారులు అత్యధిక కేసులను పరిష్కరించారని, ఇదే రీతిలో రాబోవు రోజుల్లో మరిన్ని కేసుల్లో నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని, కేసులను నమోదు , దర్యాప్తు చేయడం మాత్రమే కాదు నిందితులకు శిక్ష పడ్డప్పుడే పోలీసులకు గుర్తింపు వుంటుందని. శిక్ష పడినప్పుడే నేరాల తగ్గే అవకాశం వుంటుందని తెలిపారు. ప్రధానంగా కేసులు తుది దశ వరకు వచ్చేవరకు, నిందితులకు శిక్షలు ఖరారు అయ్యేందుకు పోలీసులు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయాలని సిపి తెలిపారు. అనంతరం సిపి చేతుల మీదుగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రశంస పత్రాలను అందజేసారు.ఈ కార్యక్రమములో సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ప్రాసిక్యూషన్ జాయింట్ డైరక్టర్ రాము, ఏసిపిలు డేవిడ్‌రాజు, సతీష్‌బాబు, సదయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీనివాస్, సంతోషి, రవి కిరణ్, హరిచంద్ర ప్రసాద్, బృందా దేవి, దుర్గాబాయి, రాజమల్లారెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవీందర్ రావు, కిరణ్ కుమార్, నీజర, ఇన్స్‌స్పెక్టర్లు సంజీవ్ రావు, మల్లయ్యతో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీ త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, జూన్ 30 (జనంసాక్షి) :** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం లోకేశ్వరం మండలంలో పర్యటించి ప్రభుత్వ ఆసుపత్రి, కేజీబీవీ పాఠశాల, రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ, ఆయిల్ పామ్ తోటను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, వర్షాకాల సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కేజీబీవీలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాలని, విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలు పెంపొందించే బోధన చేపట్టాలని సూచించారు. రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న రైతుల నమోదును తక్షణమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాల కోసం ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ఆయిల్ పామ్ తోటను సందర్శించి, అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి, డి.భోజన్న. వైద్యాధికారి డా,, రాజేందర్ ,వ్యవసాయాధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ శాఖ అధికారి రమణ, తహసిల్దార్ సూర్య రావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు అధికారులు, పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ఆహార నాణ్యత, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**● జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 30 (జనంసాక్షి) :** జూలూరుపాడు మండలం జూలూరుపాడు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల మరియు కళాశాల, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులను పరిశీలించారు. ఏడో, ఎనిమిదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, వసతి, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఔటింగ్ రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, బాలికలను తల్లిదండ్రులు లేదా అధికారికంగా అనుమతించిన సంరక్షకులతో మాత్రమే బయటకు పంపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం కిచెన్ షెడ్‌ను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సరుకులను పరిశీలించారు. అనంతరం కిచెన్ షెడ్‌ను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన సరుకులను తనిఖీ చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. ప్లాంట్ మరమ్మతులు ఆలస్యమవుతున్న కారణాలను అడిగి



తెలుసుకుని, వెంటనే మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, పాఠశాలలో నమోదైన విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా పప్పు పలుచగా ఉండటంతో పాటు నాణ్యత లోపించిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వడ్డించే ఆహారం పరిశుభ్రంగా, పోషక విలువలతో, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. తాను మళ్లీ ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఆహార నాణ్యతలో లోపాలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని అన్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. తాగునీరు, పరిశుభ్రత, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల పెంపుతో పాటు వారి ఆరోగ్యం, సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాలల్లో గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్ది విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు మరింత విశ్వాసం కలిగేలా విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, పోషకాహార నాణ్యతను మరింత మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో తాళ్లూరి రవి,ఎంఈఓ జుంకీలాల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎండీ పర్యటనలో రాజపురానికి వరం

**● 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు**



**అన్నపురెడ్డిపల్లి, జూన్ 30 (జనం సాక్షి) :** మండల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి సోమవారం మండలంలోని పెంట్లం గ్రామంలో ఉన్న సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిశీలించారు. విద్యుత్ పంపిణీ, నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకుని వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలన్నారు. ఈ సందర్భంగా మండలంలో విద్యుత్ సరఫరాను సమర్థవంతంగా నిర్వహిస్తున్న అన్నపురెడ్డిపల్లి ఏఈ తరుణ్‌ను సీఎండీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే మండల పరిధిలోని రాజపురం గ్రామానికి కొత్తగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరైన విషయంపై వివరాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.

మండలంలో రెండు సబ్‌స్టేషన్లు అందుబాటులోకి రావడంతో విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు రైతులు, గృహ వినియోగదారులు, పారిశ్రామిక అవసరాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని సీఎండీ పేర్కొన్నారు. రాజపురం గ్రామానికి 33/11 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేసినందుకు గ్రామ పెద్దలు భీమిరెడ్డి రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దుబాకుల రాము, గణపతి రెడ్డి, చినముత్యం, బన్నె చెన్నారావు తదితరులు సీఎండీ వరుణ్ రెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఈ మహేందర్, డీఈ రంగస్వామి, ఏడీఈ రవికుమార్, అన్నపురెడ్డిపల్లి ఏఈ తరుణ్‌తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలో డమ్మీ అభ్యర్థితో పరీక్ష రాయించిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 30 (జనం సాక్షి) :** పదో తరగతి పబ్లిక్ పరీక్షలో అసలు అభ్యర్థికి బదులుగా మరొకరితో పరీక్ష రాయించిన కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ కె. సాయి మంగళవారం తీర్పు వెలువరించారు. కేసు వివరాల ప్రకారం, 2019 నవంబర్ 4న నిర్వహించిన పదో తరగతి సోషల్ స్టడీస్ పబ్లిక్ పరీక్ష సందర్భంగా కొత్తగూడెంలోని లిటిల్ బర్డ్స్ పాఠశాలలో నిర్వహించిన తనిఖీల్లో, అసలు అభ్యర్థి తెల్లం అనిల్ స్థానంలో పూనెం సందీప్ పరీక్ష రాస్తున్నట్లు స్క్వాడ్ అధికారులు గుర్తించారు. హాల్ టికెట్‌ను పరిశీలించి అక్రమం జరిగినట్లు నిర్ధారించిన అనంతరం, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కుసుమ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అప్పటి కొత్తగూడెం టౌన్ ఎస్సై పి. రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం సేకరించిన ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలు, పత్రాలను పరిశీలించిన కోర్టు నిందితులపై అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించింది. దీంతో, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీసెస్ అండ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం, 1997లోని సెక్షన్ 8 కింద మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా, అలాగే సెక్షన్ 419 ఐపీసీ కింద ఒక సంవత్సరం జైలు శిక్ష విధించింది. ఈ రెండు శిక్షలను ఏకకాలంలో (జశీఅఛబతీతీవత్) అనుభవించాలని కోర్టు తన తీర్పులో పేర్కొంది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నార్సింగ్ అనిల్ కుమార్ వాదనలు వినిపించగా, కోర్టు నోడల్ అధికారి ఎస్సై డి. రాఘవయ్య (కోర్టు డ్యూటీ ఆఫీసర్), డి. కామేశ్వరరావు సమన్వయం అందించారు.

## కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య బోధన్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 30 (జనం సాక్షి) :** బోధన్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను మంగళవారం కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించారు. బోధన్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో కొనసాగింది. ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో ప్రభుత్వ సలహాదారు, స్థానిక ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలో పాల్గొన్నారు. సరిపడా కోరంను నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. ఎక్స్ అఫిషియోను కలుపుకుని మొత్తం 39 మందికి గాను, పూర్తి స్థాయిలో 39 మంది సభ్యులు హాజరయ్యారు. ఆయా కేటగిరీల వారీగా కో ఆప్షన్ పదవి కోసం వచ్చిన ప్రతిపాదనల మేరకు పేర్లను చదువుతూ, చేతులు ఎత్తే పద్ధతి ద్వారా నలుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నిక ప్రక్రియను ప్రిసైడింగ్ ఆఫీసర్ ప్రకటించిన తదుపరి 12 మంది ఎంఐఎం కౌన్సిలర్లు ఎన్నికను బహిష్కరిస్తున్నామని ప్రకటించి సమావేశం హాల్ నుండి బయటకు వెళ్లిపోయారు. మిగతా సభ్యులతో ఎన్నిక ప్రక్రియను కొనసాగించారు. నాలుగు కోఆప్షన్ పదవులకు గాను మొత్తం 35 దరఖాస్తులు రాగా, పేర్లను చదువుతూ, చేతులు ఎత్తే పద్ధతి ద్వారా కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా నిబంధనలను పక్కాగా పాటిస్తూ, వీడియో చిత్రీకరణ మధ్య పూర్తి పారదర్శకంగా ఈ ఎన్నిక ప్రక్రియ జరిపించారు.మెజారిటీ సభ్యుల (19 మంది) మద్దతు మేరకు దండు సంగ్రామ్, మాసుల లక్ష్మి, మహమ్మద్ ఇమ్రాన్, రఫీయా బేగంలు కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ జాదవ్ కృష్ణ ప్రకటించారు. నూతనంగా కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన వారికి నియామక ధృవీకరణ పత్రాలు అందజేశారు. కో ఆప్షన్ ఎన్నికను పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులకు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందలు తెలియజేశారు. ఈ ఎన్నిక ప్రక్రియలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ గొప్ప భరోసా

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 30 (జనం సాక్షి) :** నిజామాబాద్ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాలు తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేని నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు.ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి వారికి అవసరమైన సమయంలో సహాయం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.ఆపదలో ఉన్న కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందించే సీఎంఆర్ఎఫ్ పథకం అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందని తెలిపారు. నిజామాబాద్ పట్టణంలోని పలు డివిజన్లకు చెందిన మొత్తం 42 మంది లబ్ధిదారులకు రూ.28 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసినట్లు షబ్బీర్ గారు వెల్లడించారు.భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు అయ్యేలా తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి పారదర్శకంగా అమలవుతోందని ఆయన పేర్కొన్నారు.మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, ఎలాంటి పైరవీలు లేదా ఖర్చులు లేకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారులకే చెక్కులు అందజేస్తున్నామని చెప్పారు.అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి నిజమైన అర్హులకు ఈ



పథకం ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నూడ చైర్మన్ కేశ వేణు , గీత పరిశ్రమక శాఖ సహకార శేఖర్ గౌడ్, ఆకుల లలిత, డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షులు బొబ్బిలిరామకృష్ణ ,జావిద్ అక్రమ్, కరీం, రత్నాకర్, ఫహీం, హరుణ్ ఖాన్, హాఫిజ్ లైక్ ఖాన్,అహ్మద్, నయీమ్ షహరాన్, పాపా ఖాన్, జాఫర్ హుస్సేన్, వహీద్, ముజాహిద్ ఖాన్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆలయంలో అవినీతికి తావులేదు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 30 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయంలో అవినీతికి తావులేదని,దళారులను నమ్మి భక్తులు మోసపోవద్దని ఆలయ ఈవో రమాదేవి భక్తులకు సూచించారు.సోమవారం రాజన్న దర్శించుకున్న భక్తులు మంగళవారము శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాల మొక్కలు సమర్పించడం సనాతన ఆచారం. ఇదే క్రమంలో బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉన్న క్రమంలో క్యూలైన్లు,బోనాల సమర్పణ స్థలాలను ఆమె పరిశీలించారు. ఎండ తీవ్రత,రద్దీ దృష్ట్యా భక్తులకు తాగునీరు,నీడ వంటి కనీస వసతుల్లో లోపాలు రాకుండా చూడాలని ఆలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.భక్తుల రక్షణ, పారదర్శకతను పరిశీలించే క్రమంలో ఈవో క్యూలైన్లలో ఉన్న భక్తుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడుతూ వారి మొక్కుబడి



టిక్కెట్లు అయినా బెల్లంసాక , పట్నాల టికెట్లను ఆమె తనిఖీ చేశారు.అమ్మవారి దర్శనం చేసుకుంటున్న క్రమంలో క్యూలైన్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. కొబ్బరికాయలు కొట్టే స్థలంలో కానీ, బోనాలు చెల్లింపు, పట్నాలు వేసే చోట ఎవరైనా మిమ్మల్ని అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అని ఈవో అడిగి తెలుసుకున్నారు.అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల లోనే తమ మొక్కుబడి కానుకలు వేయాలని, అర్చకులకు, పట్నాలు వేసే వారికి డబ్బులు చెల్లించవద్దని ఆమె సూచించారు.అమ్మవారికి సమర్పించే మొక్కుబడుల టిక్కెట్లు తీసుకొని తమ మొక్కు బడులు చెల్లించుకోవాలన్నారు. ఆలయంలో భక్తులను ఎవరైనా డబ్బులు అడిగి ఇబ్బంది పెడితే, వెంటనే అక్కడ విధుల్లో ఉన్న ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని,లేదా ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని భక్తులకు సూచించారు. బద్ది పోచమ్మ ఆలయంలో అవినీతికి పాల్పడే సిబ్బందిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.

# మైనార్టీ మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ లక్ష్యం

**● ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 30 (జనం సాక్షి) :** నిజామాబాద్ పట్టణంలోని న్యాక్ సెంటర్‌లో మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో, తెలంగాణ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు తమ కుటుంబాలకు అండగా నిలిచి, గౌరవప్రదమైన జీవనం సాగించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. నిజామాబాద్ జిల్లాలో రూ.1.02 కోట్ల వ్యయంతో మొత్తం 1,700 కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్నామని, అందులో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 500 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించడం సంతోషకరమని తెలిపారు.ఈ పథకం ద్వారా అనేక కుటుంబాలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నాయకత్వంలో మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని రంగాల్లో మైనార్టీల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.కుట్టు మిషన్లు పొందిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చిన్న పరిశ్రమలుగా అభివృద్ధి చెందాలని, మరికొందరికి కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో




నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, నుడా చైర్మన్ కేశ వేణు, రత్నాకర్ , జావిద్ అక్రమ్ , హీూ ఫహీం , నయీమ్, కరీం, పాప ఖాన్, హఫీస్ లయీక్ ఖాన్ , హరూన్ ఖాన్,మైనార్టీ వెల్ఫేర్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా లబ్ధిదారులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# జూన్ నెలలో 171 శాతం ఉత్పత్తి సాధించిన మణుగూరు ఏరియా..

**మణుగూరు, జూన్ 30 (జనంసాక్షి) :** రాబోయే రెండు నెలలు వర్షాకాలం ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతోంది దాని దృష్టిలో పెట్టుకొని లక్ష్యాన్ని చేరుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ పేర్కొన్నారు మంగళవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఉత్పత్తి ఉత్పాదకరపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ...జూన్ నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 6 లక్షల 48 వేల 500 టన్నులకు గాను 11 లక్షల 7 వేల 882 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడమైనది. జూన్ నెలలో సాధించిన ఉత్పత్తి 171 శాతం. అలాగే 01 ఏప్రిల్, 2026 నుండి 30 జూన్, 2026 వరకు ప్రోగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 25 లక్షల 62 వేల 500 టన్నుల లక్ష్యానికి గాను 32 లక్షల 40 వేల 75 టన్నులు సాధించడం జరిగింది అనగా 126 శాతం సాధించడం జరిగింది.జూన్ నెలలో మణుగూరు ఏరియా 11 లక్షల 44 వేల 812 టన్నులను రవాణా చేయటం జరిగింది. అలాగే 01 ఏప్రిల్, 2026 నుండి 30 జూన్, 2026 వరకు ప్రోగ్రెస్సివ్ గా 33 లక్షల 3 వేల 797 టన్నులు రవాణా చేయడం జరిగింది.జూన్ నెలలో ఓవర్ బర్డెన్ మన డిపార్ట్ మెంటల్ గా 11 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 80 శాతం తో 8 లక్షల 84 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగింది. అలాగే 01 ఏప్రిల్, 2026 నుండి 30 జూన్, 2026 వరకు 35 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 27 లక్షల 58 వేల క్యూబిక్ మీటర్ల తీయడం అనగా 79 శాతం పదవి విరమణ/మెడికల్ డెత్ అయిన ఉద్యోగులకు ఈ క్రింది విధంగా చెల్లింపులు చేశారు. సమావేశ అనంతరం టి యు డబ్ల్యూ జే ఐ జే యు పినపాక నియోజకవర్గం ప్రింట్ మీడియా అధ్యక్షులు గా ఎన్నికైన పిండిగ వెంకట్, ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి గా ఎన్ని కైన జిన్నే ఉపేందర్ లకు మణుగూరు ఏరియా జీ ఎం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్సు టీఎం డి వెంకట రామారావు , ఏటిఎం (ఐఈడి) సిహెచ్.రాంబాబు , ఏజిఎం(ఏర్పనల్) ఎస్. రమేశ్ , "ఏటా ఎంపిసి నిజిఓన్ జీడిన ఈ ఈ. ఈ. శ్రీనివాస్, శ్రీనివాస్,




డిటిఎం(సర్వే) ఎల్. దయాకర్ , డివై, సీఎంఓ డా. జ్యోతిర్మాయి, సీనియర్ ఎస్టేట్స్ అధికారిని కె. స్వప్న , పర్యావరణ అధికారి జె. శ్రీనివాస్ రావు, ఏరియా సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్ , డివై. పిఎం బి. శ్యామ్ ప్రసాద్, ఏక్సిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 30 (జనం సాక్షి) :** మహిళలు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, స్వయం ఉపాధి పొందాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. మైనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని న్యాక్ భవనంలో కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మైనార్టీ శాఖ ప్రత్యేకంగా శిక్షణ అందించి కుట్టు మిషన్లు అందించడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా కుట్టు మిషన్ లకు సంబంధించి పీఎం విశ్వకర్మ పథకం అందుబాటులోకి తీసుకువచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం మైనార్టీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 500 కుట్టు మిషన్ల ను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నూడా చైర్మన్ కేశ వేణు, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మఠం పవన్, అనిత సురేష్, ప్రీతి ప్రవీణ్, పవన్ ముందడ, మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




దిల్లీ ఈవీ పాలసీ..

## ఓలా, ఏథర్ షేర్లు పైపైకి

**న్యూఢిల్లీ:**దేశ రాజధాని దిల్లీని కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తీసుకొచ్చిన ఈవీ పాలసీ ఓలా ఎలక్ట్రిక్, ఏథర్ ఎనర్జీలో మదుపర్లకు కాసుల వర్షం కురిపించింది. 2028 నుంచి విద్యుత్ ద్విచక్ర వాహనాలకే రిజిస్ట్రేషన్ చేసేలా రూపొందించిన ఈవీ పాలసీకి దిల్లీ ప్రభుత్వం ఆమోదం తెలపడంతో రెండు కంపెనీల షేర్లు దూసుకెళ్లాయి. ఓ దశలో 11 శాతం వరకు మేర రాణించాయి.జులై 1వ తేదీ నుంచి రూ.30 లక్షల్లోపు విద్యుత్ వాహనాలపై జీవితకాల పన్నును, రిజిస్ట్రేషన్ ఛార్జీలను దిల్లీ ప్రభుత్వం ఎత్తివేయనుంది. అలాగే, పాలసీ అమల్లోకి వచ్చిన తొలి ఏడాదిలో విద్యుత్తు ద్విచక్ర వాహనం కొనుగోలు చేసేవారికి రూ.30 వేలు, రెండో ఏడాదిలో రూ.20 వేలు, మూడో ఏడాది రూ.10 వేలు చొప్పున ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. ఈ పాలసీ విద్యుత్ వాహన కంపెనీలకు లాభం చేకూర్చేలా ఉండడంతో ఆయా కంపెనీల షేర్లు రాణించాయి.ఏథర్ ఎనర్జీ ఎనర్జీ షేర్లు ఎన్ఎస్ఈలో 5 శాతం మేర రాణించి రూ.1142.50 వద్ద 52 వారాల గరిష్ఠానికి చేరుకున్నాయి. గడిచిన వారంలో 13 శాతం పెరిగిన ఈ షేరు విలువ.. నెలలో 18 శాతం, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 54 శాతం మేర పెరిగింది. మార్కెట్ ముగిసే సమయానికి 2.42 శాతం లాభంతో రూ.1110 వద్ద స్థిరపడింది. మరోవైపు ఓలా ఎలక్ట్రిక్ షేర్లు కూడా 11 శాతం మేర రాణించి రూ.44.95 వద్ద గరిష్ఠాన్ని తాకాయి. మార్కెట్ ముగిసే సమయానికి 8.37 శాతం లాభంతో రూ.43.76 వద్ద స్థిరపడింది. అదే సమయంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ మాతృ సంస్థ అయిన ఐషర్ మోటార్ షేర్లు నష్టాలు చవిచూశాయి. ఇంట్రాడేలో 6.61 శాతం నష్టంతో రూ.6,947.95 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఆఖర్లో కాస్త కోలుకుని 4.38 శాతం నష్టంతో రూ.7101 వద్ద స్థిరపడింది.

## సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు ఖరారు

దిల్లీ: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై ఇచ్చే వడ్డీరేట్లను కేంద్రప్రభుత్వం ఖరారు చేసింది. వరుసగా తొమ్మిదో త్రైమాసికం (2026-27 జులై-సెప్టెంబర్)లోనూ ఎలాంటి మార్పులూ చేయలేదు. 2026 మార్చి 1 నుంచి జూన్ 30 కాలానికి నోటిఫై చేసిన వడ్డీ రేట్లనే, 2026 జులై 1నుంచి సెప్టెంబర్ 30 వరకు అమలు చేయనున్నట్లు ఆర్థిక శాఖ మంగళవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రతి త్రైమాసికానికి పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను కేంద్రం నోటిఫై చేస్తుంది. చివరిసారిగా 2023-24 నాలుగో త్రైమాసికంలో కొన్ని పథకాల వడ్డీ రేట్లను సవరించింది.

వడ్డీ రేట్లు ఇలా..
సుకన్య సమృద్ధి యోజన- 8.2%
మూడేళ్ల టర్మ్ డిపాజిట్ - 7.1%
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్- 7.1%
కిసాన్ వికాస్ పత్ర - 7.5%
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ - 7.7%
మంత్లీ సేవింగ్స్ పథకం- 7.4%



# రెండో రోజూ నష్టాల్లో..

### పడిపోయిన స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ వంటి ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. మరోవైపు దోహా వేదికగా ఇరాన్- అమెరికా మధ్య శాంతి చర్చలు జరగనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం రాణించాయి. సెన్సెక్స్ 249 పాయింట్లు కోల్పోగా.. నిఫ్టీ 80 పాయింట్లు నష్టపోయింది.సెన్సెక్స్ ఉదయం 77,005.51 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,728.37) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,037.36 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. 76,329.39 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 249.70 పాయింట్ల నష్టంతో 76,478.67 వద్ద ముగిసింది. నిఫ్టీ 80.50 కోల్పోయి 23,865.75 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో మారుతీ, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నెల్, అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్ లాభపడ్డాయి. ఐటీసీ, హిందూస్థాన్‌లీవర్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 94.66గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.21 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 4,025.73 వద్ద కొనసాగుతోంది.



## గ్రీస్‌లోనూ అందుబాటులోకి మన యూపీఐ సేవలు

దిల్లీ: దేశీయ డిజిటల్ చెల్లింపుల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన యూపీఐ ఇతర దేశాలకూ విస్తరిస్తోంది. భారత యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సేవలు తాజాగా గ్రీస్‌లోనూ అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రస్తుతం గ్రీస్‌లోని ఏథెన్స్‌లో పర్యటిస్తున్న వేళ ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి.యూరోబ్యాంక్- ఎన్ఐపీఎల్ భాగస్వామ్యంతో ఈ యూపీఐ సేవలు ప్రారంభించారు. దీని ద్వారా అర్హత కలిగిన వినియోగదారులు తక్కువ ఖర్చుతో వేగంగా, సురక్షితంగా డబ్బు బదిలీ చేసుకోవచ్చని పీయూష్ గోయల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లోని నైస్ నగరంలోనూ, అంతకుముందు పారిస్‌లోని ఈఫిల్ టవర్ వద్ద యూపీఐ సేవలు ప్రారంభించారు. ప్రస్తుతం గ్రీస్‌తో కలిపి సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, మారిషస్, నేపాల్, భూటన్, ఖతార్, శ్రీలంక, కంబోడియా సహా మొత్తం 10 దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. భారత పర్యాటకులు విదేశాల్లో సులభంగా డిజిటల్ చెల్లింపులు చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది.




## వోల్టాస్ ఛైర్మన్ పదవినుంచి వైదొలగనున్న నోయల్ టాటా

టాటా గ్రూప్‌నకు చెందిన ప్రముఖ ఎయిర్ కండిషనర్ల తయారీ సంస్థ వోల్టాస్ ఛైర్మన్ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు టాటా సన్స్ ఛైర్మన్ నోయల్ టాటా ప్రకటించారు. కంపెనీ 72వ వార్షిక సాధారణ సమావేశంలో తన నిర్ణయాన్ని వెల్లడించారు. ఇటీవల టాటాకు చెందిన రిటైల్ సంస్థ ట్రెంట్ ఛైర్మన్ పదవి నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించిన ఆయన.. వారం తిరగకముందే వోల్టాస్ బాధ్యతల నుంచీ వైదొలుగుతున్నట్లు ప్రకటించారు."టాటా గ్రూప్ అంతర్గత పదోన్నతులు, అనుభవజ్ఞులైన ఉద్యోగుల నుంచి కొత్త తరం నాయకులను ఎంపిక చేసింది. వారి నూతన ఆలోచనలతో కంపెనీ మరింత పురోగతి సాధిస్తుంది. నా పదవీకాలంలో ఎయిర్ కండిషనర్ల మార్కెట్‌లో వోల్టాస్ అతిపెద్ద కంపెనీగా ఎదిగింది. కేవలం 81 రోజుల్లోనే 10 లక్షల యూనిట్లను విక్రయించి గొప్ప మైలురాయిని అందుకుంది. ఈ విషయంలో సంతృప్తిగా ఉంది. ఇన్నేళ్లుగా మద్దతుగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు" అని నోయల్ అన్నారు. 2003లో జనవరి 27న వోల్టాస్ బోర్డులో నోయల్ టాటా చేరారు. 2017 సెప్టెంబర్ 1న నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. కంపెనీల నిబంధనలు, 2013 ప్రకారం 70 ఏళ్లు దాటిన వారు నిర్ణీత అనుమతులు లేకుండా మేనేజింగ్ డైరెక్టర్ లేదా హోల్ టైమ్ డైరెక్టర్‌గా కొనసాగకూడదు. ఈ ఏడాది నవంబరులో నోయల్ టాటాకు 70 ఏళ్లు నిండుతుండడంతో ఆయన నుంచి ఈ నిర్ణయం వెలువడింది.




## స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లోకి ఫైర్-బోల్ట్ ఎంట్రీ

స్మార్ట్‌వాచ్‌లు, వేరియబుల్స్‌ను తయారు చేసే భారత కంపెనీ ఫైర్-బోల్ట్ స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. రూ.10 వేల నుంచి రూ.15వేల ధర లోపే ఫోన్లను విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం కొన్ని నెలలకు అవసరమైన సరఫరా చైన్ కోసం 50 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.475 కోట్లు) పైగా పెట్టుబడులు పెట్టనుందని కంపెనీ వ్యవస్థాపకుడు అర్నవ్ కిశోర్ వెల్లడించారు."ఏఐ కారణంగా మెమొరీ చిప్‌ల ధరలు పెరిగాయి. ప్రస్తుతం బడ్జెట్ సెగ్మెంట్‌లో స్మార్ట్ ఫోన్లు దొరకడం కష్టంగా మారింది. ఈ లోటును పూ డ్చేందుకు మేం వస్తున్నాం. కస్టమర్లకు అందుబాటులో ఉండేలా రూ.10 వేల నుంచి రూ.15 వేలలోపే బోల్ట్ ఓఎస్‌తో ఫోన్లను తీసుకొస్తాం. ఆగస్టు కంటే ముందే 4జీ ఫోన్లను, ఆ తర్వాత 5జీ ఫోన్లను లాంచ్ చేస్తాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికగా విక్రయిస్తాం" అని అర్నవ్ తెలిపారు.ప్రీమియం సెగ్మెంట్ వైపు ఎక్కువ లాభదాయకత ఉండటంతో చైనా కంపెనీలు అటువైపు మళ్లుతున్నాయని అర్నవ్ అన్నారు. అందుకే కస్టమర్లకు అందుబాటు ధరల్లో భారతీయ బ్రాండ్‌ను పరిచయం చేయాలనే ఆలోచన వచ్చిందన్నారు. ఇందుకు ఆగస్టు వేదిక కానుందని తెలిపారు. ఈ మేరకు తొలుత పది లక్షల ఫోన్ల ను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.



### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40
వరంగల్ ₹ 5.42

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్
₹ 1,45,800 (22 క్యారెట్లు)
₹ 1,59,060 (24 క్యారెట్లు)

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్
₹ 2,95,000

# పసిడి నేలచూపులు

### భారీగా దిగొచ్చిన బంగారం ధరలు

న్యూఢిల్లీ:దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దిగొస్తున్నాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, ఫెడ్ వడ్డీ రేటు అంచనాల వంటి కారణాలు ఈ ధరలపై ప్రభావం చూపిస్తున్నాయి. దీనికితోడు దేశీయంగానూ గిరాకీ నెమ్మదించడంతో ఈ లోహాల ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. మంగళవారం ఉదయం హైదరాబాద్ విపణిలో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల పుత్తడి ధర రూ.1,43,970కు పడిపోయింది. కేజీ వెండి ధర రూ.2.25లక్షలు పలికింది. అంతర్జాతీయంగానూ వీటి ధరలు దిగొచ్చాయి. స్పాట్ గోల్డ్ ఔన్సు స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 3973.26 డాలర్లుగా ఉంది. క్రితం రోజు దీని ధర 4,100 డాలర్ల వరకు ఉండగా.. ఒక్క రోజులోనే భారీగా దిగొచ్చింది. ఇక, ఔన్సు వెండి ధర 57.42 డాలర్లకు పడిపోయింది. కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాముల ధర రూ.1,40లక్షలు, సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.2.21లక్షలుగా ట్రేడ్ అవుతు న్నాయి.అంతర్జాతీయంగా ఇటీవల కాలంలో పసిడి ధరలు ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో పాటు ఈ ఏడాది చివరి నాటికి వడ్డీ రేట్లను పెంచే అవకాశం ఉందని ఫెడ్ సంకేతాలిచ్చింది. ఈ క్రమంలోనే బంగారం, వెండిలో పెట్టుబడులను మదుపర్లు వెనక్కి తీసుకుంటున్నట్లు బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికాలో వడ్డీ రేట్లు పెరిగితే సాధారణంగా పసిడిపై పెట్టుబడులు క్షీణిస్తాయి.



## అసంఘటిత రంగానికి కొత్త సూచీ

### 9.17 కోట్ల సంస్థల్లో 15.17 కోట్ల మందికి ఉపాధి

దేశ ఆర్థిక వ్యవస్థలో అసంఘటిత రంగం ఎంతో కీలకమైనా, ఇందుకు సంబంధించిన కచ్చితమైన సమాచారం అందుబాటులో ఉండటం లేదు. అత్యధికులకు ఉపాధి కల్పించే ఈ రంగ గణాంకాలు సరిగా అందుబాటులో లేక, విధానపర నిర్ణయాల్లో ప్రభావం చూపడం లేదు. అందుకే అసంఘటిత రంగ ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త సూచీ (ఇండెక్స్) తీసుకురాబోతోంది. ఇది అందుబాటులోకి వస్తే, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల నిర్ణయాలు, జీడీపీ గణాంకాలు, ద్రవ్యోల్బణ నియంత్రణ, ప్రభుత్వ విధానాలు, కార్పొరేట్ సంస్థల పెట్టుబడులకూ ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. ద్రవ్యోల్బణం, పారిశ్రామిక ఉత్పత్తి, పన్ను వసూళ్లు, కార్పొరేట్ ఆదాయాల వంటి వాటిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వానికి కచ్చితమైన వ్యవస్థలు ఉన్నాయి. కానీ, భారీ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న అసంఘటిత రంగం పనితీరును త్వరగా అంచనా వేసేం దుకు ఎలాంటి కొలమానం లేదు. ఈ లోపాన్ని భర్తీ చేసేందుకు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ.. కంపెనీల చట్టం కింద నమోదు కాని సంస్థల కోసం ఒక కొత్త సూచీ తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. వాస్తవానికి దీని అధికారిక లక్ష్యం 2031 అయినా, అంతకంటే ముందే దీన్ని తీసుకురావాలని మంత్రిత్వ శాఖ భావిస్తోంది. చాలామంది అసంఘటిత రంగం అనగానే వీధి వ్యాపారులు, చిన్న కుటుంబ వ్యాపారాలు మాత్రమే అనుకుంటారు. కానీ, వ్యవసాయేతర, కంపెనీల చట్టం కింద నమోదు కాని వ్యాపారాలన్నీ ఈ కోవలోకే వస్తాయని మంత్రిత్వ శాఖ వివరిస్తోంది. కిరాణా దుకాణాలు, రిటెయిలర్లు, రెస్టారెంట్లు, రవాణాదారులు, మరమ్మతు దుకాణాలు, చిన్న తయారీ కేంద్రాలు, బ్యూటీ సెలూన్లు ఇవన్నీ ఇందులో భాగమే. ఇవి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) లేదా ఉద్యమ్ కింద నమోదైనా, వీటిని కంపెనీలుగా పరిగణించడం లేదు.దేశంలో శ్రామిక శక్తిలో 80% మందికి అసంఘటిత రంగమే ఉపాధి కల్పిస్తోంది. ఉత్పాదకతలో దాదాపు 50% వాటా దీనిదే. మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన 2024-25 వార్షిక సర్వే ప్రకారం, దేశంలో 2023-24లో 7.34 కోట్లుగా ఉన్న అసంఘటిత సంస్థల సంఖ్య, 2025 నాటికి 7.92 కోట్లకు పెరిగింది. ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 12.06 కోట్ల నుంచి 12.81 కోట్లకు చేరింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసిక అంచనాల ప్రకారం దేశ వ్యాప్తంగా 9.17 కోట్ల అసం ఘటిత సంస్థలు 15.17 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థలో మరే ఇతర రంగం ఇంత భారీ స్థాయిలో ఉపాధి కల్పించడం లేదు.మనదేశంలో ఐఐపీ, ద్రవ్యోల్బణ సూచీ (సీపీఐ), జీఎస్టీ, పీఎంఐ వంటి ఎన్నో సూచీలు ఉన్నాయి. ఇవన్నీ వ్యవస్థీకృత రంగాన్నే ప్రతిబిం బిస్తున్నాయి. కోట్ల సంఖ్య లోని చిన్న దుకాణదారులు, రవాణా దారులు నష్టాలను ఎదుర్కొ న్నా, వార్షిక సర్వేలు వచ్చే వరకు ఈ వివరాలు వెల్లడికావడం లేదు.

## 570 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కోల్పోయిన మైక్రోసాఫ్ట్

**వాషింగ్టన్:**ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌కు జూన్ నెల పీడకల మిగిల్చింది. 25 ఏళ్లలో అత్యంత దారుణమైన నెలగా మారింది. సంస్థ షేర్ విలువ 17 శాతం పడిపోవడంతో.. ఈ ఒక్క నెలలోనే 570 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.53 లక్షల కోట్లకు)పైగా మార్కెట్ విలువను కోల్పోయింది. 2000 డిసెంబర్ తర్వాత ఈ స్థాయిలో పడటం మళ్లీ ఇప్పుడేనని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.ప్రస్తుతం ప్రపంచమంతా ఏఐ నామస్మరణే వినిపిస్తోంది. ఆ సాంకేతికతను వేగంగా అందిపుచ్చుకునే వాటిల్లో మైక్రోసాఫ్ట్ పేరు ముందు వరుసలోనే ఉంది. ఏఐపై భారీగా ఖర్చు చేస్తోంది. డేటా సెంటర్లు, ఏఐ చిప్, ఏఐ ఆధారిత మౌలిక సదుపాయాలపై బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టింది. అయితే ఆ స్థాయిలో లాభాలను ఆర్జిస్తుందా..? అని మదుపర్లలో భయాలు నెలకొన్నాయి. మరోవైపు, త్రైమాసిక ఫలితాల్లో అజూర్ క్లౌడ్ బిజినెస్ గణాంకాలు ఆకట్టుకోలేదు. పెట్టుబడి అంచనాలు మదుపర్లను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారు తమ వాటాలను విక్రయిస్తున్నారు.




## అరుణాచల్‌లో చైనా చొరబాట్లు .. అవాస్తవం

సరిహద్దు వెంట చొరబాట్లను క్రమంగా విస్తరిస్తున్నారని పేర్కొంది. వేట, పశువుల మేత, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం స్థానికులు ఉపయోగించే ప్రదేశాల్లో రోడ్లు, వంతెనలు, సైనిక శిబిరాలను నిర్మించారని ఆరోపించింది. ఆ ప్రాంతాల పేర్లను ప్రస్తావించింది. భారత సరిహద్దు ప్రాంతాల్లో చైనా కార్యకలాపాలు మరింత విస్తరించకుండా నిరోధించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ వినతి పత్రాన్నే మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆర్మీ స్పందన వచ్చింది.ఇటీవల బీజింగ్‌లో భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలకు సంబంధించిన సమావేశం జరిగింది. రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే మీడియా కథనాలు రావడం గమనార్హం.

## రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో విధ్వంసం చేసిన బీఆర్ఎస్

వచ్చిన తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లకు పైగా జమ చేసినట్లు వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని అన్నారు. రైతు సమస్యలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. 'కేసీఆర్ ఒక్క రైతుబంధు ఇచ్చి.. అన్నీ బంద్ చేశారు' అంటూ మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు అందించే పలు వ్యవసాయ పథకాలను కూడా అప్పటి ప్రభుత్వం అమలు చేయకుండా నిలిపివేసిందని ఆరోపించారు. తెలంగాణ ప్రస్తుతం ధాన్యం ఉత్పత్తి, ధాన్యం సేకరణలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ఆయిల్‌పామ్ సాగులో కూడా తెలంగాణను దేశంలో నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు ఎరువుల పంపిణీ, వ్యవసాయ సేవలను మరింత పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ మంచి ఫలితాలు ఇస్తోందని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే తరహా యాప్‌ను తీసుకొస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



# ఇక నంబర్ కనిపించదు..

### యూజర్ నేమ్ రిజర్వ్ చేసుకోండి: వాట్సప్

**వాషింగ్టన్:**వాట్సప్ యూజర్ల కోసం టెక్ సంస్థ మెటా మరో కొత్త ఫీచర్‌ను తీసుకువచ్చింది. వినియోగదారుల ప్రైవసీని కాపాడేందుకు కొత్తగా యూజర్‌నేమ్ ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఫోన్ నంబర్‌ను ఎవరికీ షేర్ చేయకుండానే ప్రత్యామ్నాయమార్గంగా యూజర్‌నేమ్‌తో చాట్ చేసేందుకు వీలుకలగనుంది. ఈ ఏడాది చివర్లో విస్తృతస్థాయిలో ఈ ఫీచర్ అందుబాటులోకి రానుందని మెటా ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నేపథ్యంలో యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసుకొనే ఆప్షన్‌ను ప్రారంభించింది. ఆర్థిక, వ్యక్తిగత అంశాల్లో ఫోన్ నంబర్ అత్యంత కీలకం. దానిని కొత్తవారితో షేర్ చేసుకోవాల్సి వచ్చినప్పుడు కొంత తటపటాయిస్తుంటాం. ఈ ఇబ్బందిని తొలగించి, యూజర్ ప్రైవసీని కాపాడేందుకు వాట్సప్ (చిష్ట్రజీబిబంజూజూ) ఈ ఫీచర్‌ను తీసుకువచ్చింది. దీంతో నంబర్ షేర్ చేయకుండానే యూజర్‌నేమ్‌తో ఇతరులతో కాంటాక్ట్ అవ్వొచ్చు. ఒక వ్యక్తిని తొలిసారి కాంటాక్ట్ చేయాలంటే యూజర్ నేమ్ తెలిసి ఉండాల్సిందేనని వాట్సప్ వైస్ ప్రెసిడెంట్ (ప్రొడక్ట్) అలిస్ న్యూటన్ వెల్లడించారు. ఈ కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చినా.. ప్రైవసీ కోసం ఇప్పటికే ఉన్న బ్లాక్, సైలెన్సింగ్ అన్‌నోన్ కాలర్స్ వంటి నియంత్రణలు కొనసాగుతాయని చెప్పారు.

**వాట్సప్ వెబ్ ద్వారా మాల్‌వేర్ దాడులు**

ఇక రిజర్వ్ చేసుకోవాలనుకున్న యూజర్ నేమ్ మూడు నుంచి 35 అక్షరాల పొడవు ఉండొచ్చు. ఇందులో జీ-ఞ, 0-9, డాట్, అండర్ స్కోర్ మాత్రమే వాడాల్సి ఉంటుంది. లిలిలి, చివర్లో .ఇనీఎ, .నివబి వంటివి ఉపయోగించకూడదు. అదనంగా 4 అంకెలతో యూజర్ నేమ్ కీ కూడా సెట్ చేసుకోవచ్చు. దీనివల్ల ఎవరైనా మిమ్మల్ని మొదటిసారి కాంటాక్ట్ చేయాలంటే వారికి మీ యూజర్ నేమ్‌తో పాటు ఆ కీ కూడా షేర్ చేయాల్సి ఉంటుంది. ఇన్‌స్టా, ఫేస్‌బుక్ ఖాతాలున్న క్రియేటర్లు, వ్యాపార సంస్థలు వంటివి ఇప్పుడున్నవాటికి మ్యాచ్ అయ్యేలా యూజర్ నేమ్ పొందేందుకు సంస్థ వీలు కల్పిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వినియోగదారులున్న మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సప్ (చిష్ట్రజీబిబంజూజూ). ఐరోపా, ఆసియా, ఇతర ప్రాంతాల్లో దీని వినియోగం పెరుగుతూ వస్తోంది. ఇలాంటి సమయంలో కట్టుదిట్ట గోప్యతకు డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే యూజర్ నేమ్ ఫీచర్ గురించి ప్రకటన చేసింది.ప్రస్తుతానికి ఈ ఫీచర్ పరిమిత సంఖ్యలో వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. వాట్సప్ ప్రొఫైల్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి అక్కడ యూజర్ నేమ్ సెట్ చేసుకునే ఆప్షన్ ఉందో లేదో చూడొచ్చు.



## భారత నూతన ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్ట్రన్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ఎ÷-లానింగ్, కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

## బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ సబబే..

కోర్టుల తీర్పులతో ఏకీభవించిన సుప్రీంకోర్టు మెజారిటీ ధర్మాసనం.. ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమని తేల్చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ నేతృత్వంలోని బెంచ్ ట్రంప్ ఉత్తర్వులను కొట్టేసింది.

# కాంగ్రెస్ మహిళా నేత శోభారాణి అరెస్ట్

- కారు డ్రైవర్‌ను కిడ్నాప్ చేసి చిత్రవధ
- నలుగురు నిందితులపై కేసు, ముగ్గురు పరారీ
- వ్యక్తిగత కక్షతో హత్యాయత్నం
- పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో కేసు




**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 30 (జనం సాక్షి):** అధికారంలో ఉన్నామన్న హుంకారంతో ఓ కాంగ్రెస్ మహిళా నేత తన కారు డ్రైవర్‌పై వికృతంగా దాడి చేసి చిత్రవధ చేసిన షాకింగ్ సంఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలంలో చోటుచేసుకుంది. ఈ కేసులో కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు శోభారాణిని పోలీసులు మంగళవారం తెల్లవారుజామున అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.
పోలీసులు నమోదు చేసిన కేసు ప్రకారం, శోభారాణి తన కారు డ్రైవర్ రాంప్రసాద్‌ను ఈ నెల 24వ తేదీన కిడ్నాప్ చేసి బషీరాబాద్ అటవీ ప్రాంతంలో తన అనుచరులతో కలిసి వికృతంగా దాడి చేసి చిత్రవధ చేసింది. డ్రైవర్‌ను హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తర్వాత పోలీసుల వత్తిడికి లోనై డ్రైవర్‌ను తాండూరు సీఐ కార్యాలయం దగ్గర వదిలేసి పారిపోయారు. ఈ కేసులో శోభారాణి, ఆమె కొడుకు వీరేష్, అనుచరులు మహేష్, రవి అనే నలుగురిపై పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఇందులో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. డ్రైవర్ రాంప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, కుటుంబ వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకున్నందుకు శోభారాణి కక్ష పెంచుకుంది. ఆమె కుటుంబంలోని మహిళలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి వికారాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అబార్షన్ చేయించిన విషయాన్ని తాను వ్యతిరేకించడంతో వ్యక్తిగత వైరం పెరిగి దాడికి పాల్పడినట్లు రాంప్రసాద్ పోలీసులకు తెలిపారు. పెద్దేముల్ ఎస్ఐ, సీఐలు సమన్వయంతో డ్రైవర్‌ను రక్షించడానికి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం డ్రైవర్ సురక్షితంగా ఉన్నాడు. కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. లింగ నిర్ధారణ, అబార్షన్ ఆరోపణలు నిజమైతే మరిన్ని సెక్షన్లు జోడించే అవకాశం ఉంది. ఈ సంఘటనతో కాంగ్రెస్ పార్టీ ఇరుక్కుని పడింది. పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

# శేరిలింగంపల్లిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

## ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సీఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి

- కూకట్‌పల్లి వై జంక్షన్ ఫ్లైఓవర్‌ను త్వరగా పూర్తి చేయాలి
- రోడ్డు విస్తరణలో బాధితులకు సముచిత న్యాయం
- లింక్ రోడ్లు, చెరువుల సుందరీకరణపై దృష్టి




**శేరిలింగంపల్లి, జూన్ 30 (జనం సాక్షి):** శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న ట్రాఫిక్ రద్దీ, రోడ్డు విస్తరణలు, ఫ్లైఓవర్ నిర్మాణం వంటి వివిధ అభివృద్ధి పనులపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. న్యాక్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ప్రజాబద్ధల కమిటీ చైర్మన్ గాంధీ వివిధ సమస్యలపై విజ్ఞప్తి చేశారు.
శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ రద్దీతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిని తగ్గించడానికి ప్రత్యామ్నాయ రహదారులు, లింక్ రోడ్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న హెచ్‌సిటి ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని, స్థలాలు కోల్పోతున్న వారందరికీ టిడిఆర్ వేగంగా అందించి సాంత్వన చేకూర్చాలని సూచించారు. మసీదు బండ రోడ్డు, అంజయ్య నగర్ రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని, రోడ్డు విస్తరణలో భవనాలు, స్థలాలు కోల్పోతున్నవారికి సముచిత న్యాయం చేయాలని గాంధీ విజ్ఞప్తి చేశారు. గంగారం చెరువు నుంచి ఎన్‌హెచ్–65 అపర్ణ హిల్ పార్క్ వరకు లింక్ రోడ్డు టెండర్ పూర్తయినందున పనులు వేగంగా చేపట్టాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులు, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, వర్షాకాలం ముందు అన్ని శాఖల అధికారులు సన్నద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సిఎంసీ కమిషనర్ సృజనను కోరారు. కమిషనర్ సృజన అంశాలపై సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ సీసీపీ వెంకన్న, సిఎంసీ సిఇ శ్రీలక్ష్మి, నాయకులు మారబోయిన రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



- నిబంధనలు తిరస్కరించినా కార్పొరేట్ స్కూళ్లకు గ్రీన్ సిగ్నల్
- 'ఆర్కిడ్స్' స్కూల్ ప్రమాదకర అనుమతుల వెనుక అర్బన్ ఎంఈఓ చక్రం
- నిష్పాక్షిక విచారణకు పెరుగుతున్న డిమాండ్

# ఆర్జేడీ, ఎంఈఓల అవినీతి బంధం

## రూ. లక్షల్లో చేతులు మారిన ముడుపులు?



**మహబూబ్‌నగర్, బ్యూరో జూన్ 30 (జనంసాక్షి):**
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అనుమతుల వ్యవహారం కేవలం నిబంధనల ఉల్లంఘనగానే కాకుండా, పెద్దఎత్తున సాగుతున్న ఒక క్రమబద్ధమైన కుంభకోణంగా రూపాంతరం చెందింది. విద్యా చట్టాలను, ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి, కేవలం నకిలీ పత్రాల ఆధారంగా జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో కార్పొరేట్ పాఠశాలలకు అనుమతులు కట్టబెట్టడం విద్యాశాఖలోనే తీవ్ర కలకలం రేపుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి, మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిని శాసిస్తున్న అక్రమ ఎంఈఓకు మధ్య బలమైన 'ఆర్థిక' సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఇప్పుడు మహబూబ్ నగర్ జిల్లావ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.

**రూరల్ పోస్టింగ్.. అర్బన్ పై కన్ను వేనక ఆర్జేడి హస్తం!**

ఈ వివాదానికి ప్రధాన కేంద్ర బిందువుగా మారిన సదరు అధికారి వాస్తవానికి రూరల్ పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఆ బాధ్యతలను ప్రక్కకు పేట్టి అర్బన్ ఎంఈఓగా చార్జ్ తీసుకున్న పుటి నుండి జిల్లా కేంద్రంలోని కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలతో నేరుగా సంబంధాలు నడుపుతున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి, లోపాలను ఎత్తిచూపాల్సిన ఈ అధికారే.. కాసుల కక్కుర్తితో కార్పొరేట్ యాజమాన్యాలకు లీగల్ అడ్వైజర్‌గా మారుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భవన ఫిట్‌నెస్, అగ్నిమాపక నిబంధనలు ఆటస్థలం వంటి కనీస వసతులు లేకపోయినా.. అవన్నీ ఉన్నట్లు నివేదికలు సృష్టించడంలో ఈ అధికారి సిద్ధహస్తుడనే ఆరోపణలు మహబూబ్ నగర్ లో ఉన్నాయి.

**ఆర్ అండ్ బీ ఈఈ రిజెక్ట్ చేసినా..**

ఏదైనా ఒక పాఠశాలకు అనుమతి రావాలంటే రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇచ్చే) స్ట్రక్చరల్ సౌండ్నెస్ సర్టిఫికెట్ అత్యంత కీలకం. అయితే, జిల్లా కేంద్రంలో వెలిసిన పలు కార్పొరేట్ స్కూళ్లకు భవన భద్రత లేదనే కారణంతో ఆర్ అండ్ బీ ఈఈ సదరు ఫైళ్లను స్పష్టంగా తిరస్కరించారు. ఇక్కడే అర్బన్ ఎంఈఓ తన 'ప్రతిభ'ను ప్రదర్శించినట్లు తెలుస్తోంది. తిరస్కరణకు గురైన ఫైళ్లను వెలికితీసి, నకిలీ పత్రాలు, నకిలీ నో–అబ్జెక్షన్ సర్టిఫికేట్లు సిద్ధం చేయించి, హైదరాబాద్‌లోని ఆర్జేడీ కార్యాలయానికి చేర్చడంలో ఈయనే స్వయంగా లైజనింగ్ చేసినట్లు విద్యాశాఖ వర్గాల్లో గట్టిగా ప్రచారం సాగుతోంది.
సాధారణంగా కిందిస్థాయి నుండి వచ్చే నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన ఆర్జేడీ కార్యాలయం.. అర్బన్ ఎంఈఓ నేరుగా నడిపిన 'సీక్రెట్ డీల్స్', పెద్దఎత్తున చేతులు మారిన ముడుపుల ప్రభావంతో, ఆర్ అండ్ బీ రిజెక్షన్ రిపోర్టును బేఖాతర్ చేస్తూ గుట్టుచప్పుడు కాకుండా ఓపెనింగ్ పర్మిషన్లు జారీ చేసింది. అంతటితో ఆగకుండా, ఈ అక్రమం బయటపడకుండా ఉండేందుకు ఆర్జేడీ కార్యాలయ అధికారుల అండదండలతో సదరు అనుమతి పత్రాలలోని కీలక అంశాలను, తేదీలను కూడా మార్పిడి చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

> **ఉన్నతాధికారుల విచారణ ఎప్పుడు?**
> ఈ దొడ్డిదారి అనుమతుల వ్యవహారంపై జిల్లాలోని ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఒకవైపు నిబంధనల ప్రకారం నడిచే చిన్న పాఠశాలలను తనిఖీల పేరుతో వేధిస్తూ, మరోవైపు కోట్ల రూపాయల టర్నోవర్ చేసే కార్పొరేట్ సంస్థలకు నకిలీ పత్రాలతో రెడ్ కార్పెట్ పరచడం వెనుక ఉన్న 'ఆర్థిక' తిమింగలాల గుట్టు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ కమిషనర్ వెంటనే స్పందించి, ఆర్జేడీ కార్యాలయంలో గత కొద్దికాలంగా జరిగిన అనుమతుల ఫైళ్లను, అలాగే మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈఓ పాత్రపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

> **చిన్నారుల ప్రాణాలతో చెలగాటం**
> ఈ అక్రమ ధందాకు సజీవ సాక్ష్యంగా మహబూబ్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రముఖ కార్పొరేట్ సంస్థ 'ఆర్కిడ్స్' పాఠశాల వ్యవహారం నిలుస్తోంది. సదరు యాజమాన్యం ఒక ఫ్లోర్‌లో మాత్రమే పాఠశాల నడుపు తామని అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంది. కానీ, వాస్తవ పరిస్థితి చూస్తే అక్కడ ఏకంగా నాలుగు అంతస్తు ల వరకు భారీఎత్తున నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఒకవైపు నిర్మాణ పనులు జరుగుతుండటం, పై అంతస్తుల నుండి ఇనుప చువ్వలు, సిమెంట్ ఇటుకలు పడే ప్రమాదం ఉండటంతో విద్యార్థుల భద్రతను దృష్ట్యా ఆర్ అండ్ బీ అధికారులు ఈ ప్రతిపాదనను ముందస్తుగానే తిరస్కరించారు. కానీ, విద్యార్థుల ప్రాణాల కంటే విలాసవంతమైన ముడుపులే ముఖ్యమనుకున్న సదరు అర్బన్ ఎంఈఓ, నేరుగా ఆర్జేడీ కార్యాల య ఉన్నతాధికా రితో మాట్లాడి, పాత డేట్లతో నకిలీ పత్రాలను బ్రౌజ్ చేయించి ఓపెనింగ్ ఆర్డర్స్ పట్టుకొచ్చినట్లు సమాచారం. నాలుగు అంతస్తుల ప్రమాదకర భవ నంలో అమాయక చిన్నారులను కూర్చోబెట్టి తరగతు లు నిర్వహించేందుకు అనుమతులు ఇవ్వడం వెనుక ఆర్జేడీ, ఎంఈఓల మధ్య జరిగిన 'లక్షల' లీంకును స్పష్టం చేస్తోంది.

# సీఎస్ఐఆర్-ఐఐసీటీలో నాలుగు అధునాతన పరిశోధనా కేంద్రాల ప్రారంభం

- 200 మంది విద్యార్థుల హాస్టల్‌కు శంకుస్థాపన చేసిన జితేంద్ర సింగ్
- 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో పరిశోధనలే కీలకం
- స్వదేశీ సాంకేతికత, స్టార్టప్‌లకు ఐఐసీటీ ప్రోత్సాహం
- పరిశ్రమలు, పర్యావరణం, ఆరోగ్య రంగాలకు కొత్త సౌకర్యాల మద్దతు

**సికింద్రాబాద్, జూన్ 30 (జనంసాక్షి):** దేశంలో శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలకు మరింత ఊతమిచ్చేలా హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్–ఐఐసీటీ)లో నాలుగు అత్యాధునిక పరిశోధనా సౌకర్యాలను కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూవిజ్ఞాన శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా) డా. జితేంద్ర సింగ్ మంగళవారం ప్రారంభించారు. అలాగే 200 మంది విద్యార్థుల సామర్థ్యంతో నిర్మించనున్న ఆధునిక వసతి గృహ సముదాయానికి శంకుస్థాపన చేశారు. ప్రారంభించిన కొత్త పరిశోధనా సౌకర్యాల్లో అధునాతన ఫ్లోరోకెమికల్స్ పరిశోధనా కేంద్రం, వస్త్ర పరిశ్రమ వ్యర్థజలాల వికేంద్రీకృత శుద్ధి కేంద్రం, కంటిన్యూయస్ ప్రాసెసింగ్ టెక్నాలజీస్ ఫెసిలిటీ, సస్టైనబుల్ ఇంజినీరింగ్ కాంప్లెక్స్ ఉన్నాయి.
ఈ సందర్భంగా డా. జితేంద్ర సింగ్ మాట్లాడుతూ సీఎస్ఐఆర్–ఐఐసీటీ ఎనిమిది దశాబ్దాలుగా శాస్త్ర సాంకేతిక రంగంలో విశిష్ట సేవలందిస్తోందని కొనియాడారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో శాస్త్ర సాంకేతిక రంగం కీలక పాత్ర పోషిస్తోందని, ఆర్థికాభివృద్ధి, సాంకేతిక స్వావలంబన, సుస్థిర అభివృద్ధికి పరిశోధనా సంస్థలు బలమైన పునాది వేస్తున్నాయని పేర్కొన్నారు. దేశ అవసరాలకు అనుగుణంగా, పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పరిశోధనలపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని సూచించారు.
200 మంది పరిశోధక విద్యార్థులకు వసతి కల్పించే ఆధునిక హాస్టల్ నిర్మాణం ద్వారా దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన యువ పరిశోధకులను ఆకర్షించడంతో పాటు మెరుగైన విద్యా వాతావరణం ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. సీఎస్ఐఆర్–ఐఐసీటీ డైరెక్టర్ డా. డి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలు, వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి ఉపయోగపడే సాంకేతికతలను అభివృద్ధి చేస్తూ సంస్థ జాతీయ లక్ష్యాల సాధనలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కొత్త పరిశోధనా సౌకర్యాల ప్రారంభంతో ఐఐసీటీ పరిశోధనా సామర్థ్యం మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. అధునాతన ఫ్లోరోకెమికల్స్ పరిశోధనా కేంద్రం ద్వారా ఔషధాలు, వ్యవసాయ రసాయనాలు, రిఫ్రిజిరెంట్లు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అవసరమైన ఫ్లోరోకెమికల్స్ అభివృద్ధికి ఊతమందనుంది. వస్త్ర పరిశ్రమ వ్యర్థజలాల వికేంద్రీకృత శుద్ధి కేంద్రం ద్వారా తక్కువ ఖర్చుతో సహజ పద్ధతిలో మురుగునీటి శుద్ధి చేపట్టనున్నారు. కంటిన్యూయస్ ప్రాసెసింగ్ టెక్నాలజీస్ ఫెసిలిటీ ఔషధాలు, ప్రత్యేక రసాయనాల తయారీలో నిరంతర తయారీ విధానాలకు ఆధునిక వేదికగా నిలవనుంది. సస్టైనబుల్ ఇంజినీరింగ్ కాంప్లెక్స్ పరిశోధన దశలో అభివృద్ధి చేసిన సాంకేతికతలను పారిశ్రామిక స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన పైలట్ మౌలిక సదుపాయాలను కల్పించనుంది.
కార్యక్రమంలో సీఎస్ఐఆర్‌కు చెందిన వివిధ ప్రయోగశాలల డైరెక్టర్లు, జాతీయ శాస్త్ర సంస్థల అధిపతులు, ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యుజిడి డ్రైనేజీ వ్యవస్థపై జెడ్సి సమగ్ర సమీక్ష



**శేరిలింగంపల్లి , జూన్ 30 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ తీరుతెన్నులు, నిర్వహణ విధానంపై శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మంగళవారం సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు మరియు కన్సల్టెంట్ ఎన్స్‌పిఇ ప్రతినిధులతో కలిసి జోన్ పరిధిలోని డ్రైనేజీ ప్యాటర్న్, ఫ్లో హైడ్రాలిక్స్‌పై విస్తృతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా జోన్‌లోని ప్రధాన, అనుబంధ నాలాల ప్రస్తుత పరిస్థితి, నీటి ప్రవాహ సామర్థ్యంపై ఎన్స్‌పిఇ సమర్పించిన సాంకేతిక నివేదికను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. రుతుపవనాల విస్తరణ దృష్ట్యా వర్షాలు కురుస్తున్న సమయంలో లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రస్తుత డ్రైన్ల కెపాసిటీ, వాటర్ ఫ్లో వేగం, అవరోధాల తొలగింపుపై ఇంజనీరింగ్ విభాగానికి జెడ్సి నారాయణ్ అమిత్ పలు సూచనలు చేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్టార్మ్ వాటర్ డ్రైన్ల అభివృద్ధి, మిస్సింగ్ లింక్‌ల పూర్తి కోసం డిపిఆర్ తయారీ వేగవంతం చేయాలని ఎన్స్‌పిఇ ని ఆయన ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్‌లో వేగంగా జరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రాధాన్యతను కనబరిచాలని, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్స్‌పిఇ నివేదిక ఆధారంగా తక్షణ, దీర్ఘకాలిక పనులను గుర్తించి టైమ్‌బౌండ్‌గా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. కాగా సమీక్షలో జోనల్ సిఇ శ్రీలక్ష్మి, ఎస్ఇ శంకర్, ఈఈ లు, ఏసీపీ లు, డిప్యూటీ ఈఈ లు, టెక్నికల్ టీమ్ పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## సీఐటీయూ కాప్రా సర్కిల్ కన్వీనర్ గణేష్



**కాప్రా, జూన్ 30 (జనం సాక్షి):** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జీవో నెం.12ను రద్దు చేసి సంక్షేమ పథకాలను ప్రభుత్వమే అమలు చేయాలని సీఐటీయూ కాప్రా సర్కిల్ కన్వీనర్ పి.గణేష్ డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను వెల్ఫేర్ బోర్డు ద్వారానే ప్రభుత్వమే నేరుగా అందించాలని కోరుతూ మంగళవారం కాప్రా మండల కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ కాప్రా సర్కిల్ కన్వీనర్ పి.గణేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను దెబ్బతీసే విధంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు అనుకూలంగా తీసుకొచ్చిన జీవో నెం.12ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన అన్ని పథకాలను ప్రభుత్వమే నేరుగా అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికులకు భారంగా మారిన సి.ఎస్.సి హెల్త్ టెస్ట్ విధానాన్ని రద్దు చేసి, ఉచితంగా హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం సంభవించిన కార్మికుల కుటుంబాలకు అందించే నష్టపరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని, 55 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.6 వేల కనీస పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ అడ్డాల వద్ద షెడ్లు, మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మార్వో కార్యాలయంలో అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నగేష్, శేఖర్, వెంకటాద్రి, నర్సింగ్, శివ, బాలరాజ్, భవన నిర్మాణ కార్మిక సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.




## మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా

# బ్యాంక్ ఆఫ్ బరోడా చురుకైన ప్రచారం

- 'నషా ముక్త్ భారత్ అభియాన్'కు పూర్తి మద్దతు
- దేశవ్యాప్తంగా 'నషా ముక్త్ భారత్ సప్తాహ్'లో భాగస్వామ్యం
- ఆరోగ్య, వ్యసన రహిత భారత్‌ను లక్ష్యంగా సామాజిక బాధ్యతతో బ్యాంక్ కృషి

**ముంబై, జూన్ 26, 2026 (జనం సాక్షి):** భారతదేశంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రభుత్వం చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్'కు బ్యాంక్ ఆఫ్ బరోడా పూర్తి మద్దతు ప్రకటించింది. జూన్ 17 నుంచి జూన్ 26 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ సప్తాహ్' ప్రచార కార్యక్రమంలో బ్యాంక్ చురుకుగా పాల్గొని విస్తృత ప్రచారం చేసింది. భారత ప్రభుత్వ సామాజిక న్యాయ మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో "నషా ముక్త్ భారత్ – విక్సిత్ భారత్ కీ పెహచాన్" అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ అభియాన్ ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి సామూహిక చర్యలను ప్రోత్సహించడం లక్ష్యం.
బ్యాంక్ ఆఫ్ బరోడా తన వెబ్‌సైట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, బ్రాంచ్ నెట్‌వర్క్ ద్వారా ప్రచార సందేశాలను విస్తృతంగా వ్యాప్తి చేసింది. శాఖలంతటా అవగాహన బ్యానర్లు, ప్రచార సామగ్రిని ప్రదర్శించి కస్టమర్లు మరియు సామాజిక వర్గాలను ఈ ఉద్యమంలో భాగస్వాములను చేసింది.
ఈ చొరవ ద్వారా ఆరోగ్యకరమైన, వ్యసన రహిత జీవితాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రగతిశీల మరియు బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి బ్యాంక్ తన నిబద్ధతను మరోసారి పునరుద్ఘాటించింది. మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగంగా దేశ నిర్మాణానికి బ్యాంక్ ఆఫ్ బరోడా సామాజిక బాధ్యతను నిర్వహిస్తోంది.

# ఆయిల్‌పామ్‌తోటలు పెంచి స్థిరమైన ఆదాయం సాధించండి

- 27 ఎకరాల్లో మెగా ప్లాంటేషన్ ప్రారంభం
- ప్రభుత్వం 90% సబ్సిడీ, నాలుగేళ్ల ప్రోత్సాహక నగదు
- ఎకరానికి సంవత్సరానికి రూ.2 లక్షల వరకు లాభాలు
- రైతులు ఆయిల్‌పామ్ వైపు మొగ్గు చూపాలి

**వీపనగండ్ల, జులై 1 (జనం సాక్షి):**
వీపనగండ్ల మండలం సంపత్‌రావుపల్లి గ్రామానికి చెందిన ప్రగతిశీల రైతు శ్రీహరి రావు తన 27 ఎకరాల వ్యవసాయ భూమిలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్‌ను ఘనంగా ప్రారంభించారు. జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమల అధికారి విజయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై ఆయిల్‌పామ్ మొక్కను నాటి, నీరు పోసి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ మాట్లాడుతూ, బోరు లేదా బావి ద్వారా సాగునీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టడం ద్వారా దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. నాటిన మూడేళ్ల తర్వాత పంట కోత ప్రారంభమవుతుందని, నెలకు రెండు సార్లు గెలల కోత చేపట్టవచ్చని, ఒకసారి నాటిన తోట 25 నుంచి 30 ఏళ్ల వరకు నిరంతరం దిగుబడి ఇస్తుందని వివరించారు. ఆయిల్‌పామ్ చట్టం 1993 ప్రకారం ప్రభుత్వం గుర్తించిన కంపెనీలు రైతులు ఉత్పత్తి చేసిన తాజా గెలలను నిర్ణీత ధరకు కొనుగోలు చేస్తాయని, మార్కెటింగ్ విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సరైన యాజమాన్యం పాటిస్తే ఒక్క ఎకరానికి సంవత్సరానికి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించడానికి మొక్కలు, డ్రిప్ సేద్యం పరికరాలపై 90 శాతం సబ్సిడీ అందిస్తోందని, ఆయిల్‌పామ్‌తో అంతర పంటల నిర్వహణ కోసం ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ప్రోత్సాహక నగదును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. ఉద్యాన శాఖ అధికారులు, కంపెనీలు క్షేత్రస్థాయిలో సాంకేతిక సలహాలు అందిస్తారన్నారు.
రైతు శ్రీహరి రావు మాట్లాడుతూ, గతంలో వరి సాగులో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నానని, ఇతర రైతుల అనుభవాలు చూసి ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని గుర్తించి 27 ఎకరాల్లో ప్లాంటేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. సాగునీటి వసతి ఉన్న రైతులందరూ ఆయిల్‌పామ్ సాగు వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంపత్‌రావుపల్లి సర్పంచ్ వెంకటేష్, ఉపసర్పంచ్ నాగముని, ఉద్యాన అధికారి కృష్ణయ్య, ప్రీ యూనిక్ ఏరియా మేనేజర్ కేథన్ రెడ్డి, ఉద్యాన విస్తరణ అధికారి శిరీష, క్లస్టర్ ఆఫీసర్ మహేష్‌తో పాటు సంపత్‌రావుపల్లి, తుంముకుంట గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో పోలీస్ అధికారుల పదవీ విరమణ వేడుకలు

- దీర్ఘకాలిక సేవలను కొనియాడిన సీపీ గౌష్ ఆలం
- ప్రజల శాంతి భద్రతలకు అంకితమైన జీవితాలు
- విశ్రాంత జీవితం సంతోషంగా గడపాలి




**కరీంనగర్ బ్యూరో, జూన్ 30 (జనం సాక్షి):** కరీంనగర్ జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం నిరంతర సేవలు అందించిన ఏడుగురు పోలీస్ అధికారుల పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై పదవీ విరమణ చేసిన అధికారులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.
ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, సమాజ రక్షణలో పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని, తమ జీవితంలో అత్యధిక భాగాన్ని ప్రజల శాంతి భద్రతల కోసం కేటాయించి విజయవంతంగా పదవీ విరమణ సాధించడం అభినందనీయమని కొనియాడారు. విధి నిర్వహణలో వారు చూపిన ప్రతిభ, క్రమశిక్షణ యువ పోలీసులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన అధికారులు: మహమ్మద్ ఇర్షాద్ (రిటైర్డ్ ఎస్సై, సీఎస్‌బి కరీంనగర్) 35 సంవత్సరాల 10 నెలల 26 రోజుల సేవ, బుర్ర ఎల్లయ్య గౌడ్ (రిటైర్డ్ ఎస్సై, సీఎస్‌బి) 40 సంవత్సరాల 08 నెలల 29 రోజుల సేవ, మొగురం సుధాకర్ (రిటైర్డ్ ఎస్సై, సీసీఆర్‌బి) 40 సంవత్సరాల 08 నెలల 29 రోజుల సేవ, బి. అంజయ్య (రిటైర్డ్ ఎస్సై, సీఎస్‌బి) 42 సంవత్సరాల 03 నెలల 07 రోజుల సేవ, జి. వెంకటస్వామి (రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, మానకొండూరు) 34 సంవత్సరాల 05 నెలల 28 రోజుల సేవ, తోట మల్లయ్య (రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, సీఆర్ కరీంనగర్) 34 సంవత్సరాల 05 నెలల 27 రోజుల సేవ, జి. ఉపేందర్ (రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, సైదాపూర్) 35 సంవత్సరాల 10 నెలల 10 రోజుల సేవలు అందించి పదవీ విరమణ పొందారు.
ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్ కిరణ్, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది మరియు పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# కరీంనగర్ మేయర్‌కు బీజేపీ జాతీయ అధ్యక్షుడి అభినందనలు

- కరీంనగర్ కార్పొరేషన్ విజయంపై నితిన్ నబిన్ ప్రశంసలు
- ప్రజలకు మెరుగైన సేవలందించాలని మేయర్‌కు సూచనలు
- సునీల్ బన్సల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కోలగాని శ్రీనివాస్
- రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా కరీంనగర్‌ను తీర్చిదిద్దుతామని మేయర్ వెల్లడి

**హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి):** హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల సందర్భంగా కరీంనగర్ నగరపాలక సంస్థ మేయర్ కోలగాని శ్రీనివాస్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకుని మేయర్ పదవిని దక్కించుకోవడంపై నితిన్ నబిన్ మేయర్ కోలగాని శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సన్మానించారు.
ఈ సందర్భంగా కరీంనగర్ నగరపాలక సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకువచ్చేలా, ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించే దిశగా పనిచేయాలని మేయర్‌కు నితిన్ నబిన్ సూచించారు. అనంతరం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పరిశీలకుడు సునీల్ బన్సల్‌ను కూడా మేయర్ కోలగాని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో పార్టీ విజయం సాధించడం పట్ల సునీల్ బన్సల్ హర్షం వ్యక్తం చేస్తూ మేయర్‌కు అభినందనలు తెలిపారు.
ఈ సందర్భంగా మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వయంగా అభినందించి సన్మానించడం తన రాజకీయ జీవితంలో చిరస్మరణీయ ఘట్టమని పేర్కొన్నారు. ఆయన



సూచనలను అమలు చేస్తూ కరీంనగర్ నగరపాలక సంస్థను రాష్ట్రంలోనే ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం స్మార్ట్ సిటీ, అర్బన్ డెవలప్‌మెంట్ నిధులతో నగరంలో పలు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లోని సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తూ పారదర్శక పాలన అందించడమే తమ లక్ష్యమని మేయర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల పనితీరులో మార్పు రావాలి

- అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం కృషి
- వచ్చే కౌన్సిల్ లోపు సమస్యలు పరిష్కరించాలి
- మొదటి కౌన్సిల్ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 30 జనం సాక్షి:** నగరపాలక సంస్థ లో ఆయా విభాగాల అధికారుల్లో మార్పు రావాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ మొదటి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని అన్ని డివిజన్లో అనేక సమస్యలు పేరుకుపోయాయన్నారు. కనీస మౌలిక సమస్యలు కూడా పరిష్కారం కాకపోవడం ఇబ్బందికరమైన విషయమన్నారు. అలాగే కార్పొరేటర్లకు సంబంధిత అధికారులు స్పందించడం లేదని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. స్పెషల్ ఫండ్ లేకపోవడంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, కళాభారతి తదితర పనులు అర్థంతరంగా నిలిచిపోయాయన్నారు. అనుకున్న స్థాయిలో పనులు జరగకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.

**యూడీఎఫ్ ఫండ్ కోసం కృషి**

తెలంగాణలోనే అతిపెద్ద నగరంగా నిలిచిన నిజామాబాద్ కు అర్బన్ డెవలప్మెంట్ ఫండ్ తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తున్నానన్నారు. యూడీఎఫ్ కింద రూ.400 కోట్లు వచ్చే అవకాశం ఉందని, ఇటీవలే ఇందుకు సంబంధించిన డీపీఆర్ తయారు చేయించామన్నారు. అలాగే మరో కేంద్ర పథకం కింద రూ.200 కోట్ల కోసం కూడా ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా నగరంలో యూజీడి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు పలు సమస్యలను ప్రస్తావించారు. ఎజెండాకు ముందు తమ సమస్యలను వినాలంటూ పట్టుబట్టారు. దీంతో కార్పొరేటర్ లందరికీ మాట్లాడే అవకాశాన్ని కల్పించారు. ప్రధానంగా మురికి కాలువలు శుభ్రం చేసే కార్మికుల సంఖ్యను పెంచాలని చెప్పారు. ఏళ్లుగా ఉన్న సమస్యలపై ఎన్నిసార్లు వినతులు అందించిన అధికారులు స్పందించడం లేదని ప్రశ్నించారు. శానిటేషన్ చాలా పెద్ద సమస్యగా మారిందని, ప్రజల నుంచి ఒత్తిడి పెరుగుతుందన్నారు. జెసిబిలు ఎక్కడికి వెళ్తున్నాయో తెలియడం లేదని, డీజిల్ కి మాత్రం బిల్లులు పెడుతున్నారన్నారు. యూజిడి పనులకు 180 మంది సిబ్బంది ఉండాల్సింది, 30 మంది మాత్రమే పనిచేస్తున్నారని, ఇలా అయితే పనులు ఎప్పుడు పూర్తవుతాయని ప్రశ్నించారు.




# ప్రభుత్వ విప్ ఇంటి వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 30 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారము రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల మున్సిపల్ కార్మికులు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధ సంస్థ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విప్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ పిఏ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణలు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ పర్మనెంట్ చేయాలని ఆలోపు మున్సిపల్ కార్మికులందరికీ కనీస వేతనాలు రూ 26 వేలు అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులు చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పని కల్పించాలని, మున్సిపల్ కార్మికులుగా పనిచేస్తూ 60 సంవత్సరములు నిండిన వారిని విధుల నుండి తొలగించినందున వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు నిరాహార దీక్షలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు బాలయ్య, సరిపల్లి నరేష్, ప్రధాన కార్యదర్శులు దుబ్బలచ్చయ్య, బాబా కిషన్, నాయకులు సుంకపాక పరశురాము, లక్ష్మి, పుప్పాల మమత, గాజుల వజ్రమ్మ, పెంట భారతి, కుమ్మరి మంగతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

# మా డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

## బృందావన్ కాలనీ వాసుల విజ్ఞప్తి



**హయత్ నగర్, జూన్ 30 (జనం సాక్షి) :** హయత్‌నగర్, లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ రోడ్ నెం. 2, 3 ప్రాంతాల్లో గత ఆరు సంవత్సరాలుగా డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య తీవ్రంగా కొనసాగుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ మురుగునీరు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ నీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వ్యాపించడంతో పాటు డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు.
ఈ సమస్యను పరిష్కరించాలని కాలనీ అసోసియేషన్ తరఫున పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, జోనల్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు వినతి పత్రాలు అందజేసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని బృందావన్ కాలనీ రోడ్ నెం. 2, 3లకు తక్షణమే కొత్త డ్రైనేజీ లైన్ మంజూరు చేసి, పనులు ప్రారంభించాలని కాలనీ అధ్యక్షుడు పారంద మహేష్ ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

- జడ్పీహెచ్ఎస్ కోళ్ల పడకల్ స్కూల్‌కు రెండు బస్సులను పంపిణీ రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్
- జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు

**మహేశ్వరం,జూన్30(జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు,మధ్యాహ్న భోజనం, పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగానే అందిస్తుందని డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మహేశ్వరం మండలం కోళ్లపడకల్ గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్,ఈఐ పీఎల్ సంస్థ నిర్వాహకులు స్కూల్ పిల్లల కోసం రెండు బస్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపొందిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్,ఈఐపీఎల్ సంస్థ నిర్వాహకులు జడ్పీహెచ్ఎస్ కోళ్ల పడకల్ స్కూలుకు రెండు బస్సులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలను మెరుగుపరచడానికి స్థానికులు, ఆర్థికంగా, ఉన్నత ఉద్యోగస్తులు, దాతలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కస్నా నాయక్, కోళ్ల పడకల్ గ్రామ సర్పంచ్ చేపంగి ప్రవీణ్,ఉప సర్పంచ్ ఆవుల మల్లేష్, మాజీ సర్పంచ్ హన్మగళ్ల చంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, దుబ్బచర్ల మాజీ సర్పంచ్ సిల్వా రెడ్డి, ఈఐపీఎల్ సంస్థ ప్రతినిధులు శ్రీధర్ రెడ్డి, కళ్యాణ్, రోటరీ క్లబ్ సభ్యులు కొండల్ రెడ్డి, కోళ్ల పడకల్ గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు డిపిఆర్ఓ తయారు చేయాలి

## నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి

**గోదావరిఖని, జనంసాక్షి :** నగరంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులకు సంబంధించి డీటైల్డ్ ప్రాజెక్ట్



రిపోర్ట్ తయారు చేస్తున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు . వార్డు సందర్శనలో భాగంగా మంగళ వారం 12 వ డివిజన్ విట్టల్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ షేక్ బాబా మియాతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు వార్డు సందర్శనలో భాగంగా సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ తో పాటు రోడ్లు, యుజిడి, కాలువలు అవసరమైన ప్రాంతాల వివరాలు నమోదు చేసుకుంటూ అంచనాలు రూపొందిస్తున్నామని అన్నారు. ప్రాధాన్యత ప్రకారం సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయిస్తామని అన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న విట్టల్ నగర్ డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని అన్నారు. చివరి ఇంటి వరకు అంబులెన్స్ వెళ్ళేలా ప్రతి వీధిలో రోడ్లు నిర్మిస్తామని అన్నారు. చెత్త బయట వేయకుండా మునిసిపల్ సిబ్బంది కి అందించి సహకరించాలని కోరారు. కాలువల్లో, రోడ్ల మీద చెత్త వేస్తే జరిమానాల బారిన పడకతప్పదని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా రోడ్డుకు అడ్డుగా ఉన్న పిచ్చి చెట్లు ,కొమ్మలు తొలగించారు. కాలువల్లో పూడిక తీశారు. ఫైవ్ ఇంక్ లైన్ మోరీ వద్ద ఖాళీ స్థలాన్ని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చుక్కల శ్రీనివాస్, దొంత శ్రీనివాస్, నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్, టి పి ఎస్ నవీన్, సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం, జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, సానిటరీ జవాన్ శ్రీనివాస్, మెప్మా ఆర్పిలు పాల్గొన్నారు.



# బతుకమ్మ ఆట, స్థలశీన్ని కబ్జాలు కాకుండా పునుద్ధరించాలి

**నిజాంపేట్ జూన్ 30( జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో మహిళలు బతుకమ్మ ఆడే స్థలాన్ని ఇటీవల బడ్డీ కొట్టు వ్యాపారాల కోసం షెడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ప్రజలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో మంగళవారం బరంపేట్ ఇందిరమ్మ కాలనీలో పర్యటించి బతుకమ్మ ఆట స్థలంతో స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రజలు దృష్టికి తీసుకురావడంతో, ఈ సందర్భంగా హనుమంత రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా సాంప్రదాయ మహిళల బతుకమ్మ స్థలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని అందుకు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని అలాగే ప్రజలు కోరిన విధంగా బతుకమ్మ స్థలశీ లో ఎటువంటి ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకొని పునద్ధరిస్తామని తెలిపారు. అదేవిధంగా కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై కూడా స్పందిస్తూ, అవసరమైన చోట్ల విద్యుత్ లైట్లు, స్ట్రీట్ లైట్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, పారిశుధ్య పనులు, అంతర్గత రహదారుల అభివృద్ధి మరియు ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత అధికారు లతో సమన్వయం చేసి దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీ వాసులు, స్థానిక ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి

- రాయికల్‌లో రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ వీక్షించిన కలెక్టర్ బి. సత్యప్రసాద్
- నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి : అధికారులు



**రాయికల్, జూన్ 30 (జనంసాక్షి):** వానాకాలం 2025–26 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం నిధుల విడుదల కార్యక్ర మాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌ను జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ రైతు వేదికలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సాగు పనులు ప్రారంభించేందుకు రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రైతు అభ్యున్నతే ప్రభు త్వ ధ్యేయమని పేర్కొన్నారు. పెట్టుబడి సాయం, సాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల లభ్యత వంటి అన్ని అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని చెప్పారు.
అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ప్రభుత్వం జమ చేస్తున్న పెట్టుబడి సాయాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు నాణ్యమైన విత్తనాలతో సకాలంలో సాగు పనులు ప్రారంభించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు అందు బాటులో ఉండి పంటల సాగు, ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణ, శాస్త్రీయ సాగు విధానాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులు నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువుల పట్ల అప్రమత్తంగా ఉండి ధ్రువీకరించి న విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. రైతు భరోసా నిధుల విడుదల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# సర్ ప్రక్రియ వేగవంతం చేయండి

- కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, ప్రణవ్ బాబు
- బిఎల్ఓ లకు దిశా నిర్దేశం,ప్రతి ఓటు చాలా ముఖ్యం
- బూత్ ఏజెంట్లు బిఎల్ఓలతో కలిసి తప్పనిసరిగా పాల్గొనాలి
- ఇక్కడున్న ఎమ్మెల్యే కాంట్రవర్సీలకు తప్ప,ప్రజలకు చేసింది ఏం లేదు



**జమ్మికుంట, జూన్ 30 (జనం సాక్షి):** ప్రతి బూత్ కి సంబంధించి ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొనేలా చూడాలని,బూత్ లెవెల్ ఆఫీసర్ వచ్చినప్పుడు ఓటర్లకు వారి అనుమానాలు నివృత్తి చేయడానికి బిఎల్ఏ లు కృషి చేయాలని,ఓట్ల సమగ్ర సవరణలో జాగ్రత్తగా ఉండాలని కరీంనగర్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.మంగళవారం రోజున జమ్మికుంట పట్టణంలోని 4,5,19,27,28,30 వార్డులలో బూత్ కో ఆర్డినేటర్లు,బూత్ లెవెల్ ఏజెంట్లతో ఓటు సమగ్ర సవరణ (సర్) కార్యక్రమ సరళిని పరిశీలించారు.ఈ సందర్భంగా వార్డులలో తిరుగుతున్న సమయంలో ఓటర్లు పలు ప్రశ్నలు వేయగా వాటికి బూత్ లెవెల్ ఆఫీసర్లతో మాట్లాడి అనుమానాలు నివృతి చేసే విధంగా మాట్లాడా రు. అనంతరం నిర్వహించిన పత్రికా సమావే శంలో వారు మాట్లాడుతూ ప్రతి పది బూత్ లకు ఒక్కరితో జమ్మికుంట పట్టణానికి 4గురు కో ఆర్డినేటర్లను నియమి ంచడం జరిగిందని, వారు నిరంతరం ఏజెంట్లతో సమన్వయం చేస్తూ వేగవంతం చేయాలని సూచించారు. ఇక్కడున్న ఎమ్మెల్యే కాంట్రవర్సీలకు తప్ప ప్రజలకు చేసింది ఏది లేదని,కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలను విమర్శించే ముందు 10ఏళ్ళు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు మేం చేసిన పనులు ఎందుకు చేయలేదో ఆత్మ విమర్శన చేసుకోవాలని మండిపడ్డారు. కాళేశ్వరం కట్టి లక్షల కోట్లు దోచుకొని, కూళేశ్వరంగా మార్చి తెలంగాణ ప్రజలకు అన్యాయం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా హామీలు నెరవేరుస్తూ పేదవాడి ప్రభుత్వంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజురా బాద్ నియోజవర్గ సర్ కో ఆర్డినేటర్,జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు,మున్సిపల్ కౌన్సిలర్లు,యూత్ నాయకులు,మహిళ నాయకురాళ్లు, సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ మున్సిపల్‌ను మరింత అభివృద్ధి చేస్తా

- సుల్తానాబాద్ అంటే ఎంతో మమకారం
- తెలంగాణ రాష్ట్ర విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు
- మున్సిపల్ సాధారణ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



**సుల్తానాబాద్,జూన్ 30(జనంసాక్షి) :** సుల్తానాబాద్ పట్టణానికి తనకు ఉన్నటువంటి సంబంధం చాలా గొప్పదని, చిన్ననాటి నుండే ఇక్కడే విద్యాభ్యాసం చేసి, ఇక్కడే స్నేహితుల మధ్య తిరిగానని అందుకే తనకు సుల్తానాబాద్ అంటే మమకారమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు స్పష్టం చేశారు. మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హాజరై అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఇప్పటికే సుల్తానా బాదును రూపాయలతో సుందరంగా తీర్చిదిద్దానని రానున్న రోజులలో మరింత అభివృద్ధి చేసి తీరుతానని తెలిపారు. అధికారులు ప్రజా ప్రతినిధులు నిబద్ధతతో పనిచేయాలని,ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ పాలకవర్గం నిష్పక్షపాతంగా పారదర్శకంగా అన్ని వార్డులను అభివృద్ధి చేయాలని సూచించారు.వార్డుల అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని నిధులు మంజూరు చేస్తానని తెలిపారు.వర్షకాలం నేపథ్యంలో ప్రజలు వివిధ రోగాల బారిన పడకుండా తగు సూచనలు జాగ్రత్తలు చేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్‌ను ఆదేశించారు. జరగనున్న అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించి నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడవద్దని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి మున్సిపల్ అభివృద్ధికి తగు ప్రణాళికలు చేస్తామని, పలు వార్డులలో కరెంటు పోల్స్ పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చొరవ చూపాలని సూచించారు. పారిశుద్ధ్యపనులు, త్రాగు నీటి సరఫరా, వీధి దీపాలు తదితర సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.అభివృద్ధిలో ఏమాత్రం రాజీ పడేది లేదని, ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తిప్పికొట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత,మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, ఉట్ల వర ప్రదీప్, భాకం సాయికిరణ్,చింతల రాజు,సిద్ధ తిరుపతి, తౌర్రి కొండ ప్రభాకర్, గరిగే శోభారాణి శ్రీనివాస్, వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్, కందునూరి సమత కుమార్, గా దాసు మంజుల రవీందర్, కల్వల శంకరమ్మ ఓదెలు, అమీరిశెట్టి శ్రావణి రాకేష్, తో పాటు మున్సిపల్ మేనేజర్ అలీముద్దీన్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావును ముందుగా మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ స్వాగతం పలికారు.అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు.

# అభివృద్ధికి అవసరమైన 80 ఎకరాలు మాత్రమే తీసుకుంటాం

- సర్వే పనులకు రైతులు సహకరించాలి : మంథని ఆర్డీవో సురేష్
- రైతులను తప్పుదోవ పట్టిస్తే చట్టపరమైన చర్యలు
- రామగుండం ఏసీపీ రమేష్



**ముత్తారం, జూన్ 30 (జనంసాక్షి) :** ప్రాంత అభివృద్ధి కోసం చేపట్టనున్న ప్రాజెక్టుకు అవసరమైన 80 ఎకరాల భూమిని మాత్రమే సేకరిస్తామని, రైతులు అపోహలకు గురి కావద్దని మంథని ఆర్డీవో సురేష్ స్పష్టం చేశారు. మంగళవారం ముత్తారం ధర్యాపూర్ గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని ఆర్డీవో సురేష్ మాట్లాడుతూ 144,145 సర్వే నెంబర్ ప్రభుత్వ భూముల నుండి ప్రాజెక్టు కోసం గుర్తించిన మొత్తం భూమిలో అభివృద్ధికి అత్యవసరంగా అవసరమైన 80 ఎకరాలు మాత్రమే తీసుకుంటాం. ఒక్క గుంట కూడా అదనంగా తీసుకోం."అని అన్నారు. ప్రభుత్వం భూ సేకరణ చట్టం–2013 ప్రకారం భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించే ఆలోచన చేస్తే ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో నేటి నుండి సర్వేపనులు చేపడతారని రైతులందరూ సిబ్బందికి సహకరించాలని అన్నారు.
గ్రామంలోని రైతులు అపోహలు వద్దు. ఏ సందేహం ఉన్నా నేరుగా నన్ను లేదా తహశీల్దార్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం ఈ సమావేశంలో పాల్గొన్న రామగుండం ఏసీపీ మాదత రమేష్ మాట్లాడుతూ, "ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలి. కొందరు కావాలని రైతులను పక్కదారి పట్టిస్తూ అవాంఛనీయ సంఘటనలకు ప్రేరేపిస్తు.రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు" అని హెచ్చరించా రు. అదేవిధంగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవారిపై కేసులు నమోదు చేస్తాం అని అన్నారు.
సమావేశంలో పాల్గొన్న ధర్యాపూర్ రైతులు "మార్కెట్ రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలి. భూమి కోల్పోయే వారికి ఉద్యోగం కల్పించాలి" అని కోరారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ రాపెల్లి రాజయ్య,మంథని సీఐ బుద్దె స్వామి,ముత్తారం ఎస్సై రవి కుమార్,రామగిరి ఎస్సై శ్రీనివాస్,నాయకులు మాజీ ఎంపీపీ ముత్తయ్య, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి,సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు నూనె కుమార్, సర్పంచ్ అత్తే చంద్రమౌళి,మాజీ సర్పంచ్ గాధం స్రవంతి శ్రీనివాస్, రామగాళ్ల మధుకర్, రైతులు తిత్తుల శ్రీనివాస్, జంగ స్వామి, దొడ్ల కమలాకర్,తిత్తుల తిరుపతి,కందునూరి రాజేశం,దొడ్ల నరేష్,చంద రవి, పోలీస్ సిబ్బంది తోపాటు అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
01 జూలై 2026

## వైభవంగా గోదావరి పుష్కరాల ఏర్పాట్లు

**ధర్మపురిలో పుష్కర ఘాట్లను పరిశీలించిన మంత్రి అడ్లూరి**



**జగిత్యాల, జూన్ 30 (జనంసాక్షి) :** గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వ్యాఖ్యానించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ధర్మపురిలోని పుష్కర ఘాట్లను మంత్రి అడ్లూరి పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గోదావరి పుష్కరాల కోసం ఏడాది ముందుగానే పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భక్తుల రద్దీ, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, పారిశుధ్యం, రవాణా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మంత్రి అడ్లూరి చెప్పుకొచ్చారు. ధర్మపురి, కోటిలింగాల వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.117 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వ్యవస్థలు, భక్తుల విశ్రాంతి కేంద్రాల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గత గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులు ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేయనున్నామని స్పష్టం చేశారు. రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, అత్యవసర వ్యవస్థలను బలోపేతం చేసి భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. పుష్కరాల నిర్వహణలో అనుభవం ఉన్న కన్సల్టెన్సీల సహకారంతో పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి గోదావరి పుష్కరాలను దేశవ్యాప్తంగా ఆదర్శవంతమైన ఆధ్యాత్మిక మహోత్సవంగా నిర్వహించడమే తమ లక్ష్యమని వివరించారు. పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించిన పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పుకొచ్చారు. భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

# తెలంగాణపై విషం చిమ్మిన చౌహాన్

- ఏపీని పొగుడుతూ తెలంగాణపై అక్కసు



**న్యూఢిల్లీ, జూన్ 30 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఓ రకంగా విషం కక్కారు. ఇటీవల కేంద్ర మంత్రులు అడపాదడపా విషం కక్కుతూనే ఉన్నారు. రాష్ట్ర అభివృద్దికి సంబంధించి మన రాష్ట్రానికే చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులకు పెద్దగా పట్టింపు లేదు. ఏదైనా పని కావాలని పట్టుబట్టి చేయించడం లేదు. ఈ క్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రుల సమావేశంలో శివరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ పథకాల అమలులో తెలంగాణ వెనుకబడి ఉందన్నారు. అంతేగాకుండా ఆంధ్రా మాత్రాం భేషుగ్గా పనిచేస్తోందని స్తుతించారు. చంద్రబాబు దయాదాక్షిణ్యాలతో మోదీ సర్కార్ నడుస్తోంది. అందుకే ఈ మధ్య బాబును పొగడం కేంద్రమంత్రులు బాగా అలవాటు చేసుకున్నారు. పనులు గట్టెక్కించుకునే క్రమంలో చంద్రబాబు కూడా మోడీని ఆకాశానికి ఎత్తుతున్నారు. కానీ మధ్యలో తెలంగాణలో తెగడాల్సిన పనిలేదు. కానీ ఇప్పుడు జరుగుతున్నది అదే. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు హాజరయ్యారు. ఇందులో తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం గురించి ఆయన మాట్లాడుతూ.. పీఎంజీఎస్‌వై రహదారుల పనులు వేగవంతం కావాలని పేర్కొన్నారు. పెండింగ్ రహదారి పనులు పూర్తి చేయాలని సూచించారు. పీఎం ఆవాస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి మంత్రితోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని వారికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అలాగే గ్రామాల అభివృద్దే వికసిత్ భారత్‌కు పునాది కావాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన సూచించారు. జులై 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్రామీణ యోజన అమలు చేస్తున్నట్లు చెప్పారు. నిధుల వాటా సమయానికి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ కోరారు. పనిలో పనిగా గ్రామీణాభి వృద్ధి పథకాల అమలులో ముందంజలో ఉందంటూ ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు కురిపించారు. వీబీజీఆర్‌ఎంఏజీఐ నోటిఫికేషన్ పూర్తి చేసిన రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉందన్నారు. జులై 2వ తేదీన తిరుపతిలో వీబీజీఆర్‌ఎంఏజీఐ ప్రారంభిస్తామని ప్రకటించారు. జాతీయ ప్రారంభోత్సవానికి ఆతిథ్య రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల్లో ఏపీకి స్థానం దక్కిందని మంత్రి శివరాజ్‌సింగ్ వివరించారు. ఇదంతా కేవలం కావాలని చేస్తున్న ప్రకటనగానే చూడాలి. తెలంగాణపై విషం కక్కేందుకు ఎలాంటి అవకాశాన్ని కూడా కేంద్రం వదులుకోవడం లేదు. ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉన్నది పక్కన పెడితే కనీసం అభివృద్ధికి కేంద్రం తోడ్పాటు ఇవ్వడం లేదు. అభివృద్ధి ఆగిపోతే అది ప్రజలకే నష్టం అన్న జ్ఞానం ఇక్కడ ఉన్న ఇద్దరు మంత్రులకు కలగడం లేదు. బాబును పొగడడం కోసం ఎంతకైనా తెగిస్తారనడానికి ఇదే నిదర్శనం.

## ఐపీఎస్ అధికారి సునీల్‌కు క్యాట్‌లో చుక్కెదురు


- సస్పెన్షన్ ఎత్తేయాలన్న పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ, జూన్ 30 (జనంసాక్షి) :** ఏపీకి చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ కు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)లో చుక్కెదురైంది. తనపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను క్యాట్ కొట్టివేసింది. తీవ్ర అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌లో ఉన్న సునీల్‌కుమార్ నేడు సర్వీస్ నుంచి రిలీవ్ అయ్యేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈరోజైనా తనకు రిలీఫ్ ఇవ్వాలని సునీల్ కుమార్ క్యాట్‌ను కోరారు. మంగళవారం ఉదయం జరిగిన విచారణలో సునీల్ వాదనలు విన్న క్యాట్.. సస్పెన్షన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది. సునీల్ కుమార్‌పై పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ, నేర విచారణలకు ఎలాంటి మినహాయింపులు లేవని, అవి కొనసాగుతాయని మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆయనకు లభించాల్సిన పెన్షన్ ప్రయోజనాలు అఖిల భారత సర్వీసుల నియమాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలకు లోబడి ఉంటాయని పేర్కొంది.

## అసోంలో భారీ ఆపరేషన్

- అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారం స్వాధీనం



**గౌహతి, జూన్ 30(జనంసాక్షి) :** అస్సాం పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 37 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.55 కోట్లకు పైనే ఉంటుందని పోలీసులు వెల్లడించారు. బహుశా అస్సాం పోలీస్ చరిత్రలోనే ఇంతపెద్ద మొత్తంలో బంగారం సీజ్ చేసిన ఘటన ఇదే కావొచ్చని డీసీపీ శాంభవి మిశ్రా తెలిపారు. గువాహటిలో అక్షయ్ బన్సోడే (32) అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. బంగారం అక్రమ రవాణాపై నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో ఈ ఆపరేషన్ చేపట్టాం. 24 క్యారెట్ల బంగారు కడ్డీలతో పాటు దాదాపు 13 గ్రాముల బరువు ఉన్న వెండి ముక్కలు స్వాధీనం చేసుకున్నాం అని ఆమె తెలిపారు. ఈ ముఠాకు అంతర్జాతీయ గోల్డ్ స్మగ్లింగ్ ముఠాతో సంబంధం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదొక భారీ అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాకు సంబంధించినదిగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. బన్సోడే గతంలో మూడుసార్లు 20 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలించాడని, తాజాగా నాలుగోసారి తరలిస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు.


## కార్వాన్‌లో ఎన్నికల అధికారి వాసం పర్యటన

- సర్ ప్రక్రియ పరిశీలించిన అధికారి

**హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి) :** రాష్ట్ర ఎన్నికల సంఘం అదనపు కార్యదర్శి వాసం వెంకటేశ్వర్ రెడ్డి మంగళవారం కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం, చార్మినార్ నియోజకవర్గ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఇఆర్ఓ సరితారెడ్డితో కలిసి పర్యవేక్షించారు. బిఎల్ఓలు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకున్న అపోహలపై వారికి నివృత్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ యొక్క ముఖ్య ఉద్దేశాలను , ఆవశ్యకతలపై ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ సిఇఒ మాట్లాడుతూ 'సర్' ప్రక్రియ కేవలం ఓటరు జాబితాను పరిశీలించి అర్హులైన ఓటర్లందరికి ఓటుహక్కు కల్పించడం, అనర్హులైన ఓటర్లను తొలగించడం అని అన్నారు. సర్ ప్రక్రియపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది పూర్తి పారదర్శకతతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో బిఎల్ఒలు, సూపర్ వైజర్లు సహకరించాలని ఆదేశించారు. పూర్తి చేసిన ఫారాలను తప్పనిసరిగా బిఎల్ఒలకు అందజేసిన వారి పేర్లే ఓటర్ జబితాలో చేర్చడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# మాతో పెట్టుకుంటే పుట్టగతులుండవు

- మేము జెండా పండుగ కోసం పోస్టర్లు వేసుకుంటే చింపేస్తారా?
- దాదాగిరి, గుండాగిరి చెల్లదు.. మేము తిరగబడితే మీ జెండాలు కనబడవు
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ను హెచ్చరించిన కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తమతో పెట్టుకుంటే పుట్టగతులుండవని తెలంగాణ రాష్ట్ర సేన (టీఆర్ఎస్) అధినేత కల్వకుంట్ల కవిత ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను హెచ్చరించారు. ముషీరాబాద్ దయారా మార్కెట్ చౌరస్తాలో టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఇప్పటికే తెలంగాణలో మూడు పెద్ద పార్టీలు ఉండగా ఇంకొక పార్టీ ఎందుకు అనే ప్రశ్న మీకు రావచ్చని, కానీ ఆ పార్టీలు, వాళ్ల జెండాలతో ప్రజలకు ఏం లాభం జరిగిందో ఒక్కసారి ఆలోచించాలని అన్నారు. అన్ని వర్గాలకు మంచి జరిగేందుకు మేము పసుపు, నీలం, ఆకుపచ్చ రంగులతో మా పార్టీ జెండాను రూపొందించుకొని కొత్త పార్టీగా ప్రజల ముందుకు వచ్చామని, తెలంగాణ వచ్చిన తర్వాత మన జీవితాలు మారిపోతాయని మనమంతా భావించామని, అయితే అప్పుడు పదివేలు వచ్చే జీతం ఇప్పుడు 11 వేలు వస్తుందని, కానీ అన్ని వస్తువుల రేట్లు పెరిగాయని, ముఖ్యంగా స్కూల్ ఫీజులు భారీగా పెరిగాయని తెలిపారు. పేద మధ్య తరగతి ప్రజలు విద్య, వైద్యం కోసం జేబులు గుల్ల చేసుకుంటున్న పరిస్థితి చూస్తున్నామన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం ఫ్రీ గా అందితే పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో మేలు చేసినవాళ్లమవుతామని, అందుకే నేను పాంచజన్యం పేరుతో ఐదు కీలక అంశాలను ప్రాధాన్యంగా పెట్టుకున్నామని, కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ ఫ్రీ గా అందించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, యువతకు ప్రభుత్వాలు ఉద్యోగాలు ఇవ్వటం లేదు. వారు స్వయం ఉపాధి పొందేందుకు ఆర్థిక సాయం కూడా చేయటం లేదని తెలిపారు. కానీ మన యూత్ ను నమ్మి వారికి ప్రభుత్వమే 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు లోన్లు టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఇస్తుందని, ఇక మనకు అన్నం పెట్టే రైతులు కూడా బాగుండాలని...రైతును రాజును చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని, ఇక అందరికీ సామాజిక న్యాయం అందాలి. అన్ని కులాలు, మతాల వారికి అవకాశాలు రావాలని, తెలంగాణ ఉద్యమంలో ముషీరాబాద్, రాంనగర్ నుంచి ఎంతో మంది పోరాటం చేశారని, కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టిన సరే వాళ్లు రాష్ట్రం కోసం పోరాటం చేస్తే వారికి ఏమీ మంచి చేయలేదని, ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామని ఈ కాంగ్రెస్ సర్కార్ ఇవ్వలేదని తెలిపారు. వారికోసం జులై 2 ఉప్పల్ భగాయత్ లో భూపోరాటం చేస్తున్నామన్నారు. ముషీరాబాద్‌లో రెండు సార్లు లక్ష్మణ్, రెండు సార్లు ముఠా గోపాల్ ఎమ్మెల్యే గా గెలిచారని, ఇప్పటికీ డ్రైనేజీ, నీళ్ల కోసం కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లకు అవకాశం ఇస్తే వాళ్లు ప్రజలకు ఏమీ చేయలేదని, మీ ఆడబిడ్డ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. రెండు నెలల క్రితం పుట్టిన మా పార్టీని చూసి ఎప్పటి నుంచో ఉన్న పార్టీలు భయపడుతున్నాయని తెలిపారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో పోటీ చేస్తామని, అసెంబ్లీ ఎన్నికల్లోనూ అన్ని స్థానాల్లో టీఆర్ఎస్ పోటీ చేస్తుందని తెలిపారు.




## సీఎం ప్రజావాణి చొరవతో చిన్నారికి పునర్జన్మ

**రూ. 6 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించిన చిన్నారెడ్డి**

**సీఎం ఏ. రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన చిన్నారి తల్లిదండ్రులు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సీఎం ప్రజావాణి చొరవతో 17 నెలల చిన్నారికి పునర్జన్మ లభించింది. శ్వాసకోస ఇబ్బందులు, నిమోనియా వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆ చిన్నారికి మెరుగైన వైద్య చికిత్సలు అందేలా ఆస్పత్రి వర్గాలతో మాట్లాడి ఫీజు తగ్గేలా చూసి, ఆ చిన్నారి తల్లిదండ్రులకు సీఎం ప్రజావాణి అండగా నిలిచింది. ప్రస్తుతం ఆ చిన్నారి కోలుకొని పూర్తి ఆరోగ్యవంతులయ్యారు. ఆస్పత్రి ఖర్చుల కింద రూ.ఆరు లక్షల సీ.ఎం.ఆర్.ఎఫ్. చెక్కును సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జి. చిన్నారెడ్డి మంగళవారం జరిగిన సీఎం ప్రజావాణిలో ఆ చిన్నారి తండ్రి భానోత్ శ్రీనుకు అందజేశారు. మహబూబాబాద్ జిల్లా కే – సముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన క్యాబ్ డ్రైవర్ బానోతు శ్రీను, అంజలి దంపతుల 17 నెలల కుమారుడు వైష్ణవ్ నందన్ తీవ్ర జబ్బుతో ఆరోగ్యం క్షీణించడంతో గత జనవరి 7న సీఎం ప్రజావాణికి వచ్చి వారు సమస్య వివరించారు. సీఎం ప్రజావాణి బృందం చొరవ తీసుకొని ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందేలా చూశారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లకు చిన్నారి తల్లిదండ్రులు భానోత్ శ్రీను, అంజలి ధన్యవాదాలు తెలిపారు.

**సీఎం ప్రజావాణిలో 408 దరఖాస్తులు**


మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 234వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 408 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 220, రెవెన్యూ శాఖకు సంబంధించి 58, మున్సిపల్ శాఖకు 22, ప్రవాసి ప్రజావాణికి 03 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 105 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

## వెంకటేశ్వర్ల సేవలు చిరస్మరణీయం: కోమండూరు శశి కిరణ్



**హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి) :** లోక్ భవన్‌లో టైలర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఎం. వెంకటేశ్వర్లు అందించిన సేవలు చిరస్మరణీయమని గవర్నర్ సంయుక్త కార్యదర్శి కోమండూరు శశి కిరణ్ అన్నారు. ఎం. వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం సాయంత్రం లోక్ భవన్ సుధర్మ లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి కోమండూరు శశి కిరణ్ మాట్లాడుతూ లోక్ భవన్‌లో 36 సంవత్సరాలు టైలర్ ఎం. వెంకటేశ్వర్లు అంకితభావంతో సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఉద్యోగ ప్రస్థానంలో ఎం వెంకటేశ్వర్లు తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సెక్రటరీ జి. పల్లవి, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మట్టయ్య,ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం, అసిస్టెంట్ కంప్ట్రోలర్ హెరాల్డ్, మేనేజర్ దీపక్, ఓఎస్డీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370